RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 01.08.2025 | సంపుటి :12 సంచిక : 13 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

స్పీకర్ కోర్టుకు అనర్హత బంతి

3 నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

దీనిపై పార్లమెంట్ కూడా సమీక్షించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు. కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు

జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీం కోర్టులో సుధీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ పక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు మిగతా 2లో..

న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

- తీర్పుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టీకరణ
- స్పీకర్‌కు సుప్రీం సూచనలు మాత్రమే చేసింది
- గతంలో ఫిరాయింపులను మరచిన బీఆర్ఎస్
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు
- అభివృద్ధి కోసమే పార్టీ మారా..
- ఫిరాయింపు ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

హైదరాబాద్(జనంసాక్షి): ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు మూడు నెలల మిగతా 2లో..

సుప్రీం తీర్పును స్వాగతించిన బీఆర్ఎస్

- ఫాంహౌజ్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ సమీక్ష
- 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవు
- తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన కేటీఆర్

గజ్వేల్(జనంసాక్షి): ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు భేటీకి హాజరయ్యారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఈ అంశంపై నేతల మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మిగతా 2లో..

సుప్రీం తీర్పు మంచి పరిణామం

స్వాగతించిన తెలంగాణ బీజేపీ

హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి స్వాగతించింది. ఈ తీర్పును తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటి షన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకో వాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు- చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. మిగతా 2లో..

కాళేశ్వరంపై నివేదిక సమర్పించిన కమిషన్

- నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి అందజేసిన జస్టిస్ పీసీ ఘోష్
- 15 నెలల పాటు కొనసాగిన విచారణ
- కేసీఆర్, ఈటెల , హరీశ్‌లు సహా 115 మంది వాంగ్మూలం సేకరణ

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. మిగతా 2లో..

నలుగురు కొత్త జడ్జీల ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

3లో

సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ

పాక్‌కు చెక్..

చీనాబ్‌పై భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు 'సావల్‌కోట్' పునరుద్ధరణ

శ్రీనగర్(జనంసాక్షి): సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది. కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం మిగతా 2లో..

పాకిస్థాన్ నుంచి భారత్

చమురుకొనే రోజులొస్తాయ్

అందుకు అమెరికా సాయం చేస్తుంది

భారత్-రష్యాలు తమ డెడ్ ఏకానమీలను మరింత పతనం చేసుకుంటున్నాయి

ఆ రెండు దేశాలు ఏ వ్యాపారం చేసుకున్నా నాకు అవసరం లేదు మరోసారి ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి): పహల్గామ్ ఉగ్ర ఘటన తరువాత భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. ఇప్పుడు వీటికి ఆజ్యం పోసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు వ్యాఖ్యలు భారత్‌కు ఆగ్రహాన్ని తెప్పించేలా ఉన్నాయి. ఏదో ఒకరోజు భారత్‌కు పాకిస్తాన్ చమురు అమ్ముతుందని, అందుకు తాము పాక్‌కు సాయం చేస్తామని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌పై 25శాతం సుంకాలు విధిస్తామని మిగతా 2లో..

భారత ఎకానమీ గురించి ట్రంప్ నిజమే చెప్పారు

మన ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని ప్రతి ఒక్కరికీ తెలిసిపోయింది : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని ప్రతి ఒక్కరికి తెలిసిపోయిందన్నారు. మిగతా 2లో..

ట్రంప్ సుంకాల ప్రభావాన్ని

అధ్యయనం చేస్తున్నాం

దేశ ప్రయోజనాలపై రాజీపడేది లేదు

లోక్‌సభలో ప్రకటించిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోను న్నట్లు- వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూ ష్ గోయల్ అన్నారు. ఆగస్టు 1 నుంచి భారత వస్తువులపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు- అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రక¯టనపై.. లోక్‌సభలో పీయూష్ గోయల్ మాట్లా డారు. ఈ టారిఫ్ ప్రభావాలను ప్రభుత్వం అధ్య యనం చేస్తోందన్నారు. భారత ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా భారత్-అమెరికా రెండు దేశాలు మిగతా 2లో..

ఎన్ఐఏ ప్రాసిక్యూషన్ విఫలం

- నిర్దోషులుగా మాలేగావ్ నిందితులు
- ముంబయి ప్రత్యేక కోర్టు కీలక తీర్పు

ముంబయి(జనంసాక్షి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. "ఈ కేసుకు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం వర్తించదు. ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ మిగతా 2లో..

రోహింగ్యాలు చొరబాటుదారులా.. శరణార్థులా?

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి): రోహింగ్యాల విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆసక్తికర ప్రశ్నలు అడిగింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. రోహింగ్యాలను శరణార్థులుగా ప్రకటించేందుకు అర్హులేనా? అని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.. అసలు రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేల్చాలని ఆదేశించింది. ఒకవేళ రోహింగ్యాలు చొరబాటుదారులైతే బహిష్కరిస్తున్నారా? మిగతా 2లో..

సీఐడీ మాజీ చీఫ్ లొంగిపోవాల్సిందే..

సంజయ్‌కు ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రీం

9లో

ఐవీఎఫ్‌కోసం వస్తే సరోగిసి వైపు..

సృష్టి కేసు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించిన పోలీసులు

హైదరాబాద్(జనంసాక్షి): సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రత కేసులో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీ వైపు దారిమళ్లించి లక్షలు దండుకున్నట్లు గుర్తించారు. నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. మిగతా 2లో..

ఉదయం సీఎంతో చిట్‌చాట్..

మధ్యాహ్నం బీజేపీకి గుడ్‌బై

ఎన్డీయే నుంచి వైదొలిగిన పన్నీర్ సెల్వం

వార్త 2 లో

మొన్న అమెరికా.. నిన్న ఆస్ట్రేలియా.. నేడు ఐర్లాండ్

భారతీయులపై పెరుగుతున్న దురాగతాలు

తాజాగా ఐర్లాండ్‌లో భారత సంతతి యువకునిపై జాత్యాహంకార దాడి

డబ్లిన్(జనంసాక్షి): ఐర్లాండ్‌లో నివసిస్తున్న భారత సంతతికి చెందిన యువకునిపై జాత్యహంకార దాడి చోటుచేసుకుంది. ఆ యువకుడు తన అపార్ట్‌మెంట్‌కు సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా, అకస్మాత్తుగా ఆరుగురు యువకులు అతనిపై దాడి చేశారు. ఐర్లాండ్‌లో తాను ప్రేరేపిత జాత్యహంకార దాడిని ఎదుర్కొన్నానని భారత సంతతికి చెందిన డాక్టర్ సంతోష్ యాదవ్ ఘటనా క్రమాన్ని 'లింక్డ్‌ఇన్'లో వివరించాడు. ఐర్లాండ్‌లో జాత్యహంకార యువకుల బృందం తనపై దాడి చేసిందని డాక్టర్ సంతోష్ యాదవ్ ఆరోపించారు. 'నేను రాత్రి భోజనం చేసిన తర్వాత, నా అపార్ట్‌మెంట్ సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా, ఆరుగురు యువకుల బృందం నాపై వెనుక నుంచి దాడి చేసింది. తరువాత వారు మిగతా 2లో..

గాజా నుంచి హమాస్ వైదొలగాలి

అరబ్ దేశాల హెచ్చరిక

టెల్ అవీవ్(జనంసాక్షి): గాజాపై సంపూర్ణ ఆధిఎ¯త్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్న హమాస్‌కు అరబ్ దేశాల నుంచి గట్టి షాక్ తగిలింది. కొన్నాళ్లుగా గాజాపై హమాస్ సాగిస్తున్న దారుణ మారణకాండను అరబ్ దేశాలు ఖండిస్తూ, ఒక ప్రకటన విడుదల చేశాయి. దానిలో గాజా నుంచి హమాస్ తక్షణం వైదొలగాలని హెచ్చరించాయి. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో జరిగిన సమావేశానికి సహ అధ్యక్షత వహించిన ఫ్రాన్స్.. సౌదీ అరేబియా చేసిన ఈ ప్రకటనను స్వాగ¯తించింది. దీనిని చారిత్రాత్మక ఘటనగా పేర్కొంది. సౌదీ అరేబియా, ఖతార్, ఈజిప్ట్, మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
01.08.2025

సుప్రీం తీర్పు మంచి పరిణామం

కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ-లు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటు-ందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

13 ఏళ్ల బాలికకు 40 ఏళ్ల వ్యక్తితో వివాహం!..

రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో ఘటన

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి(జనంసాక్షి): 8వ తరగతి చదువుతున్న ఓ 13 ఏళ్ల బాలికకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కందివాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్(40)తో మే 28న బాల్య వివాహం జరిపించారు బాలికకు అత్తగారింటికి వెళ్లేందుకు ఇష్టం లేకపోవడంతో ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో ఉపాధ్యాయులు తహసీల్దార్ రాజేశ్వర్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌లకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన అధికారులు బాలికకు వివాహం చేసిన తల్లి స్రవంతితో పాటు వరుడు శ్రీనివాస్ గౌడ్, పురోహితుడు ఆంజనేయులు పెళ్ళి సంబంధం చూసిన వ్యక్తి పెంటయ్యపై కేసు నమోదు చేసిన అధికారులు బాలికను సఖి సెంటర్‌కు తరలించారు...

భారతీయులపై పెరుగుతున్న దురాగతాలు

నా కళ్లద్దాలను లాక్కొని, వాటిని పగలగొట్టి, నా తల, ముఖం, మెడ, ఛాతీ, చేతులు, కాళ్లపై ఆగకుండా కొట్టారు. దీంతో నాకు తీవ్ర రక్తస్రావం అయింది. గార్డ్‌కు కాల్ చేసి,విషయం చెప్పాను. అంబులెన్స్ నన్ను బ్లాంచర్స్‌టౌన్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. నా చెంప ఎముక విరిగిందని వైద్య బృందం నిర్ధారించింది. ఇప్పుడు నన్ను ప్రత్యేక వైద్యసంరక్షణ కోసం రిఫర్ చేశారు' అని సంతోష్ యాదవ్ పేర్కొన్నారు.ఐర్లాండ్‌లో మైనారిటీలపై హింస పెరుగుతున్నదని, అయినా అధికారులు నేరస్థులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని సంతోష్ యాదవ్ ఆరోపించారు. దాడులు చేశాక వారు స్వేచ్ఛగా పారిపోతున్నారని, తిరిగి దాడి చేయడానికి ధైర్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఐర్లాండ్ ప్రభుత్వం, డబ్లిన్‌లోని భారత రాయబార కార్యాలయం, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఐర్లాండ్‌లోని భారత రాయబారి అఖిలేష్ మిశ్రాలను సంతోష్ యాదవ్ తన పోస్టుకు ట్యాగ్ చేశారు.యాదవ్ తన పోస్ట్‌లో రెండు ఫోటోలను ఉంచారు. ఒక ఫొటోలో అతని ముక్కు నుంచి రక్తం కారుతున్నట్లు ఉండగా, మరొక ఫోటోలో అతని చేతిలో విరిగిన కంటి అద్దాలు ఉన్నాయి. డాక్టర్ సంతోష్ యాదవ్ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం ఆయన కాన్పూర్ విశ్వవిద్యాలయం నుండి బీటెక్ పూర్తి చేశాడు. తరువాత ఘజియాబాద్‌లోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ నుండి పీహెచ్‌డీ చేసాడు. ప్రస్తుతం సంతోష్ యాదవ్ సీనియర్ డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో ఉంటున్న ఆయన ఒక టెక్ కంపెనీకి సహ వ్యవస్థాపకునిగా ఉన్నారు.

గాజా నుంచి హమాస్ తక్షణం వైదొలగాలి

టర్కీ, జోర్డాన్‌తో సహా పలు అరబ్, ముస్లిం దేశాలు తాజాగా 2023, అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులను ఖండించాయి. గాజా స్ట్రిప్‌లో పాలస్తీనియన్ సమూహం దాని పాలనను ముగించాలని కోరాయి. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి (యూఎన్) సమావేశంలో అరబ్ లీగ్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), 17 ఇతర దేశాలు ఒక ప్రకటన చేశాయి. హమాస్ తన చెరలో ఉంచిన బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశాయి.

ఐవీఎఫ్ కోసం వస్తే సరోగసి వైపు

ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయం లోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం బయట పడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అసిస్టెంట్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

రోహింగ్యాలు చొరబాటుదారులా..శరణార్థులా?

అని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, రోహింగ్యాల బహిష్కరణకు కేంద్రం, రాష్ట్రాలు తీసుకున్న చర్యలేంటని కూడా అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది.న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపంకర్ దత్తా ఇంకా ఎన్.కోటీశ్వర్ సింగ్ లతో కూడిన బెంచ్ ఈ అంశంపై విచారణ జరిపింది. రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేలాక ఇతర సమస్యలు, పర్యవసానాల గురించి మాట్లాడవచ్చని అభిప్రాయపడింది. ఒకవేళ రోహింగ్యాలు శరణార్థులుగా ప్రకటిస్తే, వారికి ఏ రక్షణలు లేదా హక్కులు ఉన్నాయో చెప్పాలని బెంచ్ ప్రశ్నించింది. అక్రమ వలసదారులైతే, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? వారిని నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని పిటిషనర్ల తరఫున న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని పేర్కొంది. కాగా, రోహింగ్యాలు దేశంలో 12 రాష్ట్రాల్లో నివసిస్తున్నట్లు- కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ, ఢిల్లీ, యూపీ, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో అధికంగా, మరికొన్ని రాష్ట్రాల్లో తక్కువగా రోహింగ్యాలు ఉన్నట్టు- సమాచారం.

ఎన్ఐఏ ప్రాసిక్యూషన్ విఫలం

డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు" అని తీర్పు వెలువరించే సమయంలో కోర్టు వెల్లడించింది. ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది. తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తనను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.మహారాష్ట్ర లోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది.

స్పీకర్ కోర్టుకు అనర్హత బంతి

తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్ని లాగా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది.ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. దీనిని బిఆర్ఎస్ నేతలు స్వాగతించాలి.

న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే తదుపరి నిర్ణయానికి వెళ్తామని అన్నారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు పై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని కూడా మేము పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తా అని అన్నారు. ఇదిలా ఉంటే.. పార్టీ మారిన పది మందిపై తొలుత తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో.. విచారణ షెడ్యూల్ కోసం సింగిల్ బెంచ్ జడ్జి తెలంగాణ స్పీకర్‌కు నాలుగు వారాల గడువు విధించారు. అయితే డివిజనల్ బెంజ్ దానిని కొట్టేసింది. ఇక ఇవాళ్టి తీర్పులో ఫిరాయింపులపై చర్యల విషయంలో స్పీకర్‌కు సుప్రీం కోర్టు మూడు నెలల కాలపరిమితి విధించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధిస్తూ సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉప రాష్ట్రపతి హోదాలో ఓ కార్యక్రమానికి హాజరైన ధన్‌ఖడ్.. సుప్రీం కోర్టుపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. పార్లమెంటే సుప్రీం అని. ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులే రాజ్యాంగ ప్రకారం అల్టిమేట్ మాస్టర్స్ అని అన్నారాయన. 'సుప్రీం కోర్టు రాష్ట్రపతికి గడువు విధించడం తగదు. ఇప్పుడు జడ్జీలు శాసనాలు చేస్తారు, కార్యనిర్వాహక విధులు నిర్వర్తిస్తారు, సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు' అని విమర్శించారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య శక్తులపై అణుక్షిపణి ప్రయోగించకూడదు అని తీవ్ర వ్యాఖ్య చేశారాయన. అయితే.. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్న పిటిషన్ విచారణ సమయంలో సుప్రీం కోర్టు పరోక్షంగా ధన్‌ఖడ్ వ్యాఖ్యలపై స్పందించింది. ఇప్పుడు మేమే కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేస్తున్నామన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. న్యాయస్థానాలు అంటే తమకు గౌరవం ఉందని సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. "రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలను పార్టీలో చేర్చుకుంది. ఆ పార్టీ విధానాలు నచ్చక బయటకు వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ వేసి ప్రభుత్వం కూలిపోతుందని పగటి కలలు కన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉంటుందని తెలిసినా నాయకులు నానా యాగి చేశారు" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

స్పీకర్‌కు సుప్రీం సూచనలు మాత్రమే చేసింది

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీం కోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. దీనిపై ఎవరికి వారు వక్ర భాష్యాలు చెబుతున్నారని అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గతంలో వారు చేసిన ఫిరాయింపుల గురించి మాటాడాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు వారు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది వారే. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు.

అభివృద్ధి కోసమే పార్టీ మారా..: ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

భారత రాష్ట్ర సమితినుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహిస్తానని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకటరావు అన్నారు.కోర్టు తీర్పులపై తమకు గౌరవం ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా భద్రాచలం అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్న ఆయన.. ఒకవేళ ఉపఎన్నికలు వచ్చినా మళ్లీ గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి తనకు ముఖ్యమని అన్నారు. వెనకబడ్డ భద్రాచలం విషయంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతించిన బీఆర్ఎస్

'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నానన్నారు

రాహుల్ మీరు చెప్పే రాజ్యాంగాన్ని ఆచరిస్తారా?:హరీశ్

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు- పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.ఈ అంశాన్ని హరీశ్‌రావు ప్రస్తావిస్తూ.. మీరు బోధించే వాటిని మీరు ఆచరించగలరా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. మీ తండ్రి దివంగత రాజీవ్ గాంధీ 52వ రాజ్యంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్‌ను మీరు కోరుతారా..? అని ప్రశ్నించారు.

భారత ఎకానమీ గురించి ట్రంప్ నిజమే చెప్పారు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి మినహా ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్? ఈ నిజాన్ని చెప్పినందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. భారత్ డెడ్ ఎకానమీగా మారిపోయిందని ప్రపంచం మొత్తానికి తెలుసని, కేవలం ఒక అదానీకి సాయం చేసేందుకు భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీపై మండిపడ్డారు."విదేశాంగ మంత్రి పార్లమెంట్‌లో మాట్లాడుతూ మనకు అద్భుతమైన విదేశాంగ విధానం ఉందని చెప్పారు. ఒకవైపు అమెరికా దూషిస్తుంది. మరోవైపు చైనా మన వెనుక పడుతుంది. మీరు ప్రపంచ వ్యాప్తంగా అఖిలపక్ష బృందాలను పంపినా ఒక్క దేశం కూడా పాకిస్థాన్ వైఖరిని ఖండించలేదు. అసలు మీరు దేశాన్ని ఎలా నడిపిస్తున్నారు? పరిస్థితి మొత్తం గందరగోళంగా ఉంది. ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్?, చైనా పేరు ఎత్తలేదు. పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి భోజనం చేసి భారీ విజయాన్ని సాధించామని అంటున్నారు." అని రాహుల్ మండిపడ్డారు.అంతకుముందు మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ఆర్థిక వ్యవస్థలకు డెడ్ ఎకానమీగా అభివర్ణించారు. భారత నుంచి చేసుకునే దిగుమతులపై 25శాతం సుంకం ప్రకటించారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తాను లెక్కచేయబోనని తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు. ఆ రెండు దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకుంటున్నాయని ఆయన తెలిపారు. న్యూఢిల్లీతో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామని, దానికి కారణం భారత్ అత్యధికంగా సుంకాలు విధించడమేనని ఆరోపించారు. ఈ సందర్భంగా రష్యా, అమెరికా కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ స్పష్టంచేశారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్‌పైనా ఆయన విరుచుకుపడ్డారు. మెద్వదేవ్ ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు.

ట్రంప్ సుంకాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం

సమతుల్య, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులు, చిన్న వ్యాపారులు, ఎంఎంఈలు వంటి వర్గాల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోందని గోయల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్‌పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు- పేర్కొన్నారు. ఆ మొత్తం ఎంతన్నది పేర్కొనలేదు. ఈ నిర్ణయాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో బుధవారం ఈ మేరకు ఆయన పలు పోస్టులు పెట్టారు. అమెరికాతో భారత వర్తక విధానాలు, నిబంధనలను అత్యంత దారుణమైనవిగా అభివర్ణించారు. భారత్ మా మిత్ర దేశమే. కానీ వర్తక, వాణిజ్య సంబంధాల విషయంలో ఆ దేశంతో అంతా సజావుగా లేదన్నారు

పాక్ నుంచి భారత్ చమురుకొనే రోజులొస్తాయ్

ప్రకటించిన కొన్ని గంటలకు ట్రంప్ మరోమారు భారత్- పాక్ మధ్య చిచ్చుపెట్టే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చమురు నిల్వలను భారీగా అభివృద్ధి చేసేందుకు పాకిస్తాన్ తాజాగా అమెరికాతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నదని, అయితే ఈ భాగస్వామ్యానికి ఏ కంపెనీ సారథ్యం వహించాలనే విషయాన్ని ఇంకా నిర్ణయించలేదని ట్రంప్ పేర్కొన్నారు. బహుశా పాకిస్తాన్ ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ ద్వారా ఈ ప్రకటన చేశారు. తాము పాకిస్తాన్‌తో ఒక ఒప్పందాన్ని ముగించామని, ఈ మేరకు పాకిస్తాన్- యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా చమురు నిల్వలను భారీగా అభివృద్ధి చేయడంలో కలిసి పనిచేస్తాయన్నారు. ఇదే పోస్ట్‌లో ట్రంప్.. అమెరికాను చాలా సంతోషపెట్టాలని కోరుకునే పలు దేశాల నేతలతో మాట్లాడానని పేర్కొన్నారు. కొన్ని దేశాలు సుంకాల తగ్గింపు కోసం అమెరికాకు ఆఫర్లు ఇస్తున్నాయని, ఇది దేశ వాణిజ్య లోటును భారీగా తగ్గిస్తుందని పేర్కొన్నారు.తాము వైట్ హౌస్ లో వాణిజ్య ఒప్పందాలపై కసరత్తు చేస్తూ చాలా బిజీగా ఉన్నామని, ఈరోజు మధ్యాహ్నం దక్షిణ కొరియా వాణిజ్య ప్రతినిధి బృందాన్ని కలుస్తానన్నారు. దక్షిణ కొరియా ప్రస్తుతం 25శాతం సుంకాలను కలిగివుందని, అయితే వారు ఆ సుంకాలను తగ్గించే ప్రతిపాదనతో ఉన్నారని, అందుకు వారు

నాడు జలకళ.. నేడు వెలవెల

- మధ్యమానేరుకు రాని వరద నీరు
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు..
- ప్రాజెక్టులో 7 టీఎంసీల నీరు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 31 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటి మధ్య మానేరు ప్రాజెక్టుకు వర్షాకాలం ప్రారంభమైన వరద నీరు రాకపోవడంతో రైతన్నలు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది నీటి నిల్వ 9 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ఏడు టీఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది.కాలేశ్వరం నుంచి ఎత్తిపోతలు ఈ ఏడాది కూడా లేకపోవడంతో ఎల్లంపల్లి, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు,మానేరు, మూలవాగు నీటిపైనే రైతన్నలు ఆశలు పెట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టిఎంసిల సామర్థ్యంతో మధ్య మానేరు ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టులో 2017 నుంచి నీటిని నిలువ చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ,ఎల్లంపల్లి,కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా,మానేరు, మూలవాగు నుంచి జలాశయానికి నీరు వచ్చి చేరుతుంది. ఇదే సమయంలో జలాశయం నుంచి కరీంనగర్ ఎల్ఎండి డ్యాం,ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ ప్రాజెక్టు కోనరావుపేట మండలంలోని మలకపేట ప్రాజెక్టు, సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ కు, వేములవాడ రాజరాజేశ్వర స్వామి గుడి చెరువు మిషన్ భగీరథకు నీటిని తరలిస్తున్నారు.

జలాశయానికి చేరని నీరు. ఆందోళనలో అన్నదాతలు

మధ్య మానేరుకు ఎస్సారెస్పీ నుంచి ఇటు మానేరు మూల వాగు ఎల్లంపల్లి నుంచి ఇప్పటివరకు వరద నీరు రాలేదు. గత నాలుగేళ్లలో జూన్, జూలై నెలలో భారీగా వరద నీరు చేరి జలాశయం కళకళలాడేది. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరు వచ్చే పరిస్థితి లేదు.జలశయం కుడి కాలువ,గేట్ల ముందు భాగంలో వరినార్ల కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిని విడుదల చేయాలని ఇల్లంతకుంట మండలం పోత్తూరు బ్రిడ్జిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు.

జలాశయంలో 7.38 టీఎంసీల నీరు

మధ్య మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 27.5 టీఎంసీలు 318 మీటర్లు కాగా ప్రస్తుతం 7.38 టీఎంసీల నీరు 307.01 మీటర్ల నీరు మాత్రమే నిల్వ ఉంది.గత ఏడాది ఇదే సమయంలో 9.88 నీరు నిల్వ ఉంది. వర్షాలు సకాలంలో సమృద్ధి లేకపోవడంతో ప్రాజెక్టులో నీరు రాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూలే విజ్ఞాన్ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తా

- బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో కట్టుబడి ఉంది
- కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది
- బీసీ సంఘాల భేటీలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

హైదరాబాద్ (జనంసాక్షి) : గత సాధారణ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన డిక్లరేషన్ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ రిజర్వేషన్లు పెంచడంతోపాటు రాష్ట్ర బడ్జెట్ లో నిధులు పెంచి బీసీ సబ్ ప్లాన్ తీసుకువచ్చే దిశగా ఆలోచిస్తున్నామని, బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాదులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బీసీ ప్రతినిధుల బృందం మాత్మ జ్యోతిబాపూలే భవన్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు, ఈ సందర్భంగా బీసీ డిమాండ్లపై సుదీర్ఘంగా జజుల శ్రీనివాస్ గౌడ్ తో బట్టి విక్రమార్క చర్చించారు. మొదటగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం 20000 కోట్లు కేటాయించాలని ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోని బీసీలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావాలని, నాలుగు సంవత్సరాలుగా ఉన్న బీసీ విద్యార్థుల ఫీజుల బకాయిలను తక్షణమే చెల్లించాలని హైదరాబాదులో ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కునే విధంగా మహాత్మ జ్యోతిబాపూలే నాలెడ్జ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్ల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ కాంట్రాక్టులలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచడంతోపాటు బీసీలకు నిధుల కేటాయింపులలో కూడా అన్యాయం జరగకుండా చూస్తామని, బీసీ సబ్ప్లాన్ కూడా సరైనటువంటి సమయంలో తీసుకు వస్తామని, హైదరాబాదులో మాత్మ జ్యోతిబాపూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నామని ఆయన అన్నారు బీసీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ మెంట్ తో పనిచేస్తుందని ఇందులో ఎవరికి ఎలాంటి సందేహాలను లేవని, బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్నిశలు పనిచేస్తుందని ఆయన తెలిపారు ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలను తీసుకుంటుందని బట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలిసిన వారిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకూర్మ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి రమ, బిసి మేధావుల వేదిక నాయకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శ్రీనివాస్, బీసీ నేతలు రావులకు నరేష్ ప్రజాపతి, జాజుల లింగం గౌడ్, వేముల నాదం గౌడ్, పానుగంటి విజయ్, జి నాగరాజు గౌడ్, సత్యం గౌడ్, ఇంద్రమ్ రజక, గౌతమ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు

మంచిరేవులలో చిక్కిన చిరుత

హైదరాబాద్, జూలై31 (జనంసాక్షి) : 12 రోజులుగా అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మంచిరేవులలో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత పడిందని అధికారులు ప్రకటించారు. దీనిని నల్లమల్ల అడవిలో వదిలిపెట్టనున్నట్లు- తెలిపారు. నగర శివారులో గత రెండు వారాలుగా చిరుత సంచారం జనాలను భయాందోళనకు గురి చేస్తూ వచ్చింది. మృగవని పార్క్ గ్రేహౌండ్స్ పరిధిలో చిరుత సంచారం కలకలం రేపింది. దీనిని బంధించేందుకు 8 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు- చేశారు అధికారుల. అయినా అది చిక్కకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టింది. ఈ క్రమంలో గత అర్ధరాత్రి దాటాక మొయినాబాద్ ఎకోటిక్ పార్క్‌లో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత చిక్కింది. దీనిని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని అధికారులు తెలిపారు.

సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన పోలీసులు

హైదరాబాద్, జూలై31 (జనంసాక్షి) : సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రత కేసులో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీ వైపు దారిమళ్లించి లక్షలు దండుకున్నట్లు గుర్తించారు. నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం బయట పడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియన్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

నలుగురు కొత్త జడ్జీల ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితుల్యైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ విరీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.

సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

హైదరాబాద్(జనంసాక్షి): సంగారెడ్డి సిగాచి పరిశ్రమ ప్రమాదంపై హైకోర్టులో పిల్ దాఖ ల్కింది. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై ప్రభు త్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిగాచిపై న్యాయవాది కె.బాబూరావు పిల్ దాఖలు చేశారు. పరిశ్రమలో భద్రతా చర్యలు తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ దొరకలేదని హైకోర్టుకు తెలియజేశారు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని, సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని.. ప్రమాదంపై ఏర్పాటు- చేసిన కమిటీ- నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ కోరారు.ఇదిలా ఉండగా.. ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఇకపై అన్ని జిల్లాల్లో కెమికల్, ఫార్మా, హై-రిస్క్ పరిశ్రమలన్నింటికీ చెక్ లిస్ట్‌ను ప్రకటిస్తామన్నారు. నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిగాచి ఫ్యాక్టరీ ఘటనలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సాధారణ సూచనలను పాటించి ఉంటే, కంపెనీకి రూ. 20 నుంచి రూ. 25 లక్షలకు మించి ఖర్చు అయ్యేది కాదన్నారు. ఇప్పుడు ప్రమాదం జరగడం వల్ల రూ. 50 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

పట్టాదారుల వివరాలను పారదర్శకంగా ఎంక్వయిరీ చేయాలి

రెండు రోజుల్లో రిపోర్ట్ అందించాలి

రాష్ట్ర సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ములుగు ప్రతినిధి, జులై 31(జనంసాక్షి) : రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు, పహానీలోని వివరాలపై పారదర్శకంగా ఎంక్వయిరీ చేయాలని రాష్ట్ర సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతులు ఆయా జిల్లా కలెక్టర్ లను ను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి సిసిఎల్ఎ, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్, రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్ట్ (రీ-సర్వే) లో ఎపికైన ఖమ్మం, సంగారెడ్డి, జగిత్యాల, మహబూబ్ నగర్, ములుగు జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన ఖమ్మం, సంగారెడ్డి, జగిత్యాల, మహబూబ్ నగర్, ములుగు జిల్లా లలోనీ ఒకొక్క గ్రామం వారిగా డ్రోన్ రీ సర్వే వివరాలను, ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులకు పలు, సూచనలు సలహాలు అందజేశారు. మిగిలి ఉన్న భూ రీ సర్వే నంబర్లకు సర్వే సిబ్బందికి పంపించి సర్వే పూర్తి చేసి, సర్వే చేసిన పట్టదారుల వివరాలు, పహాని లోని వివరాలు ఎంక్వైరీ చేసి 2 రోజులలో రిపోర్ట్ పంపించాలని కలెక్టర్లను కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ. సర్వే సిబ్బందికి ఫీల్డ్ వెళ్ళి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారులు పూర్తి పారదర్శకంగా.. చట్టం ప్రకారం.. నిబంధనల మేరకు వ్యవహరించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, వెంకటాపురం తహసిల్దార్ వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

నక్సలైట్ పేరుతో వసూళ్లు

రైస్‌మిల్ ఓనర్ వద్ద రూ.25లక్షలు డిమాండ్

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

చిట్యాల, జులై 31 (జనంసాక్షి) : కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే దురాశతో నక్సలైట్‌నని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను చిట్యాల పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీఐ మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్ కలిసి గురువారం వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన పల్లెపాటి గోపాల్ రావు మావోయిస్టు అవతారమెత్తాడు. నక్సలైట్ పేరుతో తనే ఒక లేఖను సృష్టించి దాదాపు పది రోజుల క్రితం చిట్యాల మండలంలోని శాంతినగర్ సమీపంలోని లక్ష్మీనరసింహా రైస్ మిల్లు కు చెందిన ఓనర్ శేఖరయ్యను కలిశాడు. మావోయిస్టు పార్టీ వారు ఇచ్చినట్లుగా ఒక కవర్ ని అందించగా, శేఖరయ్య ఆ కవర్ని చించి అందులోనే మావోయిస్టు వారు రాసినట్లుగా గోపాల్ రావు రాసిన విషయాన్ని చదవగా పార్టీ యొక్క ఆదేశానుసారం మీరు పార్టీ కోసం 25 లక్షల రూపాయలను పార్టీకి చెందారూపంగా డబ్బులు ఇవ్వాలని లేఖలో కోరడం జరిగింది. ఇప్పటికిప్పుడు ఒక లక్ష రూపాయలను ఇవ్వాలని, లేకుంటే చంపేస్తానని బెదిరించాడు. 25 లక్షల రూపాయలను వారం రోజుల్లో ఇవ్వని మీరు ప్రాణాలతో ఉండరని శేఖరయ్యతో చెప్పి హెచ్చరిస్తూ అతన్ని భయపెట్టాడు. ఈ క్రమంలో మిల్లు ఓనర్ శేకరయ్య బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం గోపాల్ రావు తన ద్విచక్ర వాహనంపై లక్ష్మీ నరసింహ రైస్ మిల్లు కి వెళ్లే టైం లో కైలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీ చేస్తుండగా గోపాల్ రావు ని పట్టుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. కాగా అతనిని రిమాండ్కు తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. నక్సలైట్ల పేరుతో ఎవరైనా చందాల వసూళ్లకు పాల్పడితే నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సిఐ మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్ కోరారు.

జాతీయ స్థాయి టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో

బీసీ గురుకుల విద్యార్థులకు పతకాలు

అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్ , ఎంజెపి కార్యదర్శి సైదులు

హైదరాబాద్ (జనంసాక్షి) : జాతీయ స్థాయిలో జరిగిన టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. యాచ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణ గుట్ట గర్ల్స్ స్కూల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న జె. శిరీష వెండి పతకం సాధించగా, మునుగోడు బాయ్స్ స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న వి. హనుమంతు కాంస్య పతకం సాధించాడు. కల్వకుర్తి గర్ల్స్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న ఎం. అక్షర జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, సంయుక్త కార్యదర్శి తిరుపతి అభినందించారు. బీసీ గురుకుల విద్యార్థులకు చదువుతో పాటు వారిలో నైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇందులో భాగంగా బిసీ గురుకుల విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆద్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నామని కార్యదర్శి సైదులు తెలిపారు. ఈ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు వారు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. జూలై 1వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు మూడో విడత శిక్షణ ఇచ్చామని వారిలో జాతీయ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్ , 2028 జరిగే ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ఆయన తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ములుకనూరు సహకార మహిళా డెయిరీ సేవలు భేష్

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్...

భీమదేవరపల్లి, జులై 31(జనం సాక్షి) : ములుకనూరు మహిళా సహకార సంఘం ద్వారా నిర్వహిస్తున్న పాల డెయిరీ నిర్వహణ అదేవిధంగా ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అందిస్తున్న సేవలు బాగున్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.భీమదేవరపల్లి మండలంలోని మహిళా సహకార పాల సంఘం డెయిరీ,ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. అనంతరం మహిళా సహకార సంఘం ఆధ్వర్యంలో డెయిరీ ఎప్పుడు ప్రారంభించారు. ఎంత పెట్టుబడి,ఎలాంటి వనరులతో ప్రారంభించారు. గ్రామాలలో పాలు సేకరణ ఎలా చేస్తారని సేకరించిన పాల క్వాలిటీని ఎలా పరీక్షిస్తారని,రవాణా సదుపాయాలు, ప్రాసెసింగ్ ఏ విధంగా చేస్తుంటారని, రోజువారీ ఎన్ని వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందని, గ్రామాల వారీగా సేకరించిన పాలను ఏ విధంగా పాశ్చరైజేషన్, శీతలీకరణ, పాల ప్యాకెట్ల తయారీ బాగాలు, రవాణా వాహనాలను మహిళా సంఘాల ప్రతినిధులకు ఎంత ప్రయోజనం కలుగుతుందని,ఏయే ప్రోడక్టకు లాభలు వస్తుంటాయని,డెయిరీ జీఎం భాస్కర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డెయిరీ జనరల్ మేనేజర్ మారుపాటి భాస్కర్ రెడ్డి పవర్ ప్రజెంటేషన్ ద్వారా డెయిరీ కార్యకలాపాలను వివరించారు. ఈ బ్యాంక్ ద్వారా ఎన్ని రికవరీ ఎలా చేస్తూంటారని, సేవింగ్స్ చేస్తున్న ఖాతాదారులకు ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నరని కలెక్టర్ జీఎం రామ్ రెడ్డి,సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు వాటి వివరాలు తెలియజేశారు.సహకార రంగంలో దశాబ్దాలుగా మహిళా డెయిరీ,సహకార గ్రామీణ పరపతి సంఘం విజయవంతంగా సాగుతుండడం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిఅర్ డి మేన శ్రీను,జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహశీల్దారు రాజేష్,ఎంపీడీవో వీరేశం, అగ్రికల్చర్ అధికారి ఈవో పద్మ, ఏపీఎం దేవానందం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి శ్రీధర్, మహిళా సహకార సంఘం డైరెక్టర్లు,ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఆవరణలో బాలకృష్ణ సందడి

స్పీకర్ ఓంబిర్లతో మర్యాదపూర్వక భేటీ

సమస్యలపై మనోహర్ లాల్ ఖట్టర్‌కు వినతులు

న్యూఢిల్లీ, జూలై31 (జనంసాక్షి) : పార్లమెంటు ఆవరణలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ- అయ్యారు. తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులు సమర్పించారు. అంతకుముందు బాలకృష్ణకు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను రోజూ పార్లమెంటుకు వచ్చేందుకు ఉపయోగించే సైకిల్‌ను చూపించారు. దీంతో బాలయ్య అక్కడ సరదాగా కాసేపు సైకిల్ నడిపారు. అనంతరం టీడీపీ ఎంపీలతో కలిసి స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌ను ఘనంగా సన్మానించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆ తరువాత కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ- అయ్యారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను ఆయనకు సమర్పించారు. తెలుగు దేశం పార్టీ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడుతోందని బాలకృష్ణ ఈ సందర్భంగా అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
1 ఆగస్టు 2025

గాజా రక్తపాతం

భారత కార్పొరేట్ల మౌనం అర్థాంగీకారమా?

గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడుతున్నది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలను హత్య చేస్తున్నది. ఇరవై నెలల కాలంలోనే 60 వేల మందిని పొట్టనబెట్టుకున్నది. అయితే ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధానికి భారతదేశానికి చెందిన పలు కార్పొరేట్ కంపెనీల సహకారం ఉందనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. జేఎన్ యూ, ఏఎంయూ, హైదరాబాద్ యూనివర్సిటీలతోపాటు బెంగుళూరు, ముంబైలోని చాలా విద్యాసంస్థల్లో, అనేక ప్రధాన నగరాల్లో ఈ కంపెనీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆయా కంపెనీల ఆఫీసుల ఎదుట సైతం ప్రొటెస్ట్స్ సైతం చేస్తున్నారు. ఆయా కంపెనీల ఉత్పత్తులను బాయ్ కాట్ చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలపై ఆయా కంపెనీలు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సైలెన్స్ దేనికి సంకేతం అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. మౌనం అర్థాంగీకారమేనా? అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ప్రధాన కంపెనీలపైనే..

ఇజ్రాయెల్, అక్కడి కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి, గాజా నరమేధానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నారని భారతదేశానికి చెందిన కొన్ని కార్పొరేట్ కంపెనీలపై ప్రధానంగా ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయి. అందులో టాటా గ్రూప్, అదానీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. ఆయా కంపెనీలు ఇజ్రాయెల్, అక్కడి స్థానికత కలిగిన కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నాయి. ఈ కంపెనీలు ఇజ్రాయెల్ కు గాజాలో నరమేధానికి వాహనాలు, డ్రోన్స్, డిఫెన్స్ పరికరాలు వంటి వాటిని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ సేవలు సైతం అందిస్తున్నట్లు సైతం విమర్శలు ఉన్నాయి.

భయపడుతున్నారా?

గాజా నరమేధంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నా ఆయా కంపెనీలు స్పందించడం లేదు. కనీస స్పష్టత ఇవ్వడం లేదు. తాము గ్లోబల్ మార్కెట్ లో ఉంటున్నందున ఇజ్రాయెల్‌తో, అక్కడి కంపెనీలతో తమ వ్యాపార సంబంధాలు సాధారణ వాణిజ్య కార్యక లాపాల్లో భాగమేనని ఆయా కంపెనీలు భావిస్తూ ఉండవచ్చు. అయితే ఈ అంశంపై బహిరంగంగా స్పందించడం ద్వారా వ్యాపార ఒప్పందాలకు ఆటంకం కలుగుతుందని ఆయా కంపెనీలు భయపడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జవాబు చెప్పాల్సిన అవసరం లేదా?

జెనోసైడ్‌లో ఇజ్రాయెల్‌కు సహకారమందిస్తున్నారనే ఆరోపణలు వచ్చిన వాటిల్లో భారత్ కు చెందిన టాప్ కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో కోట్లాది మంది తమ నగదును పెట్టుబడిగా పెట్టి ఇన్వెస్టర్లుగా మారారు. అంతేకాకుండా కోట్లాది మంది ఆయా కంపెనీల ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలు తమ ఇన్వెస్టర్లు, వినియోగదారులకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అయితే బహిరంగంగా ట్రేడ్ చేయబడే సంస్థలు పారదర్శకతను పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బాధ్యత కలిగిన వ్యాపార సంస్థలుగా తమను తాము చెప్పుకునే ఈ కంపెనీలు తమపై వచ్చిన ఆరోపణలకు కచ్చితంగా జవాబు చెప్పాల్సి ఉంటుంది. తద్వారా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడుకోవాలి. మరోవైపు ఈ ఆరోపణలు చట్టపరమైన ఫిర్యాదులుగా మారితే, ఆయా కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలను బహిరంగంగా లేదా చట్టపరమైన వేదికలపై చెప్పాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంటుంది.

బలపడుతున్న 'బీడీఎస్' ఉద్యమం

ఇజ్రాయెల్ సైనిక చర్యలను నరమేధంగా ఆరోపిస్తూ.. బాయ్‌కాట్, డైవెస్ట్ మెంట్, శాంక్షన్స్ (బీడీఎస్) ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా బలపడుతున్నది. భారత కంపెనీలకు సంబంధించి కూడా దేశంలో నిరసనలు జరుగుతున్నాయి. టాటా గ్రూప్ ఇజ్రాయెల్ కు ఆయుధాలు సరఫరా చేస్తున్నదని ఆరోపిస్తూ కేరళలోని కోజికోడ్‌లో ఎస్ఐఓ కార్యకర్తలు టాటా గ్రూప్‌నకు చెందిన జూడియో స్టోర్ ఎదుట నిరసన తెలిపారు. ఢిల్లీలోని కమలా నగర్‌లో కూడా జూడియో స్టోర్ వద్ద 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' అనే పేరుతో నిరసనలు జరిగాయి. అంతేకాకుండా టాటా, రిలయన్స్, అదానీ, మహీంద్రా గ్రూప్ కంపెనీలకు చెందిన ఉత్పత్తులను బహిష్కరించాలని సోషల్ మీడియాలో అనేక మంది పిలుపునిస్తున్నారు.

స్పందించకుంటే భవిష్యత్తులో నష్టమే!

బాయ్‌కాట్ మూవ్ మెంట్ అనేది ప్రస్తుతం ఆయా కంపెనీలపై ఆర్థికంగా అంతగా ప్రభావం చూపెట్టడం లేదు. అయితే రిటైల్ స్టోర్‌ల వద్ద క్రమంగా నిరసనలు పెరిగితే.. వినియోగదారుల విశ్వాసం దెబ్బతినొచ్చు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా వ్యాపారంపై ప్రభావం పడొచ్చు. అంతేకాకుండా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రతికూల ప్రచారం కంపెనీల బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయొచ్చు. మధ్యప్రాచ్య దేశాల్లో ఆయా కంపెనీలకు ఉన్న వ్యాపార సంబంధాలు, ఒప్పందాలపైనా ఎఫెక్ట్ పడొచ్చు. ఫలితంగా భవిష్యత్తులో ఆయా కంపెనీలు నష్టపోయే ప్రమాదమున్నది. ఇందుకోసం ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడేలా ఆయా కార్పొరేట్ కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్), ఎన్విరాన్మెంటల్ సోషల్ గవర్నెన్స్ (ఈఎస్ జీ) ప్రమాణాలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలి. కేవలం లాభాల కోసమే కాకుండా.. మానవతా విలువలకు అనుగు ణంగా ఈ ఆరోపణలపై స్పష్టతనివ్వాలి.

ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్.
9640466464

ట్రంప్‌పై మోదీ మౌనం ఎందుకు?

- **విపక్షాల సూటి దెబ్బలు - అధికార పక్షం అస్పష్ట సమాధానాలు**

2025 జులై 29, 30 తేదీలలో జరిగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు భారత రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్‌తో సరిహద్దు ఘర్షణ, ట్రంప్ జోక్యం, యుద్ధ విరమణ వంటి సున్నితమైన అంశాలపై విపక్షాలు ప్రభుత్వాన్ని పదునైన, సూటి ప్రశ్నలతో నిలదీశాయి. అయితే, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి వచ్చిన సమాధానాలు నీరసంగా, అస్పష్టంగా, డొంకతి రుగుడుగా ఉండటం విపక్షాలతో పాటు బీజేపీ, ఆర్ఎస్ ఎస్ మద్దతుదారులు, సామాన్య ప్రజలను అసంతృప్తికి గురిచేసింది. ఈ సమావేశాల్లో జరిగిన చర్చలు జాతీయ భద్రత, ప్రభుత్వ బాధ్యతలపై విమర్శనాత్మక దృక్పథాన్ని అందించాయి. పహల్గాం ఉగ్రదాడి జమ్మూ కశ్మీర్‌లో భద్రతా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసింది. ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా చేరుకున్నారు? నిఘా వ్యవస్థ ఎందుకు విఫలమైంది? భద్రతా ఏర్పాట్లు ఎందుకు సరిగా జరగలేదు? అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా విపక్ష నాయకులు సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రశ్నలు రాజకీయ ఆరోపణల కోసం కాక, దేశ భద్రతపై ప్రజల ఆందోళనలను ప్రతిబింబించాయి. ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాలు ప్రశ్నల వర్షం కురిపించాయి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు జరిగినప్పటికీ, దాని ఫలితాలు, దీర్ఘకాలిక ప్రభావం గురించి స్పష్టత లేదని ఆరోపించారు. ఈ ఆపరేషన్ ఉగ్రవాదాన్ని నిర్మూలించిందా లేక రాజకీయ ప్రచార ఉపకరణం గా పనిచేసిందా అని నిలదీశారు. ట్రంప్ జోక్యం, యుద్ధ విరమణలో అమెరికా పాత్రపై సీపీఐ నాయకుడు కె. రామకృష్ణ ప్రశ్నలు లేవనెత్తారు. సిమ్లా ఒప్పందం ప్రకారం కశ్మీర్ సమస్య ద్వైపాక్షికమైనదని భారత్ చెబుతోంది, అలాంటప్పుడు ట్రంప్ జోక్యాన్ని ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్‌ను పాకిస్థాన్‌కు హెచ్చరికగా అభివర్ణిం చారు, కానీ నిర్దిష్ట ఫలితాల గురించి సమాచారం అందించలేదు. అమిత్ షా పహల్గాం దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నప్పటికీ, భవిష్యత్ నిరోధక వ్యూహాల గురించి స్పష్టత ఇవ్వలేదు. మోదీ ఆపరేషన్ మహాదేవ్ ద్వారా ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చి నట్లు ప్రకటించారు, కానీ ఇది దీర్ఘకాలిక భద్రతా సమస్యలకు సమాధానం కాదని విపక్షాలు వాదించాయి. ట్రంప్ జోక్యం విషయంలో మోదీ నిశ్శబ్దం ఆశ్చర్యకరం. ట్రంప్ 31 సార్లు తన జోక్యం వల్ల యుద్ధ విరమణ జరిగిందని చెప్పినప్పటికీ, మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం భారత్ స్వతంత్ర విదేశాంగ విధానానికి దెబ్బగా విపక్షాలు ఆరోపించాయి. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులు, సామాన్య ప్రజలు ప్రభుత్వ సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ భద్రతలో స్పష్టత, బాధ్యతా యుతమైన వైఖరిని ఆశించారు, కానీ అస్పష్ట సమాధానాలు విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఆర్ఎస్ఎస్ విదేశీ జోక్యంపై మోదీ నిశ్శబ్దంపై ప్రశ్నలు లేవనెత్తింది. భారతీయ మీడియా పహల్గాం దాడిపై నిఘా వైఫల్యంపై విమర్శించింది. 'ది హిందూ' భద్రతా లోపాలను, ప్రభుత్వం స్పష్ట సమాధానం ఇవ్వడంలో విఫలమైనట్లు పేర్కొంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అమిత్ షా సమాధానాలు రాజకీయ ఆరోపణలపై దృష్టి సారించాయని విమర్శించింది. ఎన్‌డీటీవీ ప్రభుత్వం సాధారణీకరణ లతో సరిపెట్టిందని విశ్లేషించింది. టైమ్స్ ఆఫ్ ఇండియా ఆపరేషన్ మహాదేవ్ దీర్ఘకాలిక సమస్యలకు సమాధానం కాదని వ్యాఖ్యా నించింది. తెలుగు మీడియాలో ఈనాడు, ఆంధ్రజ్యోతి స్పష్టత లోపించిందని రాశాయి. ఈటీవీ భారత్ విపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు యత్నిం చి నప్పటికీ, సమాధానాలు అసంతృప్తి కలిగించాయని నివేదించింది. ఆపరేషన్ సిందూర్‌ను రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరి కగా అభివర్ణించారు, కానీ ఫలితాల గురించి స్పష్టత లేని సమాధానాలను మీడియా విమర్శించింది. 'ది టెలిగ్రాఫ్' దీనిని రాజకీయ ఉపకరణంగా పేర్కొంది. రిపబ్లిక్ టీవీ విజయం గురించి వివరాలు లేకపోవడం నిరాశపరిచిందని విశ్లేషిం చింది. సామాజిక మాధ్యమాలలో ఆపరేషన్ సిందూర్ ఫలితాలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయ మీడియా ట్రంప్ జోక్యంపై దృష్టి సారించింది. బీబీసీ ట్రంప్ జోక్యం భారత్ విదేశాంగ విధానానికి సవాలని వ్యాఖ్యానించింది. ఆల్ జజీరా సిమ్లా ఒప్పందం ఉల్లంఘనపై ప్రశ్నించింది. న్యూయార్క్ టైమ్స్ మోదీ నిశ్శబ్దం ఆశ్చర్యకరమని, అసంతృప్తిని పెంచిందని రాసింది. సామాజిక మాధ్యమాలలో ప్రజలు నిఘా వైఫల్యం, ట్రంప్ జోక్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ పాకిస్థాన్‌కు అనుకూలంగా ప్రకటనలు చేస్తుంటే మోదీ నిశ్శబ్దం ఎందుకని విపక్షాలు ప్రశ్నించాయి. అదానీ కేసులు, ట్రంప్ బెదిరింపులు దీనికి కారణమా అని నిలదీశారు. ప్రభుత్వం జాతీయ భద్రత, విదేశాంగ విధానంలో పారదర్శకత, బాధ్యతాయుతమైన వైఖరిలో విఫలమైందని మీడియా విశ్లేషించింది. పహల్గాం దాడి భద్రతా లోపాలను బహిర్గతం చేస్తే, ఆపరేషన్ సిందూర్ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగపడిందా అనే అనుమానాలను రేకెత్తించింది. ట్రంప్ జోక్యంపై మోదీ నిశ్శబ్దం స్వతంత్ర విదేశాంగ విధానంపై ప్రశ్నలను లేవనెత్తింది. ఇందిరా గాంధీ, వాజ్‌పేయి విదేశీ జోక్యాన్ని ఖండించిన సందర్భాలను మీడియా గుర్తుచేసింది. మోదీ నిశ్శబ్దం దేశ పరువును దెబ్బతీసిందని విమర్శలు వచ్చాయి. పార్లమెంటు చర్చలు స్పష్టత, బాధ్యత యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశాయి. అస్పష్ట సమాధానాలు, బాధ్యత నుంచి తప్పించుకునే వైఖరి అసంతృప్తిని పెంచాయి. భవిష్యత్తులో ప్రభుత్వం స్పష్టమైన, బాధ్యతాయుతమైన వైఖరిని అవలంబించాలి. జాతీయ భద్రత, విదేశాంగ విధానంలో పారదర్శకత, దృఢత్వం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని చూరగొనగలదు. ఈ లోపాలను సరిదిద్ది, రాజకీయ లబ్ధి కంటే దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి. మీడియా, ప్రజల అభిప్రాయాలు ఈ దిశలో హెచ్చరికగా ఉండాలి.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

అవకాశవాదులు!

అడుగు!అడక్కపో!
వాడుచెప్పేదొక్కటే!
దేశం పాడైపోయింది!
అందరూ మోసగాళ్ళే
నమ్మక ద్రోహులే!
చివరికొచ్చేసింది!
పాపం పండిపోయింది!
ఇంక యుగాంతమే!
...ఇవీ వాడు చెప్పేది!

ఎవరామోసగాళ్లు?
అని తిరిగి ప్రశ్నిస్తే
జవాబు దొరకదు!
ఎవడికి వాడే మంచి
ఎదుటివాళ్లంతా
పరమదుర్మార్గులు!
ఇదీ మనిషి నైజం!
మనుషులే కాదండోయ్!
'పార్టీలు' కూడా ఇంతే!
ప్రధానమంత్రే అంటాడు
"కాంగ్రెస్ వల్లే దేశం
నాశనమై పోయింది"!
కమ్యూనిస్టుల వల్లేనని
ముస్లిమ్స్ వల్లేనని
తాము పత్తిత్తులమని!
ఎవడికివాడింతే!
తప్పించుకుతిరుగువాడు
'ధన్యుడు'సుమతీ!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

వినిపించని శబ్దంలా!

నేనూ
మనిషిననుకునేంత దగ్గరకి
తెచ్చావు.
నా ఊపిరికి ఆశల్ని తొడిగి,
నా కళ్లలో వెలుగుని నింపావు.
నీ మాటలతో మైమరిపించి,
నీ చూపులతో ఉరిమించావు
నన్ను.
కానీ నన్ను మళ్లీ ఒంటరినే చేసి,
ఎక్కడి నన్ను అక్కడికే తెచ్చావు.
నా లోపల పురుడోసుకున్న
నమ్మకాన్ని
నీ నిశ్శబ్దంలోనే కలిపేశావు.
నీ జ్ఞాపకాలని గుండె గదుల్లో
పేర్చి,కడకు నాకు నేనే
వినిపించని శబ్దంలా
అంతర్ధానమయ్యాను.

-బాలాజీ పోతుల
8179283830

సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా మహిళా సాధికారత!

ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త మేరీ క్యూరీ సముచితంగా ఇలా అన్నాడు, "ఏమి జరిగిందో ఎప్పుడూ గమనించలేదుబీ ఏమి చేయాలో మాత్రమే చూడగలరు." ఈ కోట్ పురోగతి కోసం కృషి చేయాల్సిన అవసరాన్ని హైలైట్ చేస్తుంది, ముఖ్యంగా మహిళల సాధికారతకు సంబంధించి. పురోగతి సాధించినప్పటికీ, నిజమైన సమానమైన ప్రపంచాన్ని సృష్టించడానికి గణనీయమైన పని మిగిలి ఉంది.ఈ వ్యాసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనువర్తనాలు వివిధ రంగాలలో మహిళలను ఎలా శక్తివంతం చేయగలవని, లింగ అంతరాన్ని తగ్గించడం, మరింత సమగ్ర భవిష్యత్తును పెంపొందించడం వంటివి ఎలా అన్వేషిస్తాయి. విద్య, నైపుణ్యం అభివృద్ధి: అడ్డంకులను విచ్ఛిన్నం చేస్తుంది. చారిత్రాత్మకంగా, మహిళల సాధికారతకు విద్యను పొందడం ఒక ముఖ్యమైన అవరోధంగా ఉంది. ఏదేమైనా, ఎస్, టి పురోగతులు ఈ ప్రకృతి దృశ్యాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్నాయి. ఖాన్ అకాడమీ, కోర్సెరా వంటి ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు భౌగోళిక పరిమితులను అధిగమించాయి, మారుమూల ప్రాంతాలలో మహిళలకు సౌకర్యవంతమైన విద్యా అవకాశాలతో అందిస్తాయి. ఉడాసిటీ, ఉడెమీ వంటి వేదికలు విభిన్న రంగాలలో వృత్తి శిక్షణా కార్యక్రమాలను అందిస్తాయి, వారి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచే విక్రయణ నైపుణ్యాలతో మహిళలను శక్తివంతం చేస్తాయి. విద్యలో ఎస్‌టి యొక్క రూపాంతర శక్తిని ఆఫ్రికన్ వర్చువల్ విశ్వవిద్యాలయం (ఎవియు) వంటి సంస్థలు ఉదాహరణగా చెప్పవచ్చు. 1997 లో స్థాపించబడిన, ఏవియు ఆఫ్రికా అంతటా మహిళలకు, ముఖ్యంగా తక్కువ ప్రాంతాలలో ఉన్నత విద్యా అవకాశాలను అందించడానికి ఆన్‌లైన్ అభ్యాసాన్ని ఉపయోగించుకుంటుంది. ఈ చొరవ మహిళలకు సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఇంజనీరింగ్ వంటి పురుషులచే సాంప్రదాయకంగా ఆధిపత్యం వహించే రంగాలలో కెరీర్‌ను కొనసాగించడానికి అధికారం ఇస్తుంది.

ఆరోగ్య సంరక్షణ, శ్రేయస్సు: నియంత్రణ తీసుకోవడం

పురోగతులు మహిళలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణకు గణనీయంగా దోహదం చేస్తాయి.రిమోట్ సంప్రదింపుల కోసం టెలికమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించుకునే టెలిమెడిసిన్ ఆట మారేది. టెలాడోక్, డాక్టర్ ఆన్ డిమాండ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు మహిళలను నిపుణులతో కలుపుతాయి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధునాతన ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యత పరిమితం. ఎఫ్ఎల్‌వో, సిఎల్‌యుఈ వంటి మొబైల్ ఆరోగ్య అనువర్తనాలు పునరుత్పత్తి ఆరోగ్యం, పోషణ, వ్యాధి నివారణపై కీలకమైన సమాచారాన్ని అందిస్తాయి, మహిళలు వారి శ్రేయస్సు గురించి సమాచార నిర్ణయాలు తీసుకోవడానికి శక్తినిస్తుంది.ఇంకా, ఫిట్‌బిట్, ఆపిల్ వాచ్ ట్రాక్ కీలకమైన సంకేతాలు శారీరక శ్రమ వంటి ధరించగలిగే ఆరోగ్య మానిటర్లు, మహిళలు వారి ఆరోగ్యానికి బాధ్యత వహించడానికి వీలు కల్పిస్తుంది.హౌవైద్య సాంకేతిక పరిజ్ఞానంలో ఆవిష్కరణలు, కనిష్ట ఇన్వాసివ్ సర్జికల్ ప్రొసీజర్స్, ప్రినేటల్, ప్రసవానంతర సంరక్షణలో పురోగతితో పాటు, మెరుగైన తల్లి ఆరోగ్య ఫలితాలకు దోహదం చేస్తాయి. రూత్ బాడర్ గిన్స్బర్గ్, ఐకానిక్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకప్పుడు ఇలా వ్యాఖ్యానించారు, "యునైటెడ్ స్టేట్స్ సుప్రీం కోర్టు నిర్ణయాలు మహిళలు తమ శరీరాలను, వారి విధిని నియంత్రించగలడా అని నిర్ణయించగలవు."ఈ కోట్ మహిళలకు శారీరక స్వయంప్రతిపత్తి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, ఎస్,టి వారి ఆరోగ్యం గురించి సమాచార ఎంపికలు చేయడానికి జ్ఞానం, సాధనాలతో వారికి అధికారం ఇస్తుంది.

ఆర్థిక భాగస్వామ్యం, వ్యవస్థాపకత: మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ఆట ఫీల్డ్‌ను సమం చేయడం, టి కీలక పాత్ర పోషిస్తుంది. ఎట్సీ, షాపిఫై వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఆన్‌లైన్ వ్యాపారాలు, ఇ-కామర్స్‌ను సులభతరం చేస్తాయి, మహిళా పారిశ్రామికవేత్తలు విస్తృత మార్కెట్లను చేరుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడటానికి వీలు కల్పిస్తుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) ప్రోగ్రామ్ అయిన షెట్రేడ్స్ వంటి కార్యక్రమాలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించుకుంటాయి,

మహిళల యాజమాన్యంలోని వ్యాపారాలను అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానించడానికి, ఆర్థిక సాధికారతను ప్రోత్సహిస్తాయి.

కెన్యాలో ఎం-పెసా వంటి సంస్థలచే మార్గదర్శకమైన మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి టెక్నాలజీ సాధనాలు, మహిళలు తమ ఆర్థికవ్యవస్థపై ఎక్కువ నియంత్రణతో శక్తినిస్తాయి. ఈ ఆర్థిక స్వాతంత్ర్యం ఒక రూపాంతర శక్తి కావచ్చు, మహిళలు వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టడానికి, వారి కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి, పేదరికం యొక్క చక్రాల నుండి విముక్తి పొందటానికి వీలు కల్పిస్తుంది.హౌఅంతేకాకుండా, వ్యవసాయంలో ఎస్,టి పురోగతులు, ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులు, వాతావరణ పర్యవేక్షణ అనువర్తనాలు వంటివి, మెరుగైన దిగుబడి, మెరుగైన వనరుల నిర్వహణ, మార్కెట్లకు ప్రాప్యత కోసం మహిళా రైతులను సాధనాలతో సన్నద్ధం చేయగలవు. ఇది గ్రామీణ వర్గాలలోని మహిళలకు ఆర్థిక సాధికారతను ప్రోత్సహిస్తుంది, వీరు తరచూ వ్యవసాయ ఉత్పత్తికి వెన్నెముక.

2.సామాజిక చేరిక, భద్రత:

సహాయక వ్యవస్థను నిర్మించడం మహిళల భద్రత, సామాజిక చేరికను ప్రోత్సహించడానికి శక్తివంతమైన సాధనం. సఫ్టీ యాప్ (ఇండియా), బిఎస్ఎఫ్ఇ (గ్లోబల్) వంటి మొబైల్ అనువర్తనాలు అత్యవసర హెచ్చరిక వ్యవస్థలను అందిస్తాయి, బాధ సమయాల్లో మహిళలను సహాయక నెట్‌వర్క్‌లతో కనెక్ట్ చేస్తాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, తరచూ సవాళ్లతో నిండినప్పటికీ, లింగ ఆధారిత హింస గురించి అవగాహన పెంచడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడటానికి మహిళలను శక్తివంతం చేయడానికి పరపతి పొందవచ్చు. లైంగిక వేధింపులను బహిర్గతం చేయడానికి, సవాలు చేయడానికి సోషల్ మీడియాను ఉపయోగించిన ఎంఈటిటిఓ వంటి ప్రచారాలు, సామూహిక చర్యను ప్రోత్సహించడంలో, సామాజిక మార్పును ప్రోత్సహించడంలో సాంకేతిక పరిజ్ఞానం యొక్క శక్తిని ప్రదర్శిస్తాయి.

ఇంకా, సహాయక సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాలలో సాంకేతిక పురోగతి వైకల్యాలున్న మహిళల జీవితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. టెక్ట్-టు-స్పీచ్ సాఫ్ట్‌వేర్, స్క్రీన్ రీడర్లు, వాయిస్-యాక్టివేటెడ్ ఇంటర్‌ఫేస్‌లు వైకల్యాలున్న మహిళలను సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి, సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడానికి, సమాజంలో చురుకుగా పాల్గొనడానికి శక్తినిస్తాయి. వైకల్యం హక్కుల కోసం ఛాంపియన్ అయిన హెలెన్ కెల్లర్ ఒకసారి "జీవితం సాహసోపేతమైన సాహసం లేదా ఏమీ లేదు" అని పేర్కొంది. ఈ కోట్ వైకల్యాలున్నవారికి జీవితాలను నెరవేర్చడానికి అవసరమైన ధైర్యం, సంకల్పాన్ని కలిగి ఉంటుంది.వారి నిబంధనలపై జీవిత సాహసాన్ని స్వీకరించడానికి వైకల్యాలున్న మహిళలకు ఎస్,టి అధికారం ఇస్తుంది.

మహిళల సాధికారత కోసం ఎస్,టి యొక్క విస్తారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ సవాళ్లు, పరిగణనలు, గణనీయమైన సవాళ్లు మిగిలి ఉన్నాయి. "డిజిటల్ డివైడ్" కొనసాగుతుంది, అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళలు తరచుగా సాంకేతిక పరిజ్ఞానం లేదా సమర్థవంతంగా ఉపయోగించుకునే నైపుణ్యాలను కలిగి ఉండరు. అంతేకాకుండా, సాంస్కృతిక అవరోధాలు, సామాజిక నిబంధనలు స్టీమ్ రంగాలలో (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) మహిళల భాగస్వామ్యానికి ఆటంకం కలిగిస్తాయి, వారి భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయిఈ సవాళ్లను పరిష్కరించడానికి బహుళ-వైపు విధానం అవసరం. డిజిటల్ విభజనను తగ్గించడానికి ప్రభుత్వాలు, ఎన్జిఓలు, ప్రైవేట్ రంగం సహకరించాలి. కమ్యూనిటీ టెక్నాలజీ సెంటర్లు, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలు, సరసమైన ఇంటర్నెట్ యాక్సెస్ ప్రణాళికలు వంటి కార్యక్రమాలు మహిళలందరికీ ఎస్,టి వనరులకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించడానికి కీలకమైనవి.

ఇంకా, చిన్న వయస్సు నుండే బాలికలకు విద్యను ప్రోత్సహించడం చాలా అవసరం. గర్ల్స్ హూ కోడ్, బ్లాక్ గర్ల్స్ కోడ్ వంటి ప్రోగ్రామ్‌లు అమ్మాయిలకు అభ్యాస అనుభవాలు, మెంటర్‌షిప్ అవకాశాలు, టెక్ పరిశ్రమలో రోల్ మోడళ్లను అందిస్తాయి. బాలికల కోసం విద్య యొక్క సంస్కృతిని పెంపొందించడం ద్వారా, మేము మూస పద్ధతులను విడదీయవచ్చు, సాంకేతిక పరిజ్ఞానంలో కెరీర్‌ను కొనసాగించడానికి ఎక్కువ మంది మహిళలను ప్రోత్సహించవచ్చు, యొక్క భవిష్యత్తును రూపొందించడం, ఈ రంగాలలో లింగ అంతరాన్ని మూసివేయడం.

3.మహిళలను ప్రోత్సహించడం, సమాజాన్ని శక్తివంతం చేయడం:

మహిళల సాధికారత కేవలం నైతిక అత్యవసరం కాదుబీ ఇది దేశం యొక్క భవిష్యత్తులో వ్యూహాత్మక పెట్టుబడి. ప్రపంచ బ్యాంకు సముచితంగా ఇలా చెప్పినట్లుగా, "విద్యావంతులైన బాలికలు ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తారు, పేదరికాన్ని తగ్గిస్తారు కుటుంబాలు, సమాజాల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరుస్తారు."మహిళలకు జ్ఞానం, నైపుణ్యాలు ఆర్థిక స్వాతంత్ర్యంతో అధికారం పొందినప్పుడు, వారు తమ వర్గాలకు దోహదం చేయడానికి ,సామాజిక పురోగతిని పెంచడానికి మంచి సన్నద్ధమవుతారు.

విజయానికి ఉదాహరణలు: మార్పు యొక్క ఉత్తేజకరమైన కథలు

నిఘా కెమెరాల నిర్వహణపై వినతి

రాజేంద్రనగర్, జూలై 31 (జనం సాక్షి) : మణికొండ మున్సిపాలిటీలో నిఘా కెమెరాల నిర్వాణపై అధికారులు శ్రద్ధ చూపాలని కోరుతూ మణికొండ బీఆర్ఎస్ నాయకులు కమిషనర్ ప్రదీప్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. గురువారం స్థానిక భారత రాష్ట్ర సమితి యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్, స్థానిక నాయకులు అందే లక్ష్మణరావు ల ఆధ్వర్యంలో కమిషనర్ కు టిఆర్ఎస్ నాయకులు లేఖ ద్వారా తెలుపుతూ ముఖ్యమైన ప్రాంతాలలో సిసి కెమెరాల నిర్వాణ కోసం రూ.1.20 కోట్లు వెచ్చించి మణికొండలో సి.సి కెమెరాలను ఏర్పాటు చేశారని, దీనికి కేవలం ఒక సంవత్సరం పాటు భద్రత పర్యవేక్షణ చేసిన కెమెరాల పరిరక్షణ బృందం ఆ తర్వాత గాలికి వదిలేసిందని, ఇరుకైన రోడ్లలో తరచూ మున్సిపాలిటీలో ప్రమాదాలు, దొంగల బెదడతో నిఘా నేత్రాల లోపం తేట తెల్లమవుతుందని, దీనిపై కమిషనర్ శ్రద్ధ వహించి సీసీ కెమెరాల నిర్వహణపై ఎలాంటి లోపాలు లేకుండా సరి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందాడ ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబురావు, వేణు గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల పోలీస్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

వీపనగండ్ల, జూలై 31 (జనం సాక్షి) : వనపర్తి జిల్లా పరిధిలోని వీపనగండ్ల పోలీస్టేషన్ వార్షిక తనిఖీలలో భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీరావుల గిరిధర్ ఐపీఎస్ సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోలీస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం పోలీస్టేషన్లో రికార్డ్స్ ను,పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ రిసెప్షన్,లాకప్ మెన్ బ్యారేక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు.పోలీస్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి,ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలు,నేరస్థుల ప్రస్తుత పరిస్థితులు ఏవిధంగా ఉన్నవి తదితర వివరాలను పెండింగ్ లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను వీపనగండ్ల ఎస్సై రాణి ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్టేషన్ వచ్చిన బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా త్వరితగతిన సిబ్బందిని కేటాయించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోలీస్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు.పోలీస్టేషన్ రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి అపరిస్మృతంగా లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల వారి ఫిర్యాదుల పట్ల

ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మహిళా ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా సున్నితమైన అంశాలను జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉండాలని సూచించారు. మహిళల పట్ల ప్రత్యేకంగా ఎలాంటి భార్యాభర్తల సమస్యలు ఉన్న వారిని పరిష్కరించే దిశగా బాధితులకు న్యాయం చేసే దిశగా తగు చర్యలను చేపట్టాలన్నారు. త్వరలో రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరు పూర్తి సంసిద్ధంగా ఉండాలని సూచించారు.ప్రతి గ్రామంలో వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి విపియో విధానాన్ని అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్టేషన్లో ఉన్న బ్లూ కోర్ట్, డయల్ 112 , స్టేషన్ రైటర్స్, సెక్షన్ ఇంచార్జ్, పెట్రో కార్, రిసెప్షన్ లాంటి వర్టికల్స్ను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాలలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్టంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వీపనగండ్ల ఎస్సై, రాణి, డిసిఆర్బి ఎస్సై, మంజునాథ్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్‌లు కడుతున్న ప్రజల వద్దకే అధికారులు

- **కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి**

హయత్‌నగర్, జూలై 31 (జనం సాక్షి) : మన్సూరాబాద్ డివిజన్‌లోని సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్, హై రేంజ్ అపార్ట్‌మెంట్స్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానికులు పలుమార్లు విజ్ఞప్తులు చేసిన విషయాలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యం లో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్, జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కొప్పుల నర్సింహ్మా రెడ్డి లు కలిసి ఉదయం 5:30 గంటలకు ప్రజలతో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రత్యక్షంగా రోడ్లు, డ్రైయినేజీ, పారిశుద్ధ్యం, నీటి నిలిచిపోవడం, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తదితర అంశాలను పరిశీలించి వెంటనే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి యంత్రాల సహాయంతో, జిహెచ్ఎంసి సిబ్బందితో సమస్యలను పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 15 సంవత్సరాల చరిత్రలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఏఎస్ ట్యాక్స్ లు కడుతున్న ప్రజల వద్దకే వెళ్లి సమస్యల పరిష్కారం కోసం, కావాల్సిన అభివృద్ధి పనులను స్వయంగా అడిగి, అధికార యంత్రాంగాన్ని మానిటరింగ్ చేయడం నిజంగా అభినందనీయమని వారు కొనియాడారు. ప్రతి సమస్యపై తక్షణ స్పందన, సంబంధిత అధికారులతో ఆన్-స్పాట్ చర్చలు, కార్యాచరణను ప్రారంభించేందుకు క్లియర్ డైరెక్షన్లు ఇవ్వడం జరిగిందని వారు తెలియజేశారు. విజయవాడ నేషనల్ హైవే రోడ్డు మార్గంలో ఎల్బీనగర్ చౌరస్తా నుండి ఎల్ పి టి మార్కెట్ వరకు సబ్ రోడ్ అభివృద్ధి పనులకు

80 లక్షల రూపాయలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని వారు తెలిపారు. ఈ చర్యలు ప్రజల్లో ఆశాభావం కలిగించగా కొప్పుల నర్సింహ్మా రెడ్డి నాయకత్వం లోని కార్యాచరణ ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పిందని సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్, హై రేంజ్ అపార్ట్మెంట్స్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమం లో హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్, హై రేంజ్ అపార్ట్మెంట్స్ అధ్యక్షులు అనంతరాములు, ఉమామహేశ్వర్ రెడ్డి, విజయసారథి, భాస్కర్ రెడ్డి, పరమేశ్వర్, శ్రీధర్ రెడ్డి, జిహెచ్ఎంసి పలు శాఖల అధికారులు, సిబ్బంది, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందక మృత్యువాతకు గురవుతున్న మూగజీవాలు

- **నిర్లక్ష్యపు డాక్టర్‌ను తొలగించాలని రైతుల ఆందోళన**

శివ్వంపేట, జూలై 31 (జనంసాక్షి) : పాడి పంటతోనే వ్యవసాయం జంటగా సమ్మేళనం కానీ కొందరి వైఖరి వల్ల నేడు పశు సంపద మృత్యువాతకు గురవుతున్నది. అధికార దర్పాన్ని అనుభవిస్తూ, సమయపాలన పాటించకుండా, ఒక్కొక్క రోజు ఇలా వచ్చి సంతకాలు పెట్టి అలా వెళ్లడం, మరొక రోజు విధులకు రాకుండా ఎగనామం పెట్టడం, ఇదేమిటని రైతులు అడిగితే వారి పైకే ఎదురు దాడికి దిగడం, పశుసంపద కలిగిన అన్నదాతలపైనే ఆక్రోషం వెళ్లగక్కడం ఇదే నేడు శివంపేట పశు వైద్య కేంద్రం వద్ద జరుగుతున్న తంతు వివరాల్లోకి వెళితే వైద్యం అందక మూగ జీవలు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పాడి రైతులు గురువారం మండల కేంద్రమైన శివ్వంపేట పశువైద్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. స్థానిక పశు వైద్యాధికారి ఉదయం 9గంటలకు రావాల్సి ఉండగా 10.30 నిమిషాలకు రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ పశు డాక్టర్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, పశువులకు, మేకలు గొర్ల కు సంబంధించి వ్యాక్సిన్ కానీ వైద్యం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారంలో రెండు రోజులు మాత్రమే వస్తుందని, పశువులు అనారోగ్యం పాలవుతే ఫోన్ చేసిన స్పందించక పోవడంతో పాటు తమతో వాదన పెట్టుకుంటుందన్నారు. పశువైద్య కేంద్రంలో సక్రమంగా మందులు లేకున్నా రైతులందరూ బయట ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులను కొనుగోలు చేసి తెచ్చుకున్న వాటి ద్వారా కూడా పశువులకు చికిత్స చేయడం లేదని వాపోయారు. కాగా ఇదే విషయంపై డాక్టర్

సంధ్యారాణిని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతుందని రైతులు తెలిపారు. గత పది రోజుల కిందట వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సమయానికి వైద్య సేవలు అందక ఇదే గ్రామానికి చెందిన రైతు ముద్ద గళ్ళ లక్ష్మయ్య బర్రె మృతి చెందిందని రైతులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమం లో రైతులు దాదువాయి అశోక్, ఆంజనేయులు, రామాగౌడ్, ముద్దగాళ్ల భిక్షపతి, చాకలి రమేష్, నరేష్, బాలేష్, బొట్టు శ్రీనివాస్, ముద్దగాళ్ల బాలేష్, ముయ్యడీ బాలేష్, సందీప్ తదితరులు ఉన్నారు.

ఇక్ఫాయి విశ్వవిద్యాలయం, గ్రాంట్ థారంటన్ భారత్ మధ్య వ్యూహాత్మక ఒప్పందం

శంకర్‌పల్లి, జూలై 31 (జనం సాక్షి) : ఇక్ఫాయి విశ్వవిద్యాలయం, భారతదేశంలో ప్రముఖ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థలలో ఒకటైన గ్రాంట్ థారంటన్ భారత్ తో అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నందుకు గర్వంగా భావిస్తోంది. ఈ ఒప్పందం ఇక్ఫాయి విశ్వవిద్యాలయం యొక్క విద్యా విశిష్టత మరియు పరిశ్రమతో సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకున్న కీలకమైన ముందడుగు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా పరిశ్రమ-విద్యా పరస్పర సహకారాన్ని ప్రోత్సహిస్తూ, విద్యార్థులకు జ్ఞాన మార్పిడి, అనుభవపూర్వక విద్యనందించడం మరియు ఉద్యోగోన్ముఖ అభివృద్ధికి దోహదపడే విధంగా రూపొందించబడింది. ఈ ఒప్పందం ప్రకారం, రెండు సంస్థలు కలసి అనేక కార్యక్రమాలను అమలు చేయనున్నాయి. వీటిలో పరిశ్రమ నిపుణుల అతిథి ఉపన్యాసాలు, శిక్షణ (ఇంటర్న్షిప్) అవకాశాలు, సంయుక్త కోర్సులు, ప్రొఫెషనల్ అభివృద్ధి ప్రోగ్రాములు మరియు పరిశోధనలపై కలిసికట్టుగా పని చేయడం వంటివి ఉంటాయి. వీటి ప్రధాన లక్ష్యం విద్యా మరియు పరిశ్రమల మధ్య ఉన్న ఖాళీని తగ్గించడం, విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు మరియు సమకాలీన పరిశ్రమ అవగాహన కల్పించడం. ఈ ఒప్పందాన్ని గ్రాంట్ థారంటన్ భారత్ ఎల్ ఎల్ పి తరఫున శ్రీ ప్రదీప్ పాండే (పార్టనర్) మరియు డా. వినయ్ కుమార్ (మెనేజర్ యూనివర్శిటీ రిలేషన్స్), ఇక్ఫాయి ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరఫున రిజిస్ట్రార్ డా. విజయలక్ష్మి గారు కలిసి అధికారికంగా సంతకం చేశారు. ఈ ఒప్పందం సమావేశానికి ప్రొఫెసర్ ఎల్.ఎస్. గణేష్, ప్రొఫెసర్ ఓఆర్ఎస్ రావు, డాక్టర్ సి. పద్మావతి, డాక్టర్ ఎస్. వేణుగోపాల్, డాక్టర్ సంజయ్ ఫులోరియా, డాక్టర్ డి. సతీష్, డాక్టర్ శైలజన్, ప్రొఫెసర్ సింధుజా, డాక్టర్ సీతమ్మ, డాక్టర్ సరవణన్, ఆర్కిటెక్ట్ మునవార్ పాషా, డాక్టర్ దామోదర్ రెడ్డి, ప్రొఫెసర్ అక్బర్ ఖాన్, డాక్టర్ సంజిబ్ దత్తా, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ ముకేశ్ కుమార్ మిశ్రా మరియు డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ భాగస్వామ్యం ద్వారా పరిశ్రమ నిపుణులతో కలిసి పనిచేస్తూ, విద్యార్థులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం, కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ప్రొఫెషనల్ ప్రావీణ్యాన్ని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుంది.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

అల్లాదుర్గం, జూలై 31 (జనంసాక్షి) : ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత ప్రైడే - డ్రైడే కచ్చితంగా అమలు కావాలన్నారు. మండంలోని గడిపెద్దాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్లాపూర్‌లోని పశు దవఖానాను తనిఖీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. గడిపెద్దాపూర్‌లోని ఆరోగ్య కేంద్రంలో స్టోర్, రక్త పరీక్ష గది.ఓ.పి రిజిస్టర్ను పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు వైద్య సేవలకు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులు, అందుతున్న వైద్యంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నారు. ముస్లాపూర్లోని పశువుల ఆసుపత్రిలో మందుల స్టాక్, వ్యాక్సిన్ నిలువలు పరిశీలించారు. పశువులకు అందించాల్సిన టీకాలు సమయానికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధి కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద లబ్ధిదారులకు నీడ కల్పించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేల లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నమన్నారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసి సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనలు పాటించాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత,పురుగు మందుల కొరత లేదని ఎరువుల కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టా లేని రైతులకు ఆధార్.కార్డు ఆధారంగా అవసరం మేరకు యూరియా అందించాలన్నారు. అధిక ధరలకు ఎరువులను.విక్రయిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు పోలీసు.కేసు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్య క్రమం లో తహశీల్దార్ మల్లయ్య,ఎంపిడిఓ చంద్రశేఖర్,వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న మీనాక్షి నటరాజన్

మొయినాబాద్, జూలై 31 (జనం సాక్షి) : మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గజమాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో ప్రజల మధ్యకు వెళ్లే సందర్భంగా... మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చిలుకూరు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించబడినాయి. వేద బ్రాహ్మణుల వేద మంత్రోచ్ఛారణల ఆశీర్వదించారు.అనంతరం హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ గారు,బాబు జగ్జీవన్ రామ్,డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

- **ఎస్పీ రావుల గిరిధర్**

వీపనగండ్ల, జూలై 31 (జనం సాక్షి) : వీపనగండ్ల మండలం పులగర్ చెర్ల గ్రామంలో గ్రామ రైతు సంఘం మహిళా సంఘాల సహకారంతో ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన 10 అధునాతన సీసీ కెమెరాలను వీపనగండ్ల మండల పరిధిలోని పుల్గర్చర్ల గ్రామంలో సమైక్య భవనంలో నిఘా నేత్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని, సీసీ కెమెరాలు 24 గంటల నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతోపాటు ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను, గ్రామ రైతు కమిటీ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పోలీసుల సహకారంతో పుల్గర్ చర్ల గ్రామంలోనే కాకుండా వీపనగండ్ల మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరి సహకారం

అవసరముంటుందని తెలిపారు. జిల్లాలో నేరాలు నిర్మూలించడానికి, ఎలాంటి అల్లర్లు జరగిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించి నిందితులను అరెస్టు చేయడం జరుగుతుందని పుల్గర్ చర్ల నుండి కాకుండా వనపర్తి కమాండ్ కంట్రోల్ నుండి వీక్షించడం జరుగుతుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామస్తులను ఎస్పీ అభినందించి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. వీరిని ఆదర్శంగా తీసుకొని జిల్లాలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ తమ నివాస ప్రదేశాల్లో అర్ధరాత్రి వేళల్లో ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలనికోరారు.తెల్లవారుజామున ఇండ్ల ముందు వాకిలి శుభ్రం చేసేటప్పుడు,రోడ్లపై వాకింగ్ చేసే సమయాల్లో బంగారు ఆభరణాలను ధరించరాదని సూచించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.దొంగతనాల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు పోలీసు వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, వీపనగండ్ల ఎస్సై, రాణి, సీసీఎస్, మంజునాథ్ రెడ్డి, గ్రామ రైతు కమిటీ సంఘం మహిళా సంఘం, మహిళలు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది నాయకులు గ్రామస్తులు, పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణ, జూలై 31 (జనం సాక్షి) : కృష్ణ మండలం గురుజాల రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం కృష్ణ పోలీసులు పేకాట స్థావరం పై దాడి చేసి 30వేల5వందలు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణ ఎస్సై, సిబ్బంది కలిసి గురజాల గ్రామ శివారు కృష్ణ రైల్వే స్టేషన్ సమీపంలో శరణప్ప వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్న రాజు చందర్, పసుపుల నర్సింగ్,4.ఎండి రియాజ్ ఊట్కూర్ నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా దాడి చేసి వారి నుండి పేక ముక్కలు, 30,550 రూపాయ లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్ఐ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
01 ఆగస్టు 2025

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోంది

- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి

వనపర్తి బ్యూరో, జూలై 31 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శవంతంగా నిలుస్తుందని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న రేషన్ కార్డు లబ్ధిదారులు కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు.గురువారం వనపర్తి నియోజకవర్గంలోని గోపాల్పేట, ఎదుల, రేవల్లి మండలాలకు సంబంధించిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గోపాల్పేట మండలం పద్మావతి గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించగా శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ కలలు, ఆశయాలను నెరవేర్చుతారనే నమ్మకంతో గత పాలకులకు ప్రజలు ఓట్లు వేసి అవకాశం ఇస్తే పది సంవత్సరాల్లో వాళ్లే లబ్ధి పొందారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 10 సంవత్సరాల నుండి కొత్త రేషన్ కార్డులు లేక పెళ్లి అయిన వారి పేర్లు, పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్పించకపోవడంతో లబ్ధిదారులు చాలా నష్టపోవడం జరిగిందని అన్నారు. గత పాలకులు వాళ్లకు లాభం ఉన్న పనులు మాత్రమే చేశారని ప్రజలకు లాభం చేకూర్చే ఏ ఒక్క పని చేయలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగింది అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళల ద్వారా ఉచితంగా 200 కోట్ల ప్రయాణాలు జరిగాయని, ఇందుకు ఆర్టీసీకి రూ. 6630 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రెండు పథకాల్లో కొంత సాంకేతిక సమస్య వల్ల కొంతమంది లబ్ధి చేకూరడం లేదని త్వరలోనే సమస్యను పరిష్కరించి అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. ఇందిరమ్మ పథకం పార్టీలకతీతంగా పారదర్శకంగా అర్హులైన వారికి మాత్రమే ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ళు మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ. 5.00 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఇల్లు లేనివారికి రెండవ దఫా మళ్ళీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలోని మహిళలకు 360 కోట్లు వడ్డీ లేని రుణాలు అందజేయడం జరిగింది. రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న రైతుల రుణాలను రైతు రుణమాఫీ ద్వారా రాష్ట్రంలోని 26 లక్షల రైతుల రుణాలు మాఫీ చేయడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు.నిరుద్యోగ యువతకు 65 వేల ఉద్యోగాలు, ప్రైవేట్ రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఒక పండగ వాతావరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వనపర్తి జిల్లాలో 37,962 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యం ఉండాలని ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు.ఎస్సీ వర్గీకరణ చేసి ఆర్డినెన్స్ చేయడంజరిగిందన్నారు.కులగబన చేసి బి.సి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఆర్డినెన్స్ పాస్ చేసి గవర్నర్‌కు పంపడం జరిగిందన్నారు. అదేవిధంగా బి.సి రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం అడ్డంకులు సృష్టించి ఆమోదం తెల్పడం లేదన్నారు. దీనికొరకు త్వరలో ఢిల్లి వెళ్ళి కేంద్ర మంత్రులతో మాట్లాడి ఇప్పిస్తామని ఒప్పుకుంటే జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు.ధరణినీ అడ్డం పెట్టుకొని గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని, భూభారతి చట్టం ద్వారా వాటినీ తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.తనకు సంపాదనపై ఆసక్తి లేదని, కొండలు తవ్వుకొని, భూములు కబ్జా చేసుకొని సంపాయించుకోవాలి అనే దురాలోచన అసలే లేదని తాను ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడతానని తెలియజేశారు.

రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, ఇంకా ఎవరైనా రేషన్ కార్డు రానివారు ఉంటే ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పేద ప్రజల కొత్త రేషన్ కార్డుల కల ప్రభుత్వం నెరవేర్చిందని, కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డులలో కొత్తగా వచ్చిన వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గోపాల్పేట, రేవల్లి, ఎదుల మండలాలకు కలిపి 3500 రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని అందులో 300 కొత్త రేషన్ కార్డులు ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, తాహసిల్దార్లు పాండు, లక్ష్మీ, మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ రఘు, మాజీ ఎంపీపీ సత్యశీల రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆందోళన

మక్తల్, జూలై 31 (జనంసాక్షి) : మక్తల్ మండలంలోని కాట్రేవుపల్లి గ్రామంలో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు తమకు న్యాయమైన పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు వినతిపత్రాలు అందజేసి మద్దతు కోరారు. గత 20 రోజులుగా రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, మార్కెట్ ధరలకు అనుగుణంగా ఎకరాకు రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు భూములు కొనుగోలు జరుగుతున్నాయని, అయితే ప్రభుత్వం మార్కెట్ విలువ కంటే తక్కువగా రూ. 14 లక్షలు ఇస్తామనడం సరికాదని వారు ప్రశ్నిస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడంతలు పరిహారం పెంచి ఇవ్వాలని ఉన్నప్పటికీ, ప్రభుత్వం దౌర్జన్యంతో భూములను లాక్కోవడం దౌర్భాగ్యమని నిర్వాసితులు పేర్కొన్నారు. భూమికి భూమి ఇవ్వాలని లేదా న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూముల బేసిక్ ధర నిర్ణయించడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, కమిషన్ నిర్ణయించిన బేసిక్ ధరకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని, బలవంతపు భూసేకరణను ఆపాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాల నరసింహులు, కృష్ణ, మాల గజలప్ప, జిలాని, నారాయణ గౌడ్, మాల శివ, రాములు గౌడ్, బొంబాయి సోమన్న, అశోక్ గౌడ్, పెద్ద తమ్మన్న, సోమన్న, చిన్న తమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధులపై ఉచిత మెగా వైద్య శిబిరం

నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 31 (జనం సాక్షి) : జిల్లాలోనే మొదటి సారిగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణ్ పేట్, గీతమల్టి స్పెషాలిటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో 2వ తేది శనివారం ఉదయం 10గంటలనుండి సాయంత్రం 4గంటల వరకు గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్‌లో ప్రఖ్యాత కిడ్నీ శస్త్ర చికిత్స నిపుణులు వివేకానంద్ కట్టి పర్యవేక్షణలో కిడ్ని మూత్ర సంబంధిత వ్యాధిపై ఉచిత చికిత్సతో పాటు మందులు పంపిణి చేయనున్నాట్లూ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు గీత విశ్వనాథ్ లు తెలిపారు. ఈసందర్భంగా గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ లో మెగా శిభీరానికి సంబందించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కిడ్నీలో రాళ్లు మూత్రంలో మంట అతిమూత్రం మగ వారిలో సంతాన లేమి సమస్యలు ప్రొస్టేట్, కిడ్ని బ్లాడర్ క్యాన్సర్ చికిత్సలు అందిస్తారని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈకార్య క్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ కార్యదర్శి సాయినాథ్ కోశాధికారి రాధ సదానంద్ చారి డాక్టర్ వై మల్లికార్జున్ గందె ఉమాకాంత్ భీం చందర్ గౌడ్ సురేందర్ చారి డాక్టర్ థౌసిప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజం

- పదవి కాలంలో చేసిన సేవలే గుర్తుండిపోతాయి
- పదవి విరమణ పొందిన వారికి ఘనంగా వీడ్కోలు
- జిల్లా ఎస్పీ పనితోష్ పంకజ్

సంగారెడ్డి ప్రతినిధి, జూలై 31 (జనం సాక్షి) : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరికి పదవి విరమణ ఉంటుందని పదవిలో తాను చేసిన సేవలే గుర్తుండిపోతాయని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవి విరమణ పొందుతున్న అధికారులు ఎ.సంజీవ రావ్ అదనపు ఎస్పీ (అడ్మిన్), యాదవ రెడ్డి, ఎస్సై అలీముద్దీన్, ఆర్. ఎస్సై అజీముద్దీన్ ఎఎస్సైలను ఎస్పీ పారితోష్ పంకజ్ ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికికారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. అదనపు ఎస్పీ (అడ్మిన్) సంజీవ రావ్ , సౌమ్యశీలి అడ్మినిస్ట్రేషన్ లో క్రియాశీలకంగా విధులు నిర్వహిస్తూ వివిధ రకాల కార్యక్రమాలలో సహాయకారిగా ఉంటూ సలహాలు అంధించేవారని గుర్తు చేశారు. ఆయన రెటైర్మెంట్ తీరని లోటని అన్నారు. సంజీవ రావ్ (1995)లో రాష్ట్ర పోలీసు శాఖలో సబ్-ఇన్స్పెక్టర్‌గా నియామకమై, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో సహితం, ధైర్య సహాసాలతో విధులు నిర్వహించి, లా అండ్ ఆర్డర్ మెంటైన్ చేయడంలో, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సమర్ధవంతంగా పని చేయడం జరిగిందని అన్నారు. ఇంటెలిజన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ.. కచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని సేకరించి అధికారుల మన్ననలు పొందారని అన్నారు. వీరు అధించిన ఉత్తమ సేవలకు గాను తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడం జరిగిందని తెలిపారు . యాదవ రెడ్డి ఎస్ఐ -(1983), అలీముద్దీన్ ఆర్ ఎస్ఐ (1983), అజీముద్దీన్ ఎ.ఎస్ఐ (1983) పోలీస్ కానిస్టేబుల్స్‌గా జిల్లా పోలీసు శాఖలో నియామకమై గడిచిన 42 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో క్రైమ్ డ్యూటి, ఫింగర్ ప్రింట్ విభాగంలో, విఐపి పర్సనల్ సెక్యూరిటి అధికారిగా విధులు నిర్వహిస్తూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో సైతం సమర్ధవంతంగా విధులను నిర్వహించడం జరిగిందని, తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచలంచాలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్-ఇన్స్పెక్టర్స్, అసిస్టెంట్ సబ్- ఇన్స్పెక్టర్స్‌గా పదోన్నతులు పొందడం వారి అందించిన సేవలకు నిదర్శనం అని అన్నారు. వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి వారికి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను అన్నారు. పోలీస్ శాఖ తరపున వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందించస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్టికల్ డిఎస్పీ శ్రీనివాస రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఎఆర్ డియస్పీ నరేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ అశోక్, మోహనప్ప, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఐ లు రామారావ్, రాజశేఖర్, డానియెల్, రిటైర్డ్ అవుతున్న అధికారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కొరత లేదు

- వ్యవసాయ సంచాలకులు రామకృష్ణ

ఉప్పునుంతల, జూలై 31 (జనం సాక్షి) : పునుంతల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులకు యూరియా కొరత లేదని అచ్చంపేట వ్యవసాయ సంచాలకులు రామకృష్ణ అన్నారు మండల కేంద్రంలోని పిఎస్‌సిఎస్‌సి ఏఆర్ఎస్ కే లో ఉన్న యూరియా నిల్వలను ఆయన గురువారం అకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా అధిక వాడటం వల్ల పంటల్లో పచ్చదనం పెరిగిపోయి మనకు అంటే పంటకు నష్టం చేసే చీడపీడలు ఉధృతి పెరిగి వాటి నివారణకు రైతులు అధిక పెట్టుబడులు పెట్టాల్సిన వస్తుంది అట్లాగే అధిక యూరియా వాడకం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని అత్యధికంగా యూరియా వాడిన పొలాలు భవిష్యత్తులో పంటలు పండడానికి వీలు లేకుండా మారి చౌడు భూములుగా మారడం జరుగుతుంది అలాగే అత్యధిక యూరియా నిల్వలు అత్యధిక యూరియా వాడటం వల్ల మనుషులలో క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది కావున రైతులు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మేరకు ఎరువులు దశలవారీగా పంట కాలంలో వాడి పంట దిగుమతులు పెంచుకోవాల్సిందిగా వారు ఈ సందర్భంగా సూచించారు ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల వ్యవసాయ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోవాలి

- ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య

ఉర్కొండ, జూలై 31 (జనం సాక్షి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణ తెలియజేశారు. మండలంలోని ఊర్కొండపేట, గుండ్లగుంటతాండా, రెడ్యాతాండా పలు గ్రామాలలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించడం జరిగింది. బేస్మెంట్ లెవెల్ పనులు పూర్తి అయిన లబ్ధిదారులకు మొదటి విడత ఆర్థిక సహాయం కొరకు పంచాయతీ కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజనీర్ ద్వారా ఫోటో కాప్చర్ చేయించడం జరిగింది. ఈ గ్రామాల సందర్శనలో తరుణ్, (అసిస్టెంట్ ఇంజనీర్ హౌజింగ్), లక్ష్మణ్ (ఎంపీఓ), పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, సాయిరూప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులు అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

రేవల్లి, జూలై 31 (జనంసాక్షి) : గోపాల్ పేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మన గ్రోమోర్, ఎరువుల దుకాణాలలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. డీలర్స్ అందరూ కూడా ఫెర్టిలైజర్ లైసెన్స్ మరియు ఫెర్టిలైజర్ రిజిస్టర్ మెయింటేన్ చేయాలని సూచించారు. ధరల పట్టిక అందుబాటు లో ఉన్న యూరియా నిల్వను ప్రదర్శించాలి . రైతులకు నాణ్యమైన ఎరువులు మాత్రమే అమ్మాలన్నారు. మండలం లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది. రైతులకు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ఈ పాస్ మెషిన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని అన్నారు. ఎంఆర్పీ ధరలకు మాత్రమే ఎరువులను అమ్మాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, గోపాల్‌పేట్ తహసిల్దార్ పాండు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఈఓ రాంమోహన్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వాధినేత పరిష్కరించాలి

- జేఏసీ నాయకులు బాధ్యతలను విస్మరించొద్దు
- ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుస్సేన్

వనపర్తి, జూలై 31 (జనంసాక్షి) : ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాధినేతయైన రేవంత్ రెడ్డి స్వయంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుందని, అధికారుల కాదన్న విషయాన్ని జేఏసీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ వర్క్స్ అసోసియేషన్ (ఆల్ మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుస్సేన్ హితవు పలికారు. ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా, విద్యాశాఖా మంత్రిగా రేవంత్ రెడ్డి తీసుకోవలసిన నిర్ణయమని , దీన్ని అధికారుల పై నెట్టివేసి పక్కదారి పట్టే ప్రయత్నాన్ని జేఏసీ నాయకులు మానుకోవాలని షేక్ ఫరూక్ హుస్సేన్ సూచించారు. వాస్తవానికి జేఏసీ నాయకులకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక లేదని,కేవలం మంత్రులతో అధికారులతో సమావేశాలు అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఆందోళన కార్యక్రమాలను రూపొందించడంలో పూర్తిగా వైఫల్యం పొందారని ఫరూక్ హుస్సేన్ పేర్కొన్నారు. వాస్తవానికి గత రెండు సంవత్సరాల రావాల్సిన పిఆర్సి ఇంతవరకు ఇవ్వకపోవడం, టిఆర్ఎస్ హయంలో పెండింగ్లో ఉన్న మూడు డి.ఏలు కూడా ఇంతవరకు సాధించకపోవడం జేఏసీ నాయకుల చిత్తశుద్ధి లోపమని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా మూడు డీ ఏ లు పెండింగ్ లోఉన్నప్పటికీ ప్రభుత్వ దృష్టికి తీసుకొకపోవడం దురదృష్టకరం అన్నారు. తమ యొక్క వైఫల్యాలను అధికారులు పై నెట్టివేసి తప్పించుకొని మార్గాలను అన్వేషించడం శోచనీయం అని ఆయన పేర్కొన్నారు. ఉద్యమాలు చేస్తామని ప్రకటించడం, ఆ ఉద్యమాలకు నెల రోజుల వ్యవధి తమకు తామే నిర్ణయించుకోవడము ప్రభుత్వ సమావేశములో పాల్గొని సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉద్యమ కార్యచరణలో విరమించుకోవడం వారికి అలవాటుగా మారిందని, వీరి వైఖరి కారణంగానే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంకావడం లేదన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అభయహస్తంలో రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న పెండింగ్ సమస్యలపై ఒకసారి పునర్ ఆలోచన చేస్తే వీరికి అర్థం అవుతుందని, ఇది కాంగ్రెస్ పార్టీ ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీ అని, అధికారులు ఇచ్చిన హామీలు కాదని గుర్తు చేసుకుంటే బాగుంటుందని అన్నారు. అసలు సమస్యలు గాలికి వదిలేసి , గాలి మాటలు మాట్లాడుతూ కాలం గడపడం సమర్థనీయం కాదన్నారు. ఈ కుబేర్లో ములుగుతున్న పెండింగ్ బిల్లులకు మోక్షం లేదని, రిటైర్డ్ ఉద్యోగస్తుల పరిస్థితులు దారుణంగా మారినయని వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎప్పుడొస్తాయో తెలియని తీవ్రమైనటువంటి ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయారని వారి సమస్యలకు పరిష్కారం లభించాలంటే రేవంత్ రెడ్డి గారు రాజకీయ నిర్ణయం తీసుకుంటే తప్ప ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కారం కావనే వాస్తవ విషయాన్ని ఉద్యోగ జేఏసీనాయకులు విస్మరించడం చాలా బాధాకరమన్నారు ఇప్పటికైనా ఉద్యోగస్తుల పక్షాన నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కార కోసం కనీస ఆందోళన కార్యక్రమంలో మెరుపు ధర్నాలు భోజన విరామ సమయంలో నల్ల నల్ల బ్యాడ్జిలప్రదర్శన లాంటి కార్యక్రమాలను గాలికి వ దిలి 15 రోజుల తర్వాత నెల రోజుల తర్వాత ఆందోళనచేపడతామని కాకమ్మ కబుర్లు చెప్పడం మానీ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయకపోతే ఉద్యోగ ద్రోహులుగా ఉద్యోగ జేఏసీ నాయకులు చరిత్రలో మిగిలిపోతారని ఆయన హెచ్చరించారు.

పాల్కూరికి సోమనాధుడు స్మృతివనం వినియోగంలోకి తేవాలి

- కోట్లు ఖర్చు పెట్టిన నిరూపయోగం పశువుల పాకలా మారింది
- సోమనాధుడు విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి, చీపుర్లతో ఊడుస్తూ బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

పాలకుర్తి, జూలై 31(జనంసాక్షి) మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన పాల్కూరికి సోమనాధుడు స్మృతివనం పశువుల పాకల మారడంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు సోమనాథుడు విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి, చీపుర్లతో ఊడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పాల్కూరికి స్మృతి వనాన్ని సందర్శించి పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ తో పాటు ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ బొమ్మల అశోక్ రెడ్డి, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హాయాంలో రూ. కోటి వెచ్చించి తొలి తెలుగు విప్లవ కవి పాల్కూరికి సోమనాథుడు పేరుతో స్మృతివనం నిర్మించారని తెలిపారు. మాజీ మంత్రి దయాకర్ రావు ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతీ, యువకులు కవులుగా, రచయితలుగా ఎదగాలని భావిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మృతి వనంపై పట్టింపులేదని వాపోయారు. స్మృతి వనం అలనా, పాలనా లేక ఆధ్వాన్నంగా తయారైందని విమర్శించారు. ఎక్కడ చూసిన పశువుల పేడతో నిండి ఉంది. జిల్లా కలెక్టర్ షేక్జ్వాన్ భాషా సందర్శించి పరిశీలించాలని కోరారు. దీనిని వెంటనే వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచెర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్సీఎస్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, మామిండ్ల శోభన్, రాజేంద్ర చారి, దొంతమల్ల గణేష్, కటారి పాపారావు. రాజేశ్వర్ రావు, మహేందర్ నాయక్, సురేష్ నాయక్, గాదపాక శ్రీనివాస్, యాకూబ్ నాయక్, ఎండి రాజమహమ్మద్, తాడం రవి, తదితరులు ఉన్నారు.

మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అన్నింట్లో పై చేయి మహిళలదే

పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి

జనగామ ప్రతినిధి, జూలై31 (జనంసాక్షి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి తో కలిసి దేవరోప్పుల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో... మేఘన స్వయం సహాయక సంఘానికి చెందిన మమత అనే మహిళ 2,60,000 రూపాయలతో...ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్ ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ...ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా చర్యలు చేపడుతుందన్నారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని ... ఆర్థికంగా ఎవరి పైన ఆధార పడకుండా పది మందికి జీవనోపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ఆగస్టు 15 కల్లా ఇలాంటి టీ స్టాల్ లు 50 ఏర్పాటు అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఒకే రకమైన బిజినెస్ కి అలవాటు పడకుండా మార్కెట్ డిమాండ్ కి అనుగుణంగా వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సంఘం సభ్యులను వ్యాపార రంగలోకి ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. అనంతరం టీ స్టాల్ లో కలెక్టర్, శాసనసభ్యులు, డి ఆర్ డి ఏ పీడీ తదితరులు కలిసి టీ తాగి..రుచికరంగా ఉందని వారిని అభినందించారు. ఆ తరువాత వన మహోత్సవంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ లో కలెక్టర్, శాసనసభ్యులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ, తహసీల్దార్ అడిషనల్ డి ఆర్ డి ఏ పీడీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంలలో అలారం వ్యవస్థ సక్రమంగా పనిచేయాలి

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులు ఏటీఎం లలో అలారం వ్యవస్థ సక్రమంగా ఉండే విదంగా చూసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రజల ఆర్థిక రక్షణకై జిల్లా పోలీసులు, బ్యాంకు అధికారులతో గురువారం పోలీసు హెడ్ క్వార్టర్స్ లో సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆద్వర్యంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రధాన బ్యాంకుల ముఖ్య అధికారులు మరియు రీజనల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎంతగానో నమ్ముతూ బ్యాంకులో తమ డబ్బులు నగదు బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉంటాయని నమ్మి పోలీసు వ్యవస్థపై నమ్మకంతో ఉంటారని దానిని వమ్ము చేయకుండా కలిసికట్టుగా పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బ్యాంకు లాకర్ల లో ఏటీఎంల లో బ్యాంకు చెస్టుల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సెన్సార్ లను సీసీటీవీ కెమెరాలను అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ అలారం వ్యవస్థ బ్యాంక్ అధికారులకు దగ్గర్లో ఉన్న పోలీసు అధికారులకు వచ్చే విధంగా చూడాలన్నారు. నెలకు ఒకసారి ఏటీఎంలో వద్ద బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు విషయంపై సెల్ఫ్ ఆడిట్ చేసుకుంటూ పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో ప్రత్యేకంగా బ్యాంకుల వద్ద ఏటీఎం ల వద్ద గస్తీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడం మంచిదని సూచించారు. అధిక మొత్తంలో నగదు తరలించే సమయంలో వీలైనంత సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తంగా ఉండే వారిని నియమించుకోవాలని సూచించారు. జాతీయ రహదారితో ఉన్న ఏటీఎం ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని దానితోపాటు వారాంతపు సమయంలో ఎక్కువ నగదు ఉండకుండా బ్యాంకు నియమాలను అతిక్రమించకుండా తగు చర్యలను చేపట్టాలని సూచించారు. దొంగలు నవీన పద్ధతులను ఉపయోగించడం తో మరింత అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ పెరిగిపోయిన కారణంగా మోసాలకు పాల్పడుతున్న వారి అకౌంట్లను ఫ్రీజ్ చేసే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని దీనికి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా ఒక సైబర్ క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్న కారణంగా వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటి వివరాలను ఎప్పటికప్పుడు పోలీసు అధికారులకు చేరవేస్తూ, అందజేయాలని సూచించారు. మ్యూల్ అకౌంట్ ల సమాచారం వివిధ బ్యాంకుల సమన్వయంతో పోలీసు అధికారులతో కలిసికట్టుగా ఉంటూ నేరాల నియంత్రణ కృషి చేయాలని సూచించారు. ప్రతి ఏటీఎంల నందు రెండు డివిఆర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న బ్యాంకు లు మరియు ఏటీఎంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, కె ఫణిదర్, బ్యాంకు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డులతో పేద ప్రజలకు ఆహార భద్రత

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ముధోల్, జూలై 31 (జనంసాక్షి) : ప్రభుత్వం అందజేస్తున్న నూతన రేషన్ రేషన్ కార్డుల వల్ల పేద ప్రజలందరికీ ఆహార భద్రత కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం తానూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రజలకు మేలు కలుగుతుందని తెలిపారు. తానూర్ మండలానికి గాను 1853 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, 2575 రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు అదనంగా చేర్చడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా రేషన్ కార్డులు అందిస్తామని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుందని, ప్రజలు వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీ సంతోషకరమైన విషయం అని అన్నారు. పేదలకు ప్రతి నెలా బియ్యం అందిస్తున్నందుకు గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో వెలుగు నింపిన గీతాంజలి

స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు

కేంద్ర ప్రభుత్వ డాక్టరేట్ పురస్కారం

నర్సంపేట జూలై 31 (జనం సాక్షి) : పాఠశాలలో చదువుతూ తల్లిదండ్రులను కోల్పోయిన పేద, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు పదవ తరగతి వరకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్న గీతాంజలి స్కూల్ యాజమాన్యానికి. కేంద్ర ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని అందించింది. అని. ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్. ప్రకటనలో గురువారం తెలిపారు ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ఎంపిక చేయబడిన అనేక సంస్థల మధ్య గీతాంజలి స్కూల్ ప్రాధాన్యతను సంపాదించి "సామాజిక విద్య సేవ" విభాగంలో గౌరవ డాక్టరేట్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.. నర్సంపేట నియోజకవర్గం ప్రజలకు ఎంతో సంతోషకర విషయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జగదీష్ ముఖి, అస్సాం, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాల మాజీ గవర్నర్ చిరాగ్ పాశ్వాన్, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి మీనాక్షి లేఖి, మాజీ విదేశాంగ సహాయ మంత్రి చందన్ కుమార్ చౌదరి, ఢిల్లీ శాసనసభ సభ్యుడు నుష్రత్ భారుచా, బాలీవుడ్ నటి నవాబ్ నజాఫ్ అలీ ఖాన్, హైదరాబాద్‌లోని నిజాం కుటుంబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వెనిజులా, మాల్దీవులు, ఇరాక్, రువాండా, తైమూర్-లెస్టే, బోస్నియా, హెర్జెగోవినా వంటి దేశాల నుండి వివిధ దౌత్యవేత్తలు, రాయబారులు మొదలగు మంత్రులు విద్యావేత్తల సమక్షంలో డాక్టరేట్ పురస్కారాన్ని పొందారని వారు పేర్కొన్నారు. సామాజిక సేవకు ప్రతీకగా నిలిచిన ఈ పాఠశాల దశాబ్దాలుగా వందలాది మంది పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తూ వారికి మెరుగైన భవిష్యత్తు నిర్మించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. గీతాంజలి స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ 'ఈ గౌరవం మాకు ప్రోత్సాహం. ఇది మా బాధ్యతను మరింత పెంచింది. ఇంకా ఎక్కువ మంది పేద విద్యార్థులకు చేరువయ్యేలా మా సేవలను విస్తరించబోతున్నాం' అని తెలిపారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వార్తను సంతోషంగా స్వాగతించారు. ప్రభుత్వం ఇలా ఉత్తమ విద్యాసంస్థలకు గుర్తింపు ఇవ్వడం, ఇతర సంస్థలకు ప్రేరణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. నా వంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు

విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు

పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ములుగు ప్రతినిధి, జులై 31(జనంసాక్షి) : విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో లో చదువుతున్న పదవ తరగతి, క్లాసు రూమ్ లను పరిశీలించి విద్యార్థినిలతో తెలుగు, ఇంగ్లీష్, హింది సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకొని, తెలుగు, ఇంగ్లీష్ పై పట్టు ఉండాలని, విద్యార్థుల తో తెలుగు చదివించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పోటీ తత్వంలో ముందుకు వెళ్లాలని అన్నారు. మీరు మంచిగా చదువుకోని మీ తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో కలిసి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, డిజిటల్ క్లాసు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. 3 వ తరగతి విద్యార్థిని డిజిటల్ స్క్రీన్ లో ఇంగ్లీష్ పదాలను చదువుతుండగా కలెక్టర్ వీక్షించారు.

మావోయిస్టుల వారోత్సవాలు..అప్రమత్తమైన పోలీసులు

ములుగు ప్రతినిధి, జులై 31(జనంసాక్షి) : జిల్లాలోని వాజేడు మండలంలో మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా ఎస్పి జక్కుల సతీష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. గుమ్మడిదొడ్డి గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎస్పి ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి సతీష్ మాట్లాడుతూ, మావోయిస్టు వారోత్సవాల నేపద్యంలో తెలంగాణ రాష్ట్రం అలర్ట్ అయ్యింది. జిల్లాల వారీగా టార్గెట్ చేస్తూ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని, ఈ నెల 28 నుండి, ఆగస్టు 3 వరకు జరగనున్న మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలపై పోలీసులు ములుగు జిల్లా వ్యాప్తంగా హై అలెర్ట్ అయ్యారు. పోలీసులు ప్రత్యేక బలగాలతో అటవీ, గ్రామీణ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. సరిహద్దు గోదావరి తీర ప్రాంతాల్లో, లోతట్టు గ్రామాలు, అంతరాష్ట్ర వంతెనల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీ చేపట్టి అనుమానితులను విచారిస్తున్నామని, ప్రధాన రహదారులు, అడవులను జల్లెడ పడుతున్నమని, ఏజెన్సీ గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏజన్సీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరిమీద అయినా అనుమానం వస్తే తెలియచేయాలని ఎస్పి తెలిపారు.

కెజిబివిని పరిశుభ్రంగా ఉంచాలి

పరిశుభ్రంతోనే ఆరోగ్యం

ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ పాటించాలి

వంటగది నిరంతరం శుభ్ర పరచాలి

వేడిగా ఉన్న పదార్థాలనే విద్యార్థినులకు వడ్డించాలి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్

జనగామ ప్రతినిధి, జూలై31(జనంసాక్షి): గురువారం తరిగొప్పుల మండలంలో పర్యటించి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సందర్శించి నిర్వహణ తీరును పర్యవేక్షించారు. విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ బోర్డ్ ను పరిశీలిస్తూ భోజనం ఎలావుంది? మెనూ ప్రకారంగా పెడుతున్నారా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరు పాఠశాలలో ఉండాలని, 100 శాతం హాజరు నమోదు ఉండాలన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యాపరంగా ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగ పరచుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వంట శాలను సందర్శించి విద్యార్థినుల కొరకు వండిన ఆహార పదార్థాలు పరిశీలించారు. స్టోర్ రూమ్ ను సందర్శించి నిల్వ చేసిన సరుకులను పరిశీలిస్తూ నాణ్యమైన సామగ్రిని తెప్పించుకోవాలన్నారు. అదే పాఠశాలలో విద్యార్థినులకు ఆర్వోఆర్ ప్లాంట్ ద్వారా అందిస్తున్న త్రాగునీరు యంత్రాన్ని పరిశీలించారు. వనమహోత్సవం సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులుతో కలిసి మొక్కను నాటారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి భోజన్న, బాలికల అభివృద్ధి అధికారిణి గౌసియా బేగం ,ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

జిల్లా పౌర సంబంధాల

అధికారి పి.రాజేంద్రప్రసాద్

మహబూబాబాద్ బ్యూరో, జూలై 31(జనం సాక్షి): ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకువెళ్లాలని డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ డిపిఆర్ఓ కార్యాలయంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ, టీం లీడర్లు కొమీరే వెంకన్న, గిద్దె రాంనర్సయ్య, మెరుగు రవీందర్ గౌడ్, లతో కలిసి డిపిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నందున వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకువెళ్లే గురుత్వరబాధ్యత ప్రభుత్వ సాంస్కృతిక సారథి సభ్యులపై ఉందని ఆయన అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి,500 కే గ్యాస్ పంపిణీ, సన్న బియ్యం,రేషన్ కార్డుల, పంపిణీ, ఇందిరా జల గిరి వికాసం, స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ, మహిళలకు పెట్రోల్ పంపులు నిర్వహణ, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ, తదితర 6 గ్యారంటీల పథకాలు ద్వారా ప్రజలు ఎంతో ఉపయోగపడటం జరుగుతుందని ఆయన అన్నారు, క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. వినూత్న రీతుల్లో పాటలు, పల్లె సుద్దులు, వీధి నాటకాలు తదితర రూపాల్లో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని, ఆయన అన్నారు. జిల్లాలో జరిగే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి ప్రత్యేక కార్యక్రమాలలో సాంస్కృతిక సారథులు భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కె.రాము, సాంస్కృతిక సారథి సభ్యులు బండ వెంకన్న,ఐలేష్ కుమార్, భరత్, దర్శనం యుగంధర్, సురేష్, దప్పు శ్రీను, నరేష్, ప్రవీణ్, గౌరారపు యుగేందర్, బక్కీ యాది, కందుకూరి అనిల్, పరమేష్, పాష, కవిత,రోజా, రాజ్యలక్ష్మి, అశ్విని, సింధుజ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

నా అభిమానులు, కార్యకర్తలు

భూపాలపల్లిలోనే ఉన్నారు

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

భూపాలపల్లి, జూలై 31 (జనం సాక్షి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అంబేద్కర్ , ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలవేసి బీసీలకు న్యాయం జరగాలని కోరడం జరిగింది . ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ నా చివరి శ్వాస వరకు భూపాలపల్లి నియోజకవర్గం ప్రజలతోని కలిసి ఉంటా అన్నారు , తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని కెసిఆర్ నాయకత్వంలో సాధించడం జరిగింది అనంతరం 2014 ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుండి నేను ఎమ్మెల్యేగా భూపాలపల్లి నియోజకవర్గంలో గెలవడం జరిగింది , గెలిచిన తర్వాత మొట్టమొదటిసారి కెసిఆర్ నాకు స్పీకర్ పదవిని ఇవ్వడం జరిగింది , దానితో భూపాలపల్లి నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశాను అనంతరం జిల్లా ఏర్పాట్ల కూడా నా వంతు కృషిచేసి ప్రొఫెసర్ జయశంకర్ పేరుమీద జయశంకర్ నూతన జిల్లాను తీసుకురావడం జరిగింది , నియోజకవర్గం లోని అనేక గ్రామాలలో పర్యటించి పల్లెనిధులు చేసి గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపించాను కావున నా అభిమానులు కార్యకర్తలు ప్రజలు భూపాలపల్లి నియోజకవర్గంలోనే ఉన్నారు నా చివరి శాస వరకు భూపాలపల్లి నియోజకవర్గం ప్రజలతోని ఉంటాను ప్రతి నెలలో రెండు రోజులు నియోజకవర్గంలోని ఉంటాను ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను అని అన్నారు ఈ కార్యక్రమంలో సిరికొండ అభిమానులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
01 ఆగస్టు 2025

పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● మంత్రి పొంగులేటి

కూసుమంచి, జూలై 31 (జనం సాక్షి) : ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు ఉన్నా పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి గురువారం కూసుమంచిలో పర్యటించి 5 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, జిల్లా పరిషత్ హైస్కూల్ లో పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిళ్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కూసుమంచి మండలంలో 5 కోట్ల 50 లక్షలతో జూనియర్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాకుండా, డిసెంబర్ చివరి వరకు పనులు పూర్తి చేసి జూనియర్ కళాశాలను ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 8 తరగతి నుంచి 10వ తరగతి చదివే ఆడ పిల్లలకు గత సంవత్సరం సైకిళ్ళను పంపిణీ చేశామని అన్నారు. ప్రస్తుతం 8వ తరగతి వచ్చిన విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం 8 నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు సైకిల్స్ అందిస్తానని అన్నారు. విద్యారంగంలో కాస్త వెనుకబడి ఉన్న పాలేరు నియోజకవర్గాన్ని

విద్య పట్ల అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. గత 20 నెలల కాలంలో 470 కోట్ల రూపాయలను విద్యా రంగంలో పాలేరు నియోజకవర్గానికి మంజూరు చేశామని అన్నారు. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం, 208 కోట్లతో జే.ఎన్.టి.యూ. ఇంజనీరింగ్ కాలేజీ, 46 కోట్లతో ఐటిఐ కళాశాల, 5.5 కోట్ల జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెం హాస్టల్ 2 కోట్ల 70 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామని అన్నారు. హైదరాబాద్ సమీపంలో అభివృద్ధి చేస్తున్న ఫోర్త్ సీటీలో పిల్లలకు నైపుణ్యం నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తుందని, ఇందులో భాగంగా జూనియర్ కళాశాలను 5 నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రివర్యులు ఆదేశించారని, డిసెంబర్ చివరి నాటికి పాఠశాల ఎదురుగా జూనియర్ కళాశాలను సిద్ధం చేస్తామని అన్నారు. అనంతరం కూసుమంచి మండలానికి చెందిన 75 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు సైకిళ్లను అందజేసి మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ స్కూల్ ఆవరణలో సైకిల్ నడిపి పిల్లల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, బేబీ స్వర్ణ కుమారి, సి డి సి మాజీ చైర్మన్ జూకురు గోపాలరావు, జొన్నలగడ్డ రవికుమార్, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, కొమురెల్లి ఆలింగా గోవిందరెడ్డి, మాదాసు ఉపేందర్, మారోజు భీష్మాచారి, ఎండి ఆఫీజ్ ఉద్దీన్, కలీం, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బురదజల్లే రాజకీయాలు మానుకోవాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 31 (జనంసాక్షి) : తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు మూడు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసి రైల్వే నుండి స్ట్రక్చరల్ డిజైన్, డ్రాయింగ్స్ ను పూర్తి చేయకుండా అలసత్వం ప్రదర్శించి భూసేకరణ కాకపోవడం వల్ల పనులు జరుగలేదని రాష్ట్ర ప్రభుత్వం పై నెట్టేయాలని చూస్తున్న బిజెపి నిజ స్వరూపం ప్రజలకు తెలుపడానికే పనులు పరిశీలించి వాస్తవాలు మీడియా ద్వారా తెలియజేస్తున్నానని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.

2025 మార్చి 27 వ తారీఖు రోజు డ్రాయింగ్స్ ఫైనల్ అయ్యాయని ఆర్అండ్ బి అధికారులు మెయిన్ పియర్స్ వదిలి పెట్టి మిగతా పియర్స్ పనులు పూర్తి చేసి డ్రాయింగ్స్ కోసం వేచి చూడాల్సి వచ్చిందని గత అయిదు సంవత్సరాలు ఎంపిగా ఇప్పుడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఉన్న బండి సంజయ్ కుమార్ డ్రాయింగ్స్ విషయంలో జాప్యం చేశారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. విషయాన్ని కప్పి పుచ్చడం కోసం భూసేకరణ జరగక పోవడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పై నెట్టే ప్రయత్నాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నరేందర్ రెడ్డి అన్నారు. బిజెపి నాయకుల డైవర్షన్ పాలిటిక్స్ పైనే నిమగ్నమై ఉన్నారని డివిజన్ల డిలిమిటేషన్ విషయంలో ఎంఐఎం కు అనుకూలంగా చేశామని, బిసి లకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో ముస్లింలకు కేవలం 1.8 శాతం వస్తే పది శాతం వస్తుందని మూడు సంవత్సరాలుగా కనీసం డ్రాయింగ్స్ పూర్తి చేయలేక పనులు ఆలస్యమైతే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం పై నెట్టేయాలని చూడడం ఇవన్నీ బిజెపి డైవర్షన్ పాలిటిక్స్ అని నరేందర్ రెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బిజెపి నాయకులు చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయడంలో సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

సూర్యాపేట ప్రతినిధి, జూలై 31 (జనంసాక్షి) : విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ ఇష్టంతో చదివి మంచి మార్కులు తెచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకాక్షించారు.గురువారం సూర్యాపేట మండలం టేకుమట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను, వ్యక్తులు చేసే వృత్తి ద్వారా సమాజంలో గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి భవిష్యత్తును రూపొందించడానికి పాఠశాల స్థాయి నుండే కష్టపడాలని తెలిపారు.విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషలపై పట్టు సాధించాలని తెలిపారు.బోధనా పద్ధతులు,భాషా నైపుణ్యాలను పొందడంలో విద్యార్థుల పురోగతి సాధించాలని అన్నారు.విద్యార్థులు క్రమంగా మెరుగుపడుతున్నప్పటికీ, నెమ్మదిగా నేర్చుకునేవారికి అర్థం అయ్యేలా భోదించేందుకు ప్రత్యేక ప్రయత్నాలు చేయాలని, వారి ప్రాథమిక జ్ఞానాన్ని బలోపేతం చేయడానికి,వారి అభ్యాస ఫలితాలను పెంచడానికి అదనపు తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్డిఏ పిడి వివి అప్పారావు,తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ప్రధాన ఉపాధ్యాయులు పాపయ్య, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు రాష్ట్రానికే ఆదర్శం కావాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ బ్యూరో, జూలై 31 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా కేంద్రంలోని జివి గూడెం వద్ద 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఈ నెల 4 న శంఖుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్గొండ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆయన ఆదేశించారు. గురువారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నమూనా,నిర్మాణ పనుల పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి సమీక్షించారు. 5 లక్షల 58 వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో 9 వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్స్, 3000 మందికి ఒకేసారి భోజనాన్ని వండేలా వంటగది, 1280 మంది ఒకేసారి భోజనం చేసే విధంగా డైనింగ్ హాల్ వంటి వాటితో నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అంతేకాక వాలీబాల్, సెటిల్, ఫుట్బాల్ తదితర కోర్టుల నిర్మాణంతో పాటు, ఓపెన్ఎయిర్ థియేటర్, ల్యాబులు, లైబ్రరీ

స్టాఫ్ రూములు, క్వార్టర్స్ ను నిర్మించనున్నారు. ఈ విషయాలన్నింటినీ టి జి ఈ డబ్ల్యు ఎం ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర మంత్రికి, జిల్లా కలెక్టర్ కు వివరించారు. 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న నల్గొండ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలో అన్ని సౌకర్యాలు, హంగులతో కూడుకొని ఉండాలని మంత్రి తెలిపారు. 4 వ తేదీన నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాల మొత్తానికి విద్యుత్ సరఫరా చేసే విధంగా సోలార్ ప్యానళ్ళు ఏర్పాటు చేయాలని, పాఠశాల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంటు అన్ని ముందే సమకూర్చుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు ,కాంట్రాక్టర్ ను ఆయన ఆదేశించారు. భవన నిర్మాణాలలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే ముందే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కోరారు .పనులు మొదలుపెట్టిన తర్వాత ఎట్టి పరిస్థితులలో ఆపకుండా నిరంతరం పనులను కొనసాగించి సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి అప్పగించాలని చెప్పారు. పాఠశాల పూర్తి నాణ్యతతో ఉండాలని ,పాఠశాల ఆవరణలో ఎక్కడ వర్షం నీరు, ఇతర నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. బోధనేతర సిబ్బందికి ముందుగా వసతి సౌకర్యం కల్పించేలా ఉండాలని, ఒక్కసారి విద్యార్థి పాఠశాలలో అడుగుపెట్టిన తర్వాత మళ్లీ బయటికి వెళ్లకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, టీజీ ఈ డబ్ల్యు ఐడిసి డిప్యూటీ ఇంజనీర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో విద్యాభివృద్ధికి 470కోట్లు మంత్రి పొంగులేటి

పాలేరు, జూలై 31 (జనం సాక్షి) : పాలేరు నియోజక వర్గంలో470కోట్లు విద్యాభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ పౌరసంబంధాల.గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు ఈ రోజు కూసుమంచి లో ప్రభుత్వ.జూనియర్ కళాశాల భవనాన్ని పాత ఉన్నత పాఠశాల.ఆవరణలోశంకుస్థాపన చేశారు భవనాన్ని డిసెంబర్ నెల ఆఖరు వరకు పూర్తి చేసి వినియోగం లోకి తేవాలన్నారు. పి ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా బాలికలకు.సైకిళ్ళు.పంపిణీ చేశారు పేద పిల్లలేవారు ఆర్థిక.ఇబ్బందులతో.విద్యకు.దూరం.కావద్దన్నారు ప్రభుత్వం నుంచి అయిన వ్యక్తి గతంగా అయిన సహాయం చేస్తానన్నారు. ఐటిఐ నైపుణ్య విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ స్కూల్ లాంటి.వి.విద్య అభివృద్ధికి కొత్తగా తెచ్చామన్నారు. పేద పిల్లలను మనిరత్నాలుగా తీర్చి దిద్దడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కూసుమంచి, జూలై 31 (జనం సాక్షి) : ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఆయుర్వేద, యునానీ, హోమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. సేవలు, మందుల అందుబాటు, సూచిక బోర్డు, వైద్య సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి, ప్రసూతి కాన్పుల గది, అపరేషన్ థియేటర్ పరిశీలించారు. డాక్టర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ వైద్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన పరికరాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు డా. సాయికుమార్, డా. లక్ష్మిలోహిత, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

ఖమ్మం రూరల్, జూలై 31 (జనం సాక్షి) : సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి వర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హోట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని మొత్తం పరిశీలించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ డ్రాఫ్ట్ ప్లాన్ వివరాలను ఆర్ అండ్ బీ అధికారులు, జిల్లా కలెక్టర్ల నుంచి మంత్రివర్యులు తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసిల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపులను టీఆర్ఎస్ పార్టీనే ప్రోత్సహించింది

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 31 (జనం సాక్షి) : అధికార కాంగ్రెస్‌కు విధేయత చూపిన 10 మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మరియు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ స్వాగతించారు. ఈ తీర్పు స్పీకర్, రాజ్యాంగ అధికారాన్ని స్పష్టంగా నిరూపించడమేనని మరియు బిఆర్ఎస్ ఒకప్పుడు దోపిడీ చేసిన అధికారాలను ఇప్పుడు ప్రశ్నిస్తున్న దాని ముఖంపై చెంపదెబ్బ అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా మీడియాతో షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈ తీర్పు మేము ఊహించిందే అన్నారు. సుప్రీంకోర్టు స్పీకర్ అధికారాలను స్పష్టంగా సమర్థించిందని, అసెంబ్లీ మరియు న్యాయవ్యవస్థ రెండూ వాటి స్వంత అధికార పరిధి కలిగిన స్వతంత్ర సంస్థలు అని పేర్కొంది.స్పీకర్ పాత్రను అణగదొక్కడానికి ప్రయత్నించిన కెటి రామారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. బిఆర్ఎస్ ద్వంద్వ ప్రమాణాలు మరియు రాజకీయ అవకాశవాదాన్ని ఆయన ఆరోపించారు. తన పాలనలో సామూహిక ఫిరాయింపులను రూపొందించి, పదే పదే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని విస్మరించిన బిఆర్ఎస్, ఇప్పుడు తన సొంత రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి రాజ్యాంగ నిబంధనల వెనుక దాక్కునేందుకు ప్రయత్నించడం విడ్డూరం అని ఆయన అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణలో రాజకీయ ఫిరాయింపుల సంస్కృతిని ప్రోత్సహించారని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. దేశంలో మరే ఇతర నాయకుడు కేసీఆర్ లాగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని క్రమపద్ధతిలో బలహీనపరచలేదని అన్నారు.గత 10



సంవత్సరాలుగా, చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోకుండా కనీసం 43 మంది ఎన్నికైన ప్రతినిధుల ఫిరాయింపులకు ఆయన దోహదపడ్డారు అని అన్నారు.కేసీఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ఎమ్మెల్సీల ఫిరాయింపు కారణంగా నేను శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా నా పదవిని కోల్పోయాను అని ఆయన అన్నారు.నిర్దిష్ట ఉదాహరణలను ఉటంకిస్తూ, తెలంగాణ ఏర్పడిన రోజు జూన్ 2న, ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు ఇంద్రకరణ్ రెడ్డి మరియు కోనేరు కోనప్ప బిఆర్ఎస్ లో చేరినప్పుడు ఫిరాయింపుల ఆచారం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. తరువాత, టిడిపి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన పార్టీకి రాజీనామా చేయకుండా మంత్రిగా నియమితులయ్యారని, టిడిపి ఎమ్మెల్యేగా ఉంటూ 14 నెలలకు పైగా ఆ పదవిలో కొనసాగారన్నారు, ఇది రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘన. కాద అని ప్రశ్నించారు.కెసిఆర్ మొదటి పదవీకాలంలో 4 మంది ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు మరియు 18 మంది ఎమ్మెల్సీల ఫిరాయింపును బిఆర్ఎస్ నిర్వహించిందని. రెండవ పదవీకాలంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరియు ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి ఫిరాయించారు.ఇవి ఒకేసారి జరిగిన సంఘటనలు కావా అన్నారు. అవి రెండు పదవీకాలాలలో రెండేళ్ల వ్యవధిలో జరిగాయన్నారు.ఫిరాయింపులను చట్టబద్ధం చేయడానికి మరియు ఉప ఎన్నికలను నివారించడానికి కెసిఆర్ స్పీకర్ కార్యాలయాన్ని ఉపయోగించారని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలో ఇప్పటికే ఉన్న దానిని కోర్టు మరింత బలోపేతం చేసింది అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం స్పీకర్‌కు ఉందన్నారు. స్పీకర్ అధికారాలను కోర్టు తగ్గించలేదని, కాలపరిమితితో కూడిన పద్ధతిలో త్వరిత చర్య తీసుకోవాలని ఆదేశించిందని ఆయన నొక్కి చెప్పారు.సందేశం స్పష్టంగా ఉంది: రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకూడదు లేదా స్తంభింపజేయకూడదని ఆయన అన్నారు.స్పీకర్ అధికారాన్ని అప్రతిష్టపాలు చేయడానికి బిఆర్ఎస్ చేసిన ప్రయత్నం తిప్పికొట్టిందని షబ్బీర్ అలీ అన్నారు.ఈ తీర్పు బిఆర్ఎస్ యొక్క కపటత్వాన్ని బహిర్గతం చేయడమే కాకుండా రాజ్యాంగ ప్రక్రియలపై ప్రజల విశ్వాసాన్ని కూడా పునరుద్ధరించిందన్నారు.ఒకప్పుడు ఫిరాయింపులను చట్టబద్ధం చేయడానికి స్పీకర్ కార్యాలయాన్ని ఉపయోగించిన కేసీఆర్ ఇప్పుడు అదే సంస్థను ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ వైరుధ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందిని ఆయన అన్నారు.

నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభం

నల్గొండ బ్యూరో, జూలై 31 (జనం సాక్షి) : మోబైల్ ఫోరెన్సిక్ వాహనంతో నేరం జరిగిన ప్రదేశానికి త్వరగా చేరుకుని నేర దర్యాప్తులో ఖచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా క్లూస్ టీమ్ కి కేటాయించిన నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇక నుంచి నేరం జరిగిన ప్రదేశానికి క్లూస్ టీం త్వరితగతిన చేరుకొని, నేర నమూనాలను సేకరించడానికి నూతన సాంకేతిక టెక్నాలజీతో డీఎన్ఏ శాంపిల్ కలెక్షన్ కిట్, రక్త నమూనా మరియు సేమన్ కలెక్షన్ కిట్, నార్కోటిక్ డిటెక్షన్ కిట్, పేలుడు పదార్థాల డిటెక్షన్ కిట్, ఎల్.ఈ.డీ. సెర్చ్ లైట్, గ్యాస్ డిటెక్టర్, నేర ఆధారాలను భద్ర పరచి ఫోరెన్సిక్ సేఫ్ డ్రాయింగ్ క్యాబినెట్ లాంటి అన్ని సదుపాయాలు ఈ వాహనంలో ఉంటాయని అన్నారు. ఎప్పుడైనా హత్యలు, మానభంగాలు, అనుమానస్పద మరణాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు ఈ పరికరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటూ నేర దర్యాప్తు విషయంలో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అన్ని సదుపాయాలు ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనం లో ఉండడం వలన నేర పరిశోధన సులభతరం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, ఆర్.ఐ లు సూరప్ప నాయుడు, సంతోష్, నరసింహ, క్లూస్ టీమ్ ఇంచార్జి ఎస్సై శివ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

జనంసాక్షి: భారత ఎగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు గురువారం అస్థిర సెషన్ లో ప్రతికూలంగా ముగిశాయి. సెన్సెక్స్ 296.28 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 81,185.58 వద్ద స్థిరపడింది. గురువారం ఈ సూచీ 81,803.27 నుంచి 80,695.15 శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ 50 కూడా 86.70 పాయింట్లు లేదా 0.35 శాతం క్షీణించి 24,768.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.70-1.34 శాతం రేంజ్‌లో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ షేర్లు 3.61 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.05 శాతం, 0.93 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ మార్కెట్ ధోరణులను అధిగమించి ఇమామీ, హిందుస్థాన్ యూనిలీవర్ నేతృత్వంలో 1.44 శాతం లాభాలతో స్థిరపడింది. నిఫ్టీ ఫార్మా, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్ కేర్ సూచీలు 1 శాతానికి పైగా నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో ట్రేడైన 4,153 షేర్లలో 2,418 రెడ్‌లో, 1,598 గ్రీన్‌లో ముగిశాయి. 137 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

మోటరోలా కొత్త ఫోన్..

- రూ.18వేల లోపే పవర్‌ఫుల్ మొబైల్

జనంసాక్షి: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మోటరోలా తాజాగా మోటో జీ86 పవర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. ఇందులో 8జీబీ ర్యామ్, 128 జీబీ మెమరీ వెర్షన్ ధర రూ. 17,699గా ఉంటుంది. అదనంగా రూ. 1,000 బ్యాంక్ డిస్కౌంటు పోగా రూ. 16,999కే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఇందులో 6.67 అంగుళాల పీఓఎల్ఈడీ సూపర్ హెచ్‌డీ ఫ్లాట్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ 7ఐ, 50 ఎంపీ ఓఐఎస్ సోనీ కెమెరా, రెండు రోజుల వరకు సరిపోయే 6720 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, మీడియాటెక్ డైమెన్సిటీ 7400 చిప్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో అన్ని లెన్స్‌లతో 4కే వీడియో రికార్డింగ్ చేసే వీలుంటుంది. మోటరోలా జీ86 పవర్ లో 6.67 అంగుళాల 1.5కే పీఓఎల్ఈడీ సూపర్ హెచ్‌డీ ఫ్లాట్ డిస్‌ప్లే, 4500 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఉన్నాయి. మీడి యాటెక్ డైమెన్సిటీ 7400 ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్ ం 128 జీబీ స్టోరేజ్ ఇం దులో అందించారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హలో యూఐ ఆపరేటింగ్ సిస్టంపై ఈ ఫోన్ పనిచేయనుంది. ఈ డివైజ్ 1 సంవత్సరం ఓఎస్ అప్ గ్రేడ్ లు, 3 సంవత్సరాల సెక్యూరిటీ అప్ డేట్ లను అందిస్తుంది. వీటిలో ప్రధాన కెమెరా సామర్థ్యం 50 మెగా పిక్సెల్ కాగా, దీంతోపాటు 8 మెగా పిక్సెల్ అ ల్ట్రావైడ్ కెమెరా కూడా ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్ వెనుక భాగంలో ఫ్లిక్కర్ సెన్సార్ కూడా ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందువైపు 32 మెగాపిక్సెల్ కెమెరాను అందించారు. ఏఐ ఫోటో ఎన్‌హాన్స్‌మెంట్, ఏఐ సూపర్ జూమ్, ఏఐ ఆటో స్మైల్ క్యాప్చర్, టిల్ట్ షిఫ్ట్ మోడ్ వంటి స్మార్ట్ ఫీచర్లతో మోటో ఏఐ లభిస్తుంది. ఇందులోని 6,720 ఎంఏహెచ్ బ్యాటరీని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 53 గంటల రన్ టైమ్ తో 2 రోజులకు పైగా పవర్ ను అందిస్తుంది.

ఉద్యోగాలు పోతున్నాయ్..

పలు విభాగాల అధికారుల కొలువులు డేంజర్‌లో..

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవంలో భాగంగా చాట్ జీపీటీ ప్రవేశపెట్టినప్పటి నుంచి విశ్లేషకులు, నిపుణులు, సీఈఓలు వైట్ కాలర్ రోల్స్ లో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూనే ఉన్నారు. ఏఐ ప్రభావం కలిగించే లేదా పూర్తిగా భర్తీ చేసే అవకాశం ఉన్న 40 రకాల ఉద్యోగాలను మైక్రోసాఫ్ట్ మద్దతుతో నిర్వహించిన ఒక తాజా అధ్య యనం జాబితా చేసింది. ఉపాధ్యా యులు, పాత్రి కేయులు, కాల్ సెంటర్ ఏజెంట్లు వంటి వృత్తులు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నా యి. ఓపెన్ఏఐ, లింక్డ్ఇన్ సహకారంతో నిర్వహించిన ఈ పరిశోధన ప్రపంచ శ్రామిక శక్తిలోని వివిధ రంగాల్లో జనరేటివ్ ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ విస్తృత ప్రభావాన్ని ఎత్తిచూపింది. చాట్ జీపీటీ వంటి ఏఐ సాధనాలను వేగంగా స్వీకరించడంపై పెరుగుతున్న ఆందోళనల మధ్య ఈ అధ్యయనం జరిగింది.

జనంసాక్షి: ఈఏడాది ఒక్క మైక్రోసాఫ్ట్ మాత్రమే దాదాపు 15వేలతొలగింపులను ప్రకటించింది. టెలిమార్కెటర్లు, ఉపాధ్యాయులు, కస్టమర్ సర్వీస్ ప్రతినిధులు, సైకాలజిస్టులు, న్యాయమూర్తులు, సామాజిక శాస్త్రవేత్తలు, న్యూస్ అనలిస్టులు, పాత్రికేయులు, టెక్నికల్ రైటర్లు, ప్రూఫ్ రీడర్లు, అనువాదకులు, సామాజిక కార్యకర్తలు, బీమా అండర్ రైటర్లు, ఆంత్రోపాలజిస్టులు, క్లినికల్ డేటా మేనేజర్లు, సర్వే పరిశోధకులు, చరిత్రకారులు, రాజకీయ శాస్త్రవేత్తలు, ఆర్బిట్రేటర్లు, ఎపిడెమియాలజిస్టులు, హెచ్ఆర్ స్పెషలిస్టులు, మధ్య వర్తులు, కెరీర్ కౌన్సిలర్లు, క్యూరేటర్లు, కరస్పాండెంట్లు, కాపీ రైటర్లు, ఎడిటర్లు, మార్కెట్ రీసెర్చ్ అనలిస్టులు, లీగల్ సెక్రటరీలు, ట్రైనింగ్ స్పెషలిస్టులు, పబ్లిక్ రిలేషన్స్ స్పెషలిస్టులు. క్లీనర్లు, డిష్ వాషర్లు, కార్మికులు,కార్పెంటర్లు, పెయింటర్లు, మెకానిక్‌లు, వెల్డర్లు, బచర్స్, బేకర్లు, డెలివరీ వర్కర్లు, వంట వారు, కాపలాదారులు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లం బర్లు, భవన నిర్మాణ కార్మికులు,సెక్యూరిటీగార్డులు,మేస్త్రీలు, టైలర్లు.

నివేదికలోని అంశాలు

కంపెనీలు పేరోల్ క్లర్కులు, మేనేజర్ల స్థానంలో ఏఐ ఏజెంట్లను పూర్తిగా నియమిస్తున్నాయి. సిస్టమ్ అడ్మిన్లు, కన్సల్టెంట్ల స్థానంలో కంపెనీలు ఏఐ టూల్స్‌తో భాగస్వామ్యం ఏర్పరుచుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఏఐతో సంబంధం ఉన్న కాన్ఫిగరేటర్లు, ఎక్స్ పీరియన్స్ డిజైనర్లు, డేటా సైంటిస్టు పోస్టుల్లో కొత్తగా నియామకాలు చేపడుతున్నాయి. 2030 నాటికి తయారీ రంగంలో 8 మిలియన్ల ఉద్యోగాలు ఏఐ వల్ల ప్రభావితం చెందుతాయి. రిటైల్‌లో 7.6 మిలియన్ ఉద్యోగాలు, ఉద్యుకేషన్‌లో 2.5 మిలియన్ కొలువులు ప్రభావితం అవుతాయి. టెక్ పరిశ్రమల్లో కొత్తగా 3 మిలియన్ల ఉద్యోగాలు వస్తాయి. భారత్‌లో 25% సంస్థలు కృత్రిమ మేధ అనుసరించేలా పరివర్తన దశలో ఉన్నాయి. ఈ విషయంలో సింగపూర్, ఆస్ట్రేలియా కంటే భారత్ ముందుంది. 13.5% టెక్నాలజీ బడ్జెట్లు ఇప్పటికే కృత్రిమ మేధకు కట్టుబడి ఉన్నాయి. 57% సంస్థలు ఏఐ సామర్థ్య లాభాలను నివేదించాయి. ఏఐ రీడిజైన్ చేసిన వర్క్‌ఫ్లోల నుంచి 63% ఉత్పాదకత పెరిగింది.

ఏఐ అనివార్యం..

*కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు, వ్యవస్థలు మార్పుకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్ అన్నారు. లేదంటే సమస్యలు తప్పవని హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఏఐ ఉత్పాదకతను పెంచే క్రమంలో చాలామంది సిబ్బంది తమ కొలువులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 'కృత్రిమ మేధ నేతృత్వంలోని ఆటోమేషన్ ఒక సానుకూల మార్పు. ఇది ప్రజలను, ఉద్యోగులను ఇతర మెరుగైన కొలువులు చేయడానికి సాయం చేస్తుంది. ఉత్పాదకతను మెరుగుపరిచే క్రమంలో ఏఐ వాడకం అనివార్యం అవుతుంది. కాబట్టి అందుకు అనువుగా మార్పులకు సిద్ధంగా ఉండాలి. లేదంటే సమస్యలు వస్తాయి. ఏఐ వేగంగా విస్తరిస్తోంది. అంత వేగంగా వచ్చే మార్పులకు సర్దుకుపోయే సమయం ఉండదనేదే ప్రశ్న' అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఎంత వేగంగా అమలవుతున్నాయోనన్న ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రాబోయే రోజుల్లో అనేక ఎంట్రీ లెవల్ వైట్ కాలర్ ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భర్తీ చేయవచ్చని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపడిన తర్వాత భవిష్యత్తులో మాన్యువల్ లేబర్ తీవ్రంగా ప్రభావితం చెందుతుంది. 'రోబోటిక్ ఆయుధాలు ఇంకా అభివృద్ధి చెందలేదు. కానీ అవి అందుబాటులోకి వస్తే, శ్రామిక శక్తిని పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తాయి' అని గేట్స్ చెప్పారు. 'ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్(ఏజీఐ) ఆన్‌లైన్ సేల్స్ లేదా కస్టమర్ సర్వీస్ వంటి సంక్లిష్ట పనులను మానవుల కంటే మెరుగ్గా చేయగలదు. ఏజీఐ వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విషయాల ద్వారా సర్వీసు అందిస్తాయి. యంత్రాలు తక్కువ ఖర్చుతో మరింత కచ్చితత్వంతో పనులను నిర్వహించగలిగితే మాత్రం అది పెద్ద మార్పు అవుతుంది' అని గేట్స్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా వాడుతున్నారని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఏఐ పురోగతిలో ఉన్న వేగం నిజంగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కఠినమైన విషయాలను అర్థం చేసుకోవడానికి ఏఐ రీసెర్చ్ టూల్స్‌ను ఉపయోగిస్తాను. అయితే వాటిలోని అంశాలను ధ్రువీకరించేందుకు నిపుణులతో తరచూ తనిఖీ చేస్తాను. విచిత్రంగా వారుకూడా చాలాసార్లు అందులోని అంశాలు నిజమనే చెబుతారు' అని అన్నారు.

విభిన్న రంగాల్లో ఏఐ పాగా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలు ప్రస్తుత ఉద్యోగుల స్థానాన్ని క్రమంగా ఆక్రమిస్తున్నాయి. ఇప్పటికే చాలా సంస్థల్లోని క్లర్క్, మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో ఏజెంటిక్ ఏఐ పాగా వేసిందని సర్వీస్‌నౌ 2025 నివేదిక తెలిపింది. మానవులతో కలిసి పనిచేసే ఏజెంటిక్ ఏఐ పనులను ఆటోమేట్ చేయడమే కాకుండా పనిని ఎలా అంచనా వేయాలి.. మరింత సమర్థంగా ఎలా నిర్వహించాలో విశ్లేషించి అమలు చేస్తుంది. 2030 నాటికి తయారీ రంగంలో 8 మిలియన్ల ఉద్యోగాలు ఏఐ వల్ల ప్రభావితం చెందుతాయి

సవాళ్లు ఇవే..

ఏఐ వినియోగం పెరుగుతున్నా 30% సంస్థలకు డేటా భద్ర త ఆందోళనగా మారుతుంది. టెక్ కంపెనీల్లోని 26 శాతం ఉద్యోగులకు ఏఐ భవిష్యత్తు నైపుణ్యాలపై అవగాహన లేదు. కీలక అంశాలపై నిర్ణయం తీసుకోవడంలో కృత్రిమ మేధను ఏమేరకు నమ్మాలో ప్రశ్నార్థకంగా మారుతుంది.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 4.10	₹ 4.12

బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

₹ 91,700 (22 క్యారెట్లు)	₹ 1,00,030 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 1,25,000

నిరంతరం రగులుతూఉండే..

'రింగ్ ఆఫ్ ఫైర్'

40 వేల కి.మీ. పొడవైన సైలెంట్ కిల్లర్



జనంసాక్షి: ప్రకృతి ఓ దెయ్యంలా మెల్లగా ఒళ్లు విరుచుకుని అలా సాగర జలాల్లోకి కాలు పెట్టింది...! అంతే తీరాన్ని తుత్తునియలు చేసేలా అలలు మిన్నంటి మరీ ఎగిసిపడ్డాయి. ఆ ధాటికి భూమి ఉలిక్కిపడింది. రష్యాను తారెత్తించిన బలమైన భూకంపం, ఆ వెంటనే విరుచుకుపడ్డ సునామీ హడలెత్తించాయి. ప్రపంచపు మోకాలిగా చెప్పదగ్గ ఆ రహస్య ప్రాంతంలో పుట్టిన మంటలు, ప్రకంపనలతో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. ఆ ప్రాంతమే 'రింగ్ ఆఫ్ ఫైర్'. అగ్నిపర్వతాలు ఎందుకు అక్కడే ఉప్పొంగుతాయి? భూకంపాలు ఎందుకు అక్కడే రంచనుగా ప్రతి వారం సంభవిస్తాయి? ఈ వలయం, దాని తాలూకు విలయం వెనక దాగున్న రహస్యం ఏమిటి? మౌనంగా కనిపించే మృగాలే మహా ప్రమాదకరం. రింగ్ ఆఫ్ ఫైర్‌లోని అగ్నిపర్వతాలు కూడా ఆ బాపతే. చూసేందుకు నిద్రాణంగా కనిపిస్తాయి కానీ, భూమి లోతుల్లో మంటలు ముదిరిన ప్రతిసారీ ఆ మౌనం పెను శబ్దంగా మారుతుంది. కొన్నిసార్లు విస్ఫోటనంలా బయటపడుతుంది. రష్యాలోని కమ్చా తీరంలో ఎగిసిపడి, ఇటు జపాన్‌తీరాన్ని కూడా తాకిన ఆ రాకాసి అలలకు కారణమదే. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ అచ్చం వలయంలా ఉంటుంది. అతి పెద్దదైన పసిఫిక్ మహాసముద్రాన్ని అట్టడుగున కప్పేసే అగ్నివలయమిది. ఈ మంటల మార్గం దాదాపు 40 వేల కిలోమీటర్ల పొడవుంటుంది! దక్షిణ అమెరికా కొసన మొదలై ఉత్తర అమెరికా తీరాలదా కొనసాగుతుంది. అటు అలాస్కా ద్వీపాలను తాకి, బేరింగ్ సముద్రం దాటి, జపాన్ మీదుగా ఇటు న్యూజిలాండ్ వరకు వ్యాపించి ఉంది. దక్షిణ ధ్రువంలోని మంచు అగ్నిపర్వతాల వరకు చేరుతుంది. ఈ మార్గంలోని దేశాలు మనకు తెలియని ప్రమాదంతో నిత్యం మందుపాతరపై భయంభయంగా గడుపుతున్నాయి. చిలీ, పెరూ, మెక్సికో, అమెరికా, కెనడా, రష్యా, జపాన్, ఫిలిప్పీన్స్, ఇండొనేసియా, న్యూజిలాండ్... ఇలా ప్రపంచంలోని అతి శక్తిమంతమైన అగ్నిపర్వతాలన్నీ ఈ వలయంలోనే ఉన్నాయి. భూకంపాలు, అగ్ని విస్ఫోటనలూ ఈ ప్రాంతంలోనే ఎక్కువ. రింగ్ ఆఫ్ ఫైర్‌లో జరుగుతున్నది భూమి లోతుల్లో భూ పలకల పోరాటం. బయటి నుంచి బలంగా, స్థిరంగా కనిపించే భూమి లోలోతుల్లో ఈ భూ పలకలు ఎప్పుడూ కదులుతూనే ఉంటాయి. అవి పరస్పరం ఢీకొన్నప్పుడు భూమి కంపిస్తుంది. ఒక పలక కిందకి జారితే అక్కడ పెను మంటల్లాంటివి పుట్టుకొస్తాయి. రష్యాలో తాజా భూకంపానికి కారణం కూడా ఇదే. పసిఫిక్ ప్లేట్ తాలూకు ఒక పెద్ద భూ పలకం, ఉత్తర అమెరికా పలకం పరస్పరం ఢీకొన్నాయి. దాంతో భూమి లోతుల్లో ఒత్తిడి పెరిగి భూగోళం అంతటినీ ఊపేసింది. అందుకే కమ్చట్కా తీరంలో ఏకంగా 8.8 తీవ్రతతో నేల వణికిపోయింది. ఆ వెంటనే సముద్రం గర్జించి అలలుగా ఎగిసింది. ఇలాంటివి రింగ్ ఆఫ్ ఫైర్‌లో నిజానికి నిత్య సన్నివేశాలే. పసిఫిక్ మహాసముద్రాన్ని ఒక సువిశాల శరీరంగా భావిస్తే రింగ్ ఆఫ్ ఫైర్‌ను దాని గుండెగా చెప్పొచ్చు. అక్కడే శ్వాస, అక్కడే ధ్వని, అక్కడే మంట! ఈ గుండె ఒక్కసారి గట్టిగా కొట్టుకుందంటే చాలు... రష్యాలో అలలు ఎగసిపడతాయి. జపాన్ తీరాలు వణికిపోతాయి. అలాంటి గుండెపోటు ఇప్పుడు జరుగుతోంది. అదే కమ్చట్కాలో, జపాన్‌తీరాంలో సునామీ రూపంలో ఎగసిపడింది. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ మానవాళికి ఒక శక్తి, ఒక శాపం, ఒక శాస్త్రం. అది ఎప్పుడు, ఎక్కడ మళ్లీ పుడుతుందో ఎవ్వరికీ తెలీదు. పుట్టిందంటే మాత్రం దాని దెబ్బకు ప్రపంచమంతా విలవిలలాడిపోవాల్సిందే.

అమెరికాలో కూలిన నేవీ ఎఫ్-35 ఫైటర్ జెట్

కాలిఫోర్నియా: అమెరికాలో మరో విమాన ప్రమాదం సంభవించింది. బుధవారం సాయంత్రం కాలిఫోర్నియాలోని నావల్ ఎయిర్ స్టేషన్ లెమూర్ సమీపంలో యూఎస్ నేవీ ఎఫ్-35 ఫైటర్ జెట్ కూలిపోయిందని నేవీ ఒక అధికారిక పత్రికా ప్రకటనలో తెలిపింది. స్థానిక కాలమానం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సంఘటనపై ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించింది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా నిర్ధారణకాలేదని నేవీ తెలిపింది. విమానం నేలను ఢీకొనగానే మంటలు చెలరేగాయని పేర్కొంది. ఈ విమానం స్ట్రైక్ ఫైటర్ స్క్వాడ్రన్ వీఎఫ్-125కు చెందినది. దీనిని 'రఫ్ రైడర్స్' అని కూడా పిలుస్తారు. ఈ స్క్వాడ్రన్ ఫ్లీట్.. రీప్లేస్‌మెంట్ స్క్వాడ్రన్‌గా పనిచేస్తుంది. దీనిని నేవీ పైలట్లు, ఎయిర్‌క్రూలకు ఫ్రంట్‌లైన్ డిప్లాయ్‌మెంట్‌ల కోసం శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తుంటారు. ఈ ప్రమాదం లెమూర్‌లోని నావల్ ఎయిర్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇది సెంట్రల్ కాలిఫోర్నియాలోని ఫ్రెస్నోకు నైరుతి దిశగా దాదాపు 40 మైళ్ల దూరంలో ఉంది. యూఎస్ నేవీ వ్యూహాత్మక వైమానిక కార్యకలాపాలకు ఇది కీలక కేంద్రంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గురైన జెట్ ఎఫ్-35సీ.. యూఎస్ విమాన వాహక నౌకలపై కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఈ విమానం షార్ట్ టేకాఫ్‌లు, నిలువు ల్యాండింగ్‌లను కలిగి ఉంటుంది. ఈ ఏడాది చోటుచేసుకున్న రెండవ ఎఫ్-35 ప్రమాదం ఇది. గత జనవరిలో అలాస్కాలోని ఐల్సన్ ఎయిర్ ఫోర్స్ బేస్ వద్ద శిక్షణా మిషన్ సమయంలో వైమానిక దళ ఎఫ్-35ఏ కూలిపోయింది.

భారత్‌కు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు

75 ఏళ్ల దౌత్య బంధం గుర్తుగా రాక

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్ ఆగస్టు 4 నుండి 8 వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఫిలిప్పీన్స్ అధ్యక్షునితో పాటు ప్రథమ మహిళ లూయిస్ అరనేటా మార్కోస్, క్యాబినెట్ మంత్రులు, సీనియర్ అధికారులు, పలువురు వ్యాపార ప్రతినిధులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం భారత్‌కు రానుంది. 2022లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ భారతదేశానికి రావడం ఇదే తొలిసారి. ఆగస్టు 5న ప్రధాని మోదీ- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనుంది. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా కలుసుకోనున్నారు. ఆగస్టు 8న ఫిలిప్పీన్స్‌కు తిరిగి వెళ్లే ముందు ఆయన బెంగళూరును సందర్శిస్తారు. కాగా భారత్- ఫిలిప్పీన్స్ మధ్య దౌత్య సంబంధాలు 1949 నవంబర్‌లో ప్రారం భమయ్యాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సముద్ర సహకారం, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, డిజిటల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఇరు దేశాల భాగస్వామ్యం కొనసాగుతోంది. వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్ అట్లీస్ ప్రకారం, ఫిలిప్పీన్స్ వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించిన తర్వాత భారత్ నుండి ఫిలిప్పీన్స్ కు 28 శాతం మేరకు ప్రయాణాలు పెరిగాయి. కాగా ఫిలిప్పీన్స్ ఇటీవల 14 రోజుల పాటు ఉండేందుకు భారత పౌరులకు వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించింది.

సీఐడీ మాజీ చీఫ్ లొంగిపోవాల్సిందే..

సంజయ్‌కు ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. ఇకపోతే సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు- ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎస్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు.

కాలిఫోర్నియా గవర్నర్ పదవికీ పోటీచేయను

కమలా హారిస్ ఆసక్తికర ప్రకటన

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియాలో 2028లో జరగబోయే గవర్నర్ ఎన్నికల్లో తన పోటీపై మాజీ ఉపాధ్యక్షురాలు, అమెరికన్ డెమొక్రాటిక్ పార్టీ సభ్యురాలు కమలా హారిస్ ఆసక్తికర ప్రకటన చేశారు. గతంలో కాలిఫోర్నియా అటార్నీ జనరల్, యూఎస్ సెనేటర్‌గా పనిచేసిన కమలా హారిస్ తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను సూచన ప్రాయంగా వెల్లడించారు. 2026లో కాలిఫోర్నియా గవర్నర్ పదవికి జరిగే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని కమలా హారిస్ తన సోషల్ మీడియా ఖాతాలో తెలియజేశారు. ఈ ప్రకటన నేపథ్యంలో ఆమె 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. తన పోస్టులో కమలా హారిస్.. 'గత ఆరు నెలలుగా తాను అమెరికన్ ప్రజల శ్రేయస్సు కోసం పోరాటం కొనసాగించేందుకు ఉత్తమ మార్గం గురించి ఆలోచిస్తున్నాను. నా కెరీర్ తొలి రోజుల నుండి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి, మెరుగైన భవిష్యత్తు కోసం పోరాడుతున్నాను. ఇందుకు ఉత్తమ మార్గం వ్యవస్థను సంస్కరించడమేనని నేను నమ్ముతున్నాను. ప్రాసిక్యూటర్, అటార్నీ జనరల్, యునైటెడ్ స్టేట్స్ సెనేటర్, వైస్ ప్రెసిడెంట్‌గా దేశానికి సేవ చేయడం నాకు గౌరవప్రదంగా ఉంది' అని అన్నారు. అలాగే 'ఇటీవల కొంతకాలంగా కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేస్తారా? అని కొందరు అడిగిన దరిమిలా దీనిపై నేను ఆలోచించాను. నేను ఈ రాష్ట్రాన్ని, ఇక్కడి ప్రజలను ప్రేమిస్తున్నాను. అయితే లోతుగా ఆలోచించిన తర్వాత, ఈ ఎన్నికల్లో గవర్నర్ ప దవికి పోటీ చేయకూడదని నిర్ణయిం చుకున్నాను. ప్రస్తుతానికి నేను ఏ ఎన్నికైన పదవిలోనూ ఉండకూడదని అనుకుంటున్నాను. రాబోయే రోజుల్లో నా భవిష్యత్ ప్రణాళికల గురించి మరింత సమాచారాన్ని పంచుకుంటాను' అని కమలా హారిస్ అన్నారు. ఆమె గతంలో రెండుసార్లు అధ్యక్ష పోటీలో నిలిచారు. అయితే రెండు సార్లూ ఓటమి పాలయ్యారు. 2024లో కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, ట్రంప్ చేతిలో ఓడిపోయారు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కరెంట్ కట్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను వెంటాడుతున్న బ్యాగ్ బిల్లింగ్ భయం

బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్న అధికారులు

- బిబిఆందోళనలో సిరిసిల్ల నేతన్నలు
- ప్రశ్నార్థకమవుతున్న పరిశ్రమ మనుగడ.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ప్రస్తుతం బ్యాక్ బిల్లింగ్ గండం వెంటాడుతుంది. ఇటీవల సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ బకాయి పడిన విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదంటూ విద్యుత్ తొలగిస్తుండడం తో నేతన్నల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. బ్యాక్ బిల్లింగ్ తగ్గించాలని కోరుతూ "సెస్"కార్యాలయం చుట్టూ పరుగులు పెడుతున్న పరిస్థితి ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది అంటూ పలువురు వస్త్ర పరిశ్రమ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై"జనం సాక్షి"అందిస్తున్న ప్రత్యేక కథనం...

రాజన్న సిరిసిల్ల బ్యూరో జూలై 31 (జనంసాక్షి) :
సుమారు 70 ఏళ్ల కాల ప్రవాహంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ చేతి మగ్గాల స్థాయి నుంచి మరమగ్గాలకు పరిణామం చెందిన పరిస్థితి ఒక్క సిరిసిల్లలోనే కనిపిస్తుంది. ఒకప్పుడు వెలుగు వెలిగిన పరిశ్రమ ఇప్పుడు వెలవెల బోతోంది. పరిశ్రమ పరిణామ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాకూడా నిబ్బరంగా నిలబడింది. గతంలో సిరిసిల్లలో నెలకొన్న పరిస్థితుల్లో వస్త్ర పరిశ్రమకు చేయూతనందించడం కోసం అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో మర మగ్గాల యూనిట్ల కోసం 50 శాతం సబ్సిడీతో విద్యుత్ అందించడం జరిగేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మంచి రోజులు వస్తాయని భావించిన నేతన్నలకు ఇప్పుడు ఇబ్బందులు వచ్చి పడుతున్నాయి.. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో "బతుకమ్మ" చీరల ఆర్డర్ పేరుతో నేతన్నలకు ఉపాధి కల్పించే ప్రయత్నాలు చేసినట్లు కనిపించినా పూర్తిగా వస్త్ర పరిశ్రమ వ్యవస్థని నిర్వీర్యం కావడానికి దోహదం చేశాయంటూ కొందరు నేతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని మర మగ్గాల యూనిట్ల కోసం "సెస్"విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటికి దశాబ్దాల కాలం పాటు మరమగ్గాల యూనిట్లకు బిగిస్తున్న విద్యుత్ మీటర్లు నాలుగవ కేటగిరిలో ఉండేవి.

గత ప్రభుత్వం మరమగ్గాల సహకార సంఘాలతో పాటు ఎస్ఎస్వై యూనిట్లకు "బతుకమ్మ" చీరలఆర్డర్‌ను అందించింది. ఈ క్రమంలో సంబంధిత అధికారులు ఎస్. ఎస్. వై యూనిట్లను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా చొరవ తీసుకున్న పరిస్థితి. అలా మరమగ్గాల సహకార సంఘాల నుంచి కొంతమంది సభ్యులు , మరమగ్గాల నిర్వాహకులు స్వతంత్రంగా ఎస్ ఎస్ వై యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో తమ బతుకులు మారుతాయని ఎంతో నమ్మకంతో ఉన్నారు. అయితే ఆ నమ్మకం నీరు గారే పరిస్థితి వచ్చింది. ఎస్ ఎస్ వై యూనిట్లకు సంబంధించి గతంలోని విద్యుత్ కనెక్షన్ లను సెస్ అధికారులు. మూడవ కేటగిరి నుంచి నాలుగో కేటగిరికి మార్చడంతో అప్పటినుండి ఆందోళన మొదలైంది. ఒకవైపు వస్త్ర పరిశ్రమకు ఇస్తున్న 50 శాతం సబ్సిడీ సంగతి అలా ఉంటే థర్డ్ కేటగిరి ద్వారా ఒక్కో యూనిట్ విద్యుత్ పై 8 రూపాయల విద్యుత్ చార్జీలు విధిస్తుండడంతో అడ్డగోలుగా బకాయిలు పెరిగిపోయాయిన పరిస్థితి.

మరోవైపు వస్త్ర పరిశ్రమ కూడా సంక్షోభాల బాట పట్టడంతో అంతటా నైరుశ్యం అలుముకుంది. ఉపాధి కోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా ఆందోళన బాట పట్టడం జరిగింది. అప్పుడు అధికారంలో ఉన్న కేటీఆర్ సాక్షాత్తు చేనేత జౌళి శాఖ మంత్రిగా ఉండడంతో పాటు స్థానిక శాసనసభ్యులుగా కొనసాగుతూ ఉండడం తమ కష్టాలు ఎలాగూ తీరుస్తాడు అన్న ధీమాతో ఉన్న నేతన్నలకు నిరాశే మిగిలింది. కేటీఆర్ కనీసం ఎక్కడ తమ సమస్య పట్టించుకోవడానికి సుముఖంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ నేత పారిశ్రామికుడు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల కాంగ్రెస్ వచ్చాక సిరిసిల్ల నేతన్నల పరిస్థితులను గమనించి బతుకమ్మ చీరల బకాయిలను విడుత వారివారీగా అందించడంతోపాటు. ఉపాధి కోసం నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్ అందించింది. కాస్త ఊపిరి తీసుకుందామనుకున్నా సమయంలో నేతన్నలకు"పేరుకుపోయిన బ్యాక్ బిల్లులు"ఆందోళనకరంగా మారాయి. సుమారు 30 కోట్ల మేర బ్యాక్ బిల్లు బకాయిలు పేరుకుపోవడంతో సెస్ అధికారులు బకాయిలను రాబట్టుకునేందుకు సిద్ధమయ్యారు. గడిచిన రెండు రోజులుగా బ్యాక్ బిల్లులు చెల్లించాలంటూ నేతన్న లపై అధికారులు ఒత్తిడి పెరిగిన పరిస్థితి. ఈ విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం ఇటు నేతన్నలు లో లోపల ఆందోళన చెందుతున్నారు. అయితే బ్యాక్ బిల్లులు మాఫీ చేయాలని గతంలో మాదిరిగా నాలుగవ కేటగిరీలో విద్యుత్ సబ్సిడీతో ఒక్కో యూనిట్ పై రెండు రూపాయల చార్జీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు పరిశ్రమలోని ప్రముఖులు కోరుతున్నారు. అయితే ఇక్కడ ఓ విషయం ప్రత్యేకంగా గమనించాలని నేతన్నలు కోరుతున్నారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన ఒకరు కోర్టు మెట్లు ఎక్కడంతో మధ్యవర్తి ప్రమేయం లేకుండా సెస్ లో సభ్యులుగా ఉన్న నేతన్నలు సేస్ పాలకవర్గం నిర్ణయం తీసుకోవాలంటూ కోరుతూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించి ఎక్కడ విద్యుత్ మీటర్లకు సంబంధించి నిర్ణయం ఎలా తీసుకున్నారన్నది ప్రశ్నార్థకమే. ఎటు వచ్చి ఇప్పుడు ఆ భారం కాస్త నేతన్నలను అతలాకుతలం చేస్తుంది. బ్యాక్ బిల్లింగ్ విషయంలో అనేక ఆరోపణలు వినిపించాయి. ప్రస్తుతానికి బ్యాక్ బిల్లింగ్ విషయంలో కాస్త వెసులుబాటు కల్పించాలని సుదీర్ఘకాలం కొనసాగిన తీరుగానే "విద్యుత్ ను నాలుగో కేటగిరీలో అందించాలని నేతన్నలు కోరుతున్నారు. అకస్మికంగా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తుండడంతో ఉపాధి కరువై పలువురు కార్మికులు దిక్కులు చూస్తున్న పరిస్థితి. సమస్య జటిలం కాకముందే పరిష్కారం చూపాలని నేతన్నలు కోరుతున్నారు.

ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపాలి

కోడం రమణ, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

బ్యాక్ బిల్లు పేరూతో వేధింపులు ఆపాలి. మరమగ్గాల కారణాలు బంధు ఉండడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని పూర్తిగా బ్యాక్ బిల్లు పేరు మీద పశువులను ఆపాలి. సబ్సిడీ లో నేతన్నలకు కరెంటు అందించాలే.

నగరంలో అభివృద్ధి జోరు

నగర రూపురేఖలు మార్చేందుకు కలెక్టర్ చురుకైన చర్యలు

నిజామాబాద్‌లో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయి పర్యటన

నిజామాబాద్, జూలై 31 (జనం సాక్షి) : నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు మరిన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద ఖానాపూర్, కాలూర్‌లలో నిర్మిస్తున్న ఈ.ఎల్.ఎస్.ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, మైల్‌స్టోన్ ప్రకారం పనులు జరగాలని అధికారులను, కాంట్రాక్ట్ సంస్థల సిబ్బందిని ఆదేశించారు. జాప్యానికి తావు లేకుండా విభాగాల వారీగా పనులను విభజించి, ఏకకాలంలో జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కాలూర్‌లో ట్యాంక్ నిర్మాణ ప్రాంతానికి సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నందున, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన సామాగ్రి, సరిపడా కూలీలను వినియోగించి నిర్విరామంగా పనులు జరిపించాలని, నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. దుబ్బ ప్రాంతంలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ విస్తరణ పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా సాగుతుండటంపై గుత్తేదార్లను నిలదీస్తూ, తీవ్ర జాప్యం జరిగిన పైప్‌లైన్ విస్తరణతో పాటు నల్లా కనెక్షన్ల పనులను సమాంతరంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖలీల్ వాడి, అహ్మదిబజార్‌లలోని సమీకృత వెజ్-నాన్వెజ్ మార్కెట్ యార్డులను సందర్శించి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌తో వివరాలు తెలుసుకున్నారు. గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పాత గంజును సందర్శించి, ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తెలపగా, తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నాగారంలోని రాజీవ్ గృహకల్ప భవన సముదాయాలను పరిశీలించి, లబ్దిదారులకు కేటాయించేందుకు అవసరమైన మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆకతాయిలు, అసాంఘిక శక్తులను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును సందర్శించి, రోజువారీ చెత్త సేకరణ, శుద్ధి ప్రక్రియను పరిశీలించా రు. చెత్తను విభాగాల వారీగా వేరు చేసి, ఎరువులు, ఇతర వినియోగం కోసం శుద్ధి చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, బయో మైనింగ్ సులభతరం చేయాలని, పెద్ద మొత్తంలో కంపోస్ట్ తయారీకి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఖానాపూర్‌లోని బస్తీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. పీ.హెచ్.సీ తరహాలో అన్ని సేవలు, సరిపడా ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. ఆసుపత్రుల వ్యర్థాలను రోజువారీగా సేకరించి, నిర్దేశిత ప్రాంతంలో డిస్పోజ్ చేసేలా పర్యవేక్షణ చేయాలని, బయో వేస్టేజ్ ప్రక్రియ పక్కాగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కాలూర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి, మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందుతుందో లేదో తనిఖీ చేసి, హెచ్.ఎం.కు సూచనలు ఇచ్చారు. మోపాల్ మండల కేంద్రంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, యూరియా, ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ-పాస్ ద్వారా విక్రయాలు, స్టాక్ రికార్డులు తనిఖీ చేసి, స్టాక్ బోర్డులపై నిల్వల వివరాలు ప్రదర్శించాలని, స్టాక్ తగ్గే ముందే ఇండెంట్ సమర్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, ఈ.ఈ మురళీమోహన్ రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వచ్చే నెల 17న తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికలు

కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 31 (జనంసాక్షి): వచ్చే నెల 17న తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికలు నిర్వహించబడునని సంఘం బాధ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వాదేశాల ప్రకారం ఎన్నికలు కరీంనగర్‌లోని స్థానిక సంఘ భవనంలో జరుపబడునని ఎన్నికల అధికారిగా కేంద్ర సంఘం అధ్యక్షుడు, ఎన్నికల అధికారి ఎండీ.జహంగీర్ అలీ, ఎన్నికల పరిశీలకులుగా కేంద్ర సంఘం గౌరవ అధ్యక్షుడు ఎండీ. సలీంలు వ్యవహరిస్తారని తెలి పారు. నామినేషన్ల స్వీకరణ 2025 ఆగస్టు 10 న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. పరిశీలన 11 గం.ల నుంచి 12వరకు. ఉపసంహరణ మధ్నాహ్నం 12 గం.ల నుంచి మధ్యాహ్నం 2గం.ల వరకు, గుర్తులు కేటాయింపు 3 నుంచి 4 గం.ల వరకు ఉంటుందని తెలిపారు. 17న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ప్రకటించారు.

బస్తీ సమస్యలు పరిష్కరిస్తాం : పద్మారావు గౌడ్

సికింద్రాబాద్,జూలై 31:
తార్నాక డివిజన్ పరిధిలోని ఆర్య నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. అర్యనగర్ స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ తో సమావేశమై వివిధ సమస్యల పై వినతి పత్రాన్ని సమర్పించారు.పోలీసు గస్తీ పెంచాలని, సీ.సీ. కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు పునర్నిర్మాణాన్ని చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సంఘం నేతలు కుమార్ షాను, హరి కృష్ణ తదితరులు కోరారు.

పారాక్వాట్ విక్రయంలో నిబంధనలు పాటించాల్సిందే

దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించాలి

వినియోగం తగ్గించేలా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 31 (జనంసాక్షి) :
పంటల్లో కలుపు నివారణకు ఉపయోగించే పారాక్వాట్ (గడ్డి మందు)ను విక్రయించే పెస్టిసైడ్ డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆధ్వర్యంలో పెస్టిసైడ్ డీలర్లు, టీఎస్ ఎంసీఈసీ సభ్యులు, డీఏపీపీ సభ్యులు డాక్టర్ బండారి రాజ్ కుమార్, డీఏపీపీ సభ్యులు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాకేష్, వ్యవసాయ శాఖ అధికారులతో పారాక్వాట్ మందు దుష్పరిణామాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పారాక్వాట్ పిచికారీ సమయంలోనూ జాగ్రత్తలు తీసుకోకుంటే గాలి ద్వారా రైతుల ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు దెబ్బతిని ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఈ మందు మీద పడిన ప్రమాదమేనని అన్నారు.
విక్రయించిన డీలర్ వద్ద తప్పనిసరిగా రైతుల వివరాలు ఉండాలని సూచించారు. రైతుల సంతకం, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకోవాలన్నారు. ఈ మందు అమ్మేటప్పుడు రసీదుపై డీలర్ సంతకం, పంటలకే ఉపయోగిస్తానని రైతు సంతకం తీసుకోవాలన్నారు. అందరూ డీలర్లు తమ పరిధి ఏఈఓ, ఏవోల ఫోన్ నెంబర్లు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఏఈఓ అనుమతి లేకుండా ప్రమాదకరమైన ఈ మందును రైతుకు అమ్మవద్దని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా గత సంవత్సర కాలంలో ఈ మందును మండలాల వారీగా ఎంతమంది రైతులు వినియోగించారో వివరాలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ మందుతో కలిగే దుష్పరిణామాలపై రైతు వేదిక, రైతు నేస్తం కార్యక్రమాల్లో అన్నదాతలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శానిటేషన్ పనులకు ఉపయోగించే ఈ మందును విక్రయించేటప్పుడు పట్టణాల్లో కమిషనర్, పంచాయితీల్లో కార్యదర్శి సంతకం తప్పనిసరిగా ఉండాలని డీలర్లను ఆదేశించారు. పారాక్వాట్ ను చాలా చోట్ల నిషేధించారని ఈ మందు పై విదేశాల్లో ఆంక్షలు కూడా విధించారని పేర్కొన్నారు. డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణలో పంటలో కలుపు నివారణకు ఎక్కువగా ఈ గడ్డి మందును వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మందు పిచికారీ సమయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే రైతుల ప్రాణాలకే ముప్పని పేర్కొన్నారు. ఈ గడ్డి మందుకు విరుగుడు లేదని ఈ మందును ఇంట్లో స్టోర్ చేస్తే ప్రమాదకరమని చిన్నపిల్లలకు దూరం ఉంచాలని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా దీనిని అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు దీనిని వినియోగించవద్దని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ లు శ్రీధర్, మహేష్, రాజేందర్, ప్రియదర్శిని, పెస్టిసైడ్ డీలర్ల అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధ్యం

- **దమ్మన్నపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

గంభీరావుపేట జులై 31(జనం సాక్షి) :
విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధ్యం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గంభీరావుపేట, మండలంలోని దమ్మన్నపేట, గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధిస్తామని అన్నారు. పేదలు అధికంగా ఉండే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్‌లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామని అన్నారు.
ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు. కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రోమ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.
విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్‌లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చోరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని విజయవంతం కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌కు సుప్రీం కోర్టు చెంపపెట్టు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్ జులై 31 (జనం సాక్షి):
ముస్తాబాద్ మండల కేంద్రంలో వరలక్ష్మి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.కె మహేందర్‌రెడ్డి ఈసందర్భంగామాట్లాడారు గతంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు సంతలో పశువులను కొన్నట్లు ఇతర పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను తీసుకొని సీఎల్పీనే విలీనం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు ఆనాడు మీరు ఏం మాట్లాడారు మీ విధానాలు నచ్చక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల యొక్క అభివృద్ధి సంక్షేమం గురించి ఆలోచించే తత్వం చూసి రైసింగ్ నెంబర్ వన్ తెలంగాణ అనే గొప్ప సంకల్పాన్ని తీసుకొని ముందుకు వెళుతున్న ప్రజా ప్రభుత్వము ఆలోచనలు నచ్చి ఎమ్మెల్యేలు పార్టీలో చేరితే తప్పా మేము ఆనాడే చెప్పాము ఈ అంశం స్పీకర్ పరిధిలో ఉంటుంది అని కానీ అవి ఏమీ వినకుండా నానా యాగి చేసి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుంది ప్రతిపక్ష పార్టీ నేతల తీరు అన్నారు, సుప్రీంకోర్టు నిర్ణయంపై మా స్పీకర్ గారు వారికి విధించిన గడువులోగా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాము, దీనిపై రాద్ధాంతం చేయకుండా మీ ప్రతిపక్ష పాత్రను సరిగా పోషించండి ఆనాడు అధికారంలో ఉన్న నాడు ఆ నలుగురే మొత్తం నడిపించారు అధికారం పోయాక ఇప్పుడు ఇద్దరే నడిపిస్తున్నారు, మీరు ఎక్కడ అయినా చూడండి కేసీఆర్ కేటీఆర్ తప్ప ఎవరు కనిపించరు ఫోటోలలో ఫ్లెక్సీలలో మొన్న వరంగల్ సభలో కూడా ఆ ఇద్దరే మాట్లాడారు హరీష్ రావు ను కూడా పక్కకు నూకేస్తున్నారు, మీ ఇంట్లో గొడవను దోసుకున్న సొమ్ము పంపకాల్లో వచ్చిన గొడవలను దయచేసి మాకు మా తెలంగాణ ప్రజలకు అంటగట్టకండి అన్నారు
కవితకు బీసీలపై అంత ప్రేమ ఉంటే మీ నాన్న ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఎందుకు చేయమని ధర్నా చేయలేదు అయినా ఇప్పుడు ఢిల్లీలో ఉంది ఆ ఆర్డినెన్సు వెళ్ళి ఢిల్లీ లో చేయండి ఇక్కడ కాదు మీ డ్రామాలు అన్నారు,ఇగ ఈ బీజేపీ వాళ్ళు ప్రతి దానికి మేమే ఇస్తున్నాం అంటూ అంటున్నారు ఇక్కడ

ఇచ్చిన సన్న బియ్యం మీరు పాలిస్తున్న ఎన్ని రాష్ట్రాల్లో ఇస్తున్నారు? చెప్పాలి మీరే,200 కోట్ల ఉచిత ఆర్టీసీ ప్రయాణాలు జరిగాయి ఆనాడు మహిళలకు ఉచితం బస్సు ప్రయాణం ఇస్తే అడ్డగోలుగా వాగుతు మహిళలను కించపరిచారు ఇక ఆ మాటలు నేను చెప్పను కానీ ఇప్పుడు కేటీఆర్ మీరు ఏం మాట్లాడతారు గత పది సంవత్సరాలలో నీళ్లు నియామకాలు నిధులు అన్ని మీ కుటుంబానికే పాయే, కానీ మన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నుండి ప్రజల సంక్షేమమే రాష్ట్ర అభివృదే లక్ష్యంగా పనిచేస్తూ మహిళలకు పెద్దపీట వేస్తున్నాము అన్నారు, అది ఓర్వలేకనే ఈ పస లేని ఆరోపణలు బిజెపి బిఆర్ఎస్ మిత్ర బంధం, కేటీఆర్ ప్రతీసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు జరిపే చీకటి మంతనాలు మొన్న పక్క రాష్ట్రం ఎంపీ సీఎం రమేష్ మాటలతో బట్టబయలైంది తెలంగాణ ప్రజలు ఎప్పటికీ బీజేపీ బీఆర్ఎస్ లను నమ్మే పరిస్థితుల్లో లేరు ప్రజలు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కనమేని చక్రధర్ రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు,వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మహిళా అధ్యక్షులు వనిత ,మాజీ ఎంపిటిసిలు యూత్ కాంగ్రెస్ నాయకులు నాయకులు సోషల్ మీడియా కన్వీనర

- భారత బ్యాటింగ్‌లో నిలకడ: 150కి చేరువలో స్కోరు
- కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్ భాగస్వామ్యం: ఇన్నింగ్స్ స్థిరీకరణ
- ఇంగ్లండ్ బౌలింగ్ ఒత్తిడి: మ్యాచ్‌లో కీలక దశ

అదితూచి

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్ట్ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు నిలకడగా ఆడుతూ స్కోరును 150కి చేరువ చేశారు. 48 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 148 పరుగులు సాధించిన భారత్, గత నాలుగు ఓవర్లలో 16 పరుగులు రాబట్టింది. ప్రస్తుతం కరుణ్ నాయర్ 21 పరుగులు, ధ్రువ్ జురెల్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఓవల్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ గ్రీన్ పిచ్‌పై బౌలింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, అట్కిన్సన్‌లు మొదటి సెషన్‌లో యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్‌లను త్వరగా ఔట్ చేశారు. శుభ్‌మన్ గిల్ స్వయంగా రనౌట్ కావడంతో భారత్ 120 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్‌లు 25 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను స్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు. బ్యాటింగ్ పరిస్థితులు కొంత మెరుగైనప్పటికీ, బంతిలో ఉన్న కదలిక బ్యాటర్లను ఇబ్బంది పెడుతోంది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. పంత్ కాలి వేలు విరిగిన కారణంగా, బుమ్రా వర్క్‌లోడ్ నిర్వహణలో భాగంగా ఈ టెస్ట్‌కు దూరమయ్యారు. ఇంగ్లండ్ జట్టులో బెన్ స్టోక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్‌లను విశ్రాంతి తీసుకోగా, జామీ ఓవర్టన్, జోష్ టంగ్, జాకబ్ బెథెల్, గస్ అట్కిన్సన్‌లను జట్టులోకి తీసుకొచ్చారు. ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా చేస్తే సిరీస్ డ్రా అవుతుంది, కానీ గెలిస్తే భారత్ సిరీస్‌ను 2-2తో సమం చేసే అవకాశం ఉంది. గత టెస్ట్‌లలో శుభ్‌మన్ గిల్ అద్భుతంగా రాణించాడు, ముఖ్యంగా నాలుగో టెస్ట్‌లో సెంచరీతో జట్టును ఓటమి నుంచి కాపాడాడు. ఈ మ్యాచ్‌లో కూడా అతడి పాత్ర కీలకం కానుంది. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు కూడా గత మ్యాచ్‌లో సెంచరీలతో మెరిశారు. ఇప్పుడు కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్‌లు ఈ భాగస్వామ్యాన్ని కొనసాగించి, రోజు ముగిసే వరకు వికెట్లు కాపాడుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఇంగ్లండ్ బౌలర్లు గస్ అట్కిన్సన్, జామీ ఓవర్టన్‌లు కీలకమైన సమయాల్లో వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచుతున్నారు. ఈ రోజు చివరి గంటలో ఒకటి లేదా రెండు వికెట్లు పడితే ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం సాధించే అవకాశం ఉంది. భారత బ్యాటర్లు జాగ్రత్తగా ఆడుతూ, ఈ సవాలును అధిగమించాలని చూస్తున్నారు. మ్యాచ్ ఫలితం ఈ రోజు చివరి సెషన్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంది.

వైభవ్ సూర్యవంశీకి బిగ్ ఛాన్స్

ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక..

ఆస్ట్రేలియా పర్యటన కోసం బుధవారం నాడు భారత అండర్-19 జట్టును ప్రకటించింది. ఇంగ్లాండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసిన టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీని సెలక్టర్లు ఆస్ట్రేలియా పర్యటనకు కూడా ఎంపిక చేశారు. ఈ పర్యటన యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను చాటేందుకు గొప్ప అవకాశంగా చెప్పవచ్చు. సీఎక్కే తరఫున అరంగేట్రం చేసిన యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే కెప్టెన్సీలో బీసీసీఐ 17 మంది ఆటగాళ్లను ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసింది. 5 మంది స్టాండ్‌బై ప్లేయర్ల జాబితాను కూడా సెలక్షన్ ప్యానెల్ ప్రకటించింది. సెప్టెంబర్‌లో జరగనున్న ఆస్ట్రేలియా పర్యటనలో భారత అండర్-19 జట్టు, ఆస్ట్రేలియా అండర్-19 టీంతో 3 వన్డేలు, 2 మల్టీ డే మ్యాచ్‌లు ఆడేలా షెడ్యూల్ చేశారు. మల్టీ డే మ్యాచ్ 4 రోజులపాటు జరుగుతుంది. సెప్టెంబర్ 21న మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ పర్యటనలో చివరి మల్టీ డే మ్యాచ్ అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 10 వరకు జరుగుతుంది. లోఅరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శన చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఇంగ్లాండ్ పర్యటనకు సెలక్ట్ చేయగా.. చారిత్రాత్మక ప్రదర్శన చేసి అనేక రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో భారత అండర్ 19 జట్టుకు ఆయుష్ మాత్రే సారథిగా వ్యవహరించనున్నాడు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు 5 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 100 పరుగులు, 6 లిస్ట్ ఎ మ్యాచ్‌లలో 132 రన్స్, 8 టీ20లలో 265 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో ఆడిన 7 మ్యాచ్‌లు (5 వన్డేలు, 2 టెస్టులు)లో వైభవ్ సూర్యవంశీ మొత్తం 445 పరుగులు చేశాడు. ఇందులో 143 పరుగుల చారిత్రాత్మక శతక ఇన్నింగ్స్ కూడా ఉంది. వైభవ్ కేవలం 78 బంతుల్లోనే ఆ ఘనత సాధించాడు.

ఆస్ట్రేలియా పర్యటనకు భారత అండర్-19 జట్టు : ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుండు (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), డి. దీపేష్, నమన్ పుష్పక్, రాహుల్ కుమార్,హెనిల్ పటేల్, కిషన్ కుమార్, కనిష్క్ చౌహాన్, అంబరీష్, అన్మోల్జీత్ సింగ్, ఖిలాన్ పటేల్, అమన్ చౌహాన్, ఉధవ్ మోహన్.

కేకేఆర్ జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్?

ఇంగ్లండ్‌లో కేఎల్ రాహుల్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తోంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు సెంచరీలు సాధించిన రాహుల్‌పై ఒక సంచలన వార్త బయటికొచ్చింది. ఐపీఎల్ 2026లో కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ బదులు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడబోతున్నాడట. కేకేఆర్ జట్టు అతన్ని ఎలాగైనా ట్రేడ్ ద్వారా తమ స్క్వాడ్‌లోకి తీసుకోవాలని చూస్తోందని తెలుస్తోంది. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ రాహుల్‌ను రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 13 ఇన్నింగ్స్‌లలో 539 పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ కొత్త వార్త క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఇప్పుడు మంచి కెప్టెన్ అవసరం. గత సీజన్‌లో జట్టుకు అజింక్య రహానే కెప్టెన్‌గా ఉన్నాడు, కానీ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది, వారి ప్రదర్శన కూడా నిరాశపరిచింది. దీంతో కేకేఆర్ ఇప్పుడు భారీ మార్పులకు సిద్ధంగా ఉంది. అందుకే వారు కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకొచ్చి కెప్టెన్‌గా చేయాలని భావిస్తున్నారు. కేఎల్ రాహుల్ కోసం కేకేఆర్ ఏకంగా రూ. 25 కోట్ల వరకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందట. కేఎల్ రాహుల్ కేవలం ఒక మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు, అతను కెప్టెన్, వికెట్ కీపర్ పాత్రలను కూడా సమర్థవంతంగా పోషించగలడు. అందుకే కేకేఆర్ అతని కోసం ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఐపీఎల్ 2025 వేలానికి ముందు కేకేఆర్ ఒక పెద్ద తప్పు చేసింది.

ప్రో కబడ్డీ లీగ్‌కు రంగం సిద్ధం

ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ ఘనంగా ప్రారంభమయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి నాలుగు వేదికల్లో టోర్నీని నిర్వహించేందుకు ప్లాన్ రెడీ చేశారు నిర్వాహకులు. ఆగస్టు 29 నుంచి ప్రారంభం కానున్న ఈ లీగ్‌లో వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ అంతటా 12 జట్లు ట్రోఫీ కోసం తలపడతాయి. ఈ టోర్నమెంట్ ఆగస్టు 29న వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్ తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు విడుదల చేశారు. దాదాపుగా ఏడేళ్ల తర్వాత వైజాగ్ వేదికగా కబ్బడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. దీంతో కబ్బడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే హెూమ్ టీమ్ అయిన తెలుగు టైటాన్స్ 2018లో చివరిసారిగా ఆరోస్థానాన్ని చేరినా.. ఆ తర్వాత జరిగిన అన్ని సీజన్లలో టేబుల్‌ల్లో అట్టడుగుకే పరిమితమైంది. ఈసారైనా బలంగా సత్తా చాటాలని తెలుగు టైటాన్స్ జట్టు ప్రణాళికలు రచిస్తుంది. వైజాగ్‌లో మ్యాచ్‌లు ముగిసిన తర్వాత రెండో భాగం జైపూర్ లోని ఇండోర్ హాల్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మూడో దఫా చెన్నై.. చివరిగా ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ప్రస్తుతం లీగ్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రో కబ్బడ్డీ లీగ్ నిర్వాహకులు.. ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఈ ప్రో కబ్బడ్డీ సీజన్ 12 ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ లేదా జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

ఒలింపిక్స్ 2028- క్రికెట్ పోటీల నుంచి పాకిస్థాన్, న్యూజిలాండ్ ఔట్!

2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ 128 ఏళ్ల తర్వాత తిరిగి రాగా, పాకిస్థాన్, న్యూజిలాండ్‌లకు గట్టి షాక్ తగిలే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విశ్వక్రీడల్లో పురుషులు, మహిళల టీ20 ఫార్మాట్‌లో ఆరు జట్లు చొప్పున పోటీపడనున్నాయి. అయితే, ఈ జట్ల ఎంపికకు అర్హత ప్రక్రియను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. తాజా గా సింగపూర్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో అర్హత ప్రక్రియను ఖరారు చేసినట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు వెల్లడించాయి. ఐసీసీ ప్రాంతీయ అర్హత విధానాన్ని అవలంభించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ విధానం ప్రకారం ఆసియా, ఓషియానియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా ఖండాల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించనుంది. ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఆసియా నుంచి భారత్, ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, ఆతిథ్య దేశంగా అమెరికా నేరుగా క్వాలిఫై అవుతాయి. ఆరో జట్టుగా వెస్టిండీస్ అర్హత సాధించే అవకాశం ఉంది, కానీ దాని ప్రక్రియ భిన్నంగా ఉంటుంది. ఈ ప్రక్రియ ఖరారైతే, టీ20 ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా కంటే వెనుక ఉన్న న్యూజిలాండ్, ఆసియాలో భారత్ అగ్రస్థానంలో ఉండగా పాకిస్థాన్, శ్రీలంక, ఆఫ్గానిస్థాన్‌లు అర్హత కోల్పోతాయి. మహిళల జట్ల ఎంపికను వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్ తర్వాత ప్రకటించనున్నారు. ఈ అర్హత ప్రతిపాదనపై పాకిస్థాన్, న్యూజిలాండ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ ఎలా ఉంటుంది, ఏ జట్లు చోటు సంపాదిస్తాయనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అభిమానులు ఈ నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నల్గొండ జిల్లా కేంద్రంలో 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన

నల్గొండ బ్యూరో, జనం సాక్షి :

నాణ్యమైన విద్యనందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని వెల్లడించారు. కేరళలో 99.9 శాతం అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ తో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నెల 4 న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కనే 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా 20 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 100 కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ, కోర్సులు,భవనాలు మంజూరు చేశారని, 2026-27 సంవత్సరంలో అడ్మిషన్లు సైతం ప్రారంభం కానున్నాయని, లా, ఫార్మసీకి మంచి డిమాండ్ ఉందని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో విద్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని అంతేకాక గత ప్రభుత్వం తొమ్మిది వేల కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు పెట్టిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెల 6000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నప్పటికీ నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అడుగు అని అన్నారు. రోగులు ముందుగా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మెడికల్ టూరిజం లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందువల్ల నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకోవాలని, ప్రస్తుతం నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవనంలో స్టాఫ్ క్వార్టర్స్ ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడిగా గండీడ్ నర్సింలు గౌడ్ నియమాకం

బొంరాస్ పేట,జూలై 31 (జనం సాక్షి): తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన గడ్డి నర్సింలు గౌడ్ నియామకమయ్యారు.ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి గౌడ్,రాములు తదితరులు ఉన్నారు. రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన గండిడ్ నర్సింలు గౌడ్ ను గురువారం ఆయన నివాసంలో ఉపాధి హామీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

అక్టోబర్ నెల కల్లా 122 మెగావాట్ల

సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి కావాలి

- జియో థర్మల్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ల ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేయండి
- సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 122 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ల పనులు వచ్చే అక్టోబర్ నెల కల్లా పూర్తి చేయాలని, టెండర్ పనులు ఖరారైన మరో 137 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం వెంటనే ప్రారంభించి ఏడాదిలోగా పూర్తిచేయాలని, తద్వారా మొత్తం 504 మెగావాట్ల సోలార్ సామర్థ్యం సాధించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సింగరేణి భవన్‌లో ఆయన సింగరేణి చేపట్టిన సోలార్ పవర్, ఇతర వ్యాపార విస్తరణ చర్యలపైన లోతుగా సమీక్షించారు. సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో అలసత్వాన్ని సహించేది లేదని, పనులు నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని, లేనట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏజెన్సీలను, పర్యవేక్షక అధికారులను ఆయన హెచ్చరించారు. సింగరేణి సంస్థ రామగుండంలో చేపట్టనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై సానుకూల నివేదిక వచ్చిన నేపథ్యంలో, ప్లాంటు నిర్మాణానికి సంబంధించి అన్ని రకాల చర్యలు అతివేగంగా పూర్తి చేయాలని కోరారు. పెద్ద ఎత్తున జియో థర్మల్ విద్యుత్తుకు మణుగూరు ప్రాంతంలో అవకాశం ఉందని నివేదికలు తెలుపుతున్నాయని, ఓఎన్జీసితో కలిసి ఇక్కడ అతి పెద్ద ప్లాంట్ ఏర్పాటుకు ఇప్పటికే చర్చలు నడుస్తున్న నేపథ్యంలో, ఉమ్మడిగా ప్లాంట్ ఏర్పాటుకు తక్షణమే సన్నాహాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఓపెన్ కాస్ట్ గనుల డంపులపైన పవన విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు అధ్యయనం త్వరగా పూర్తిచేయాలన్నారు. అరాజస్థాన్ రాష్ట్రంలో రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ వారితో కలిసి అక్కడ 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదిరిన నేపథ్యంలో త్వరలోనే ఒక ఉన్నత స్థాయి అధికారుల బృందం అక్కడికి వెళ్ళనున్నదని తెలిపారు. ఏమైనప్పటికీ పనుల పట్ల అలసత్వం పనికిరాదని, చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, జీఎం (సిడిఎన్) ఎస్డీఎం సుభాని, జీఎం (సి.పి.పి.) ఎ.మనోహర్. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరంజీవులు, పవర్ ప్రాజెక్ట్స్ శాఖ అధిపతి విశ్వనాథరాజు ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బతుకమ్మకుంట నమూనా

- సందర్శించిన కేంద్ర బృందం కితాబు
- హైడ్రా కృషిని అభినందించిన కేంద్ర అధికారులు

హైదరాబాద్, జులై 31:

అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను కేంద్ర గృహ నిర్మాణ, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ)కు చెందిన అధికారుల బృందం గురువారం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ.. అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్నిపాత చిత్రాలను చూసి ఆశ్చర్యపోయింది. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహ నిర్మాణం, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ అడిషనల్ చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ పేర్కొన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం.., మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చే వీడియోలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరు గురించి వార్తల్లో చదివాం.. నేడు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నామని చెప్పారు. హైడ్రా కృషిని అభినందించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధితో ఇక్కడి ప్రాంతం సుందరంగా తయారవ్వడమే కాకుండా.. ఇక్కడ భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు.

వరద నీరు వచ్చేలా ఎలా..?

చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడాన్ని చూసి కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముచ్చట పడింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియాల ద్వారా హైడ్రా అధికారులు కేంద్ర బృందానికి చూపించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదని.. స్థానికులతో కూడా మాట్లాడి ఈ బృందం తెలుసుకుంది. వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేది.. ఈ సారి ఆ వరద చెరువుకు చేరిందని చెప్పడంతో మరింత లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించింది. చెరువు ఔట్‌లెట్లను కూడా పరిశీలించింది. కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అసోసియేట్ టౌన్ ప్లానర్ సందీప్ రావుతో పాటు.. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి. యూనస్, జీహెచ్ ఎంసీ అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్ ఉమాదేవి తదితరులు కేంద్ర బృందంతో ఉన్నారు.

అంకితభావంతో పని చేసిన డీపీఆర్ఓ రమేష్ కుమార్

- సమాచార శాఖ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో డీపీఆర్ఓలదే కీలకపాత్ర
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): డీపీఆర్ఓగా విధులు నిర్వహించిన రమేష్ కుమార్ అంకిత భావంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి సమాచారం ప్రజలకు చేరే విధంగా విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పొల్గొన్నారు.గురువారం కలెక్టరెట్ లోని సమావేశ మందిరంలో డీపీఆర్ఓ రమేష్ కుమార్ పదవి విరమణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధికారులు మంచి బృందంగా ఏర్పడి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డిపిఆర్ఓగా విధులు నిర్వహించిన రమేష్ జిల్లాలో మంత్రుల కార్యక్రమాలను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులని సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.బయట తిసుబండారాలు తిన కుండా ఇంటి ఆహారం మాత్రమే తీసుకొని ఆరోగ్యంపై చా

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
1 ఆగస్టు 2025

ధర్మస్థలి మిస్టరీ మరణాలపై దర్యాప్తు

- పారిశుధ్య కార్మికుడి చూపిన చోట తవ్వకాలు
- తాజాగా తవ్విన చోట కొన్ని అవశేషాల గుర్తింపు

బెంగళూరు, జూలై31 (జనంసాక్షి) : కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల' లో అనుమానస్పద మరణాల మిస్టరీపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టింది. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృత దేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం.లో ఇటీవల మిస్టరీ మరణాలపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు- అనుమానాలున్నట్లు- పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ముగిసిన అమెరికా కాన్సూల్ జనరల్ పదవీకాలం

- జెన్నిఫర్ లార్సన్‌కు శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు

హైదరాబాద్, జూలై 31 (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ - అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ తెలంగాణ - అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.

చైనాలో వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు

- నగల కోసం ప్రజలు వెతుకులాట
- నెట్టింట వైరల్‌గా మారిన దృశ్యాలు

బీజింగ్, జూలై31 (జనంసాక్షి) : చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కొందరు ఈ పని కోసం వానలో తడుస్తూ వెతకడం మొదలు పెట్టారు. షాపు ముందు నుంచి కాలువలా వెళ్లిన చోటల్లా వెతుకుతూ కనిపించారు. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీ-లో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైనే ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇలా వెతుకుతున్న వారిని చూసి మరికొందరుకూడా రంగంలోకి దిగడం విశేషం.

యూపిఐ లావాదేవీలపై ఛార్జీలు

- ఎట్టకేలకు తప్పదంటూ ప్రకటించిన ఐసిఐసిఐ?

న్యూఢిల్లీ, జూలై31 (జనంసాక్షి) : యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఇటీవల కేంద్రం సుంకాలు విధించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. కానీ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు.ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలని అన్నారు. ఇప్పుడు చిన్నిచిన్న దుకాణాలు మొదలు మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. ఐసీఐసీఐలో ఎస్కో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్కో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు- సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు- ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు- సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.

జగన్ పర్యటనలో తోపులాట చేయివిరిగిన కానిస్టేబుల్

నెల్లూరు, జూలై 31 (జనంసాక్షి) : వైకాపా అధ్యక్షుడు జగన్ నెల్లూరు పర్యటనలో తోపులాట జరిగింది. జైలులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్తున్న సమయంలో వైకాపా కార్యకర్తలు ఆంక్షలు ఉల్లంఘించి భారీగా ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచే జగన్ రెచ్చగొడుతూ తన వెనుకే రావాలని కాన్వాయ్ నుంచి కార్యకర్తలకు పిలుపునివ్వడంతో వారు పరుగులు తీశారు. పోలీసులు వారిస్తున్నా జగన్ మాత్రం రండి.. రండి.. అని పిలవడంతో తోపులాట చోటుచేసుకుంది. ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటికి చేరే రోడ్డుపై పోలీసులు పెట్టిన బారికేడ్లను కార్యకర్తలు పక్కకు నెట్టి ఒక్కసారిగా ముందుకెళ్లారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో కావలి స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ మాలకొండయ్యకు గాయాలయ్యాయి. ఓ సీఐ కింద పడిపోయారు. తోపులాటలో కానిస్టేబుల్‌పై వైకాపా కార్యకర్తలు పడిపోవడంతో ఆయన చేయి విరిగింది.

సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం తెస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపకల్పన
- క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

వనపర్తి, జూలై31 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగం సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- బాధ్యతలు మరింత విస్తరించ బోతున్నాయని వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు. ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ- చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు సిఎం రేవంత్‌కు చెంపపెట్టు

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద

హైదరాబాద్, జూలై31 (జనంసాక్షి) : తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు- పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ స్పీకర్ దగ్గర ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చరిత్రాత్మకం అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈ తీర్పు చెంపపెట్టు లాంటింది. ఉపఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును తప్పుపట్టేలా వ్యాఖ్యానించారు. ఇపుడు ఉపఎన్నికలు ఎలా వస్తాయో సుప్రీం కోర్టు చెప్పింది అని వివేకానంద తెలిపారు. సీఎం అధికార మదంతో రాచరికాన్ని తలపించేలా మాట్లాడిన వ్యాఖ్యలకు విరుద్ధంగా సుప్రీం తీర్పు ఇచ్చింది. సుప్రీం తీర్పు మీద ఏ మాత్రం నమ్మకమున్నా పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి. పార్టీ మారగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు సభ్యత్వాన్ని కోల్పోయేలా చట్టం తెస్తామని ఏఐసీసీ మేనిఫెస్టోలో చెప్పారు. పాంచ్ న్యాయ్ సూత్రాల్లో అది ఒకటని రాహుల్ చెప్పారు. ఏ మాత్రం తాను మేనిఫెస్టోలో పెట్టిన దానిపై గౌరవమున్నా రాహుల్ ఎమ్మెల్యేల అనర్హత వేటు కోసం చొరవ చూపాలి అని వివేకానంద పేర్కొన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీది ఓ మాట.. గల్లీలో రేవంత్ రెడ్డిది ఇంకో మాట. ద్వంద్వ ప్రమాణాలకు కాంగ్రెస్ చిరునామాగా మారింది. రేవంత్ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి వ్యతిరేకంగా సుప్రీం తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ ఆహ్వానిస్తుంది. ఇక మూడు నెలలు ఆగకుండా స్పీకర్ వెంటనే తన నిర్ణయం ప్రకటించాలి. సుప్రీంకోర్టు తాజా తీర్పు మా పార్టీ తొలి విజయం.. ఈ విజయ పరంపర కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా బుద్ధి తెచ్చుకుని వ్యవహరించాలని ఎమ్మెల్యే వివేకానంద మండిపడ్డారు.

అంతరాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో విజేత హవేరీ క్లస్టర్

హైదరాబాద్ (జనంసాక్షి) : మూడు రోజులుగా పియం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం గోపనపల్లి, రంగారెడ్డిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా హవేరీ క్లస్టర్ నిలిచింది. జూలై 29 నుండి 31 వరకు జరిగిన ఈ పోటీల్లో దక్షిణ భారతదేశానికి చెందిన రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల వాలీబాల్ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఎనిమిది క్లస్టర్లు మిగిలిన ఏడు క్లస్టర్ల తో పోటీపడి సెమీ ఫైనల్‌కు చేరడం విశేషం. బాలబాలికలు అండర్ 19, 17, 14 ప్రతి విభాగంలో విన్నర్, రన్నర్‌లుగా పలు టీములు నిలిచాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ రీజియన్ నవోదయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహర ఛాంపియన్ షిప్ ను ప్రకటించారు. ముగింపు కార్యక్రమం జవహర్ నవోదయ విద్యాలయం ప్యారాస్పోర్ట్స్ క్రీడాకారులను కూడా కమిషనర్ సన్మానించారు. ఇటీవల థాయ్ ల్యాండ్‌లో జరిగిన క్రీడల్లో రంగారెడ్డి పేరా విద్యార్థి క్రీడాకారులు బంగారు పతకాలను సాధించారు. ఈ ముగింపు కార్యక్రమంలో నేషనల్ లీడర్ షిప్ ఇన్స్టిట్యూట్ నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ నాగభూషణం, విద్యాలయ ప్రిన్సిపాల్ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

కేంద్రానికి శశిథరూర్ సూచన

న్యూఢిల్లీ, జూలై31 (జనంసాక్షి) : ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గదన్ని కాంగ్రెస్ సీనియర్ నేత,ఎంపి శశిథరూర్ అన్నారు. ఇవ మన వాణిజ్యంపై తీవ్రప్రభావం చూపుతుందని అన్నారు. భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు- ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఎం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటు-ందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి పోకుండా.. న్యూదిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు- పెనాల్టీలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు- తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూదిల్లీ ఒకటని ఈ సందర్భంగా మళ్లీ ఆరోపించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తమకు సంబంధం లేదని ఆయన మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి ఆర్థికవ్యవస్థను మరింత పతనం చేసుకుంటు-న్నాయని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి కోసమే ఫిరాయించా: తెల్లం

భద్రాచలం, జూలై 31 (జనంసాక్షి) : భారత రాష్ట్ర సమితినుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహిస్తానని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకటరావు అన్నారు. కోర్టు తీర్పులపై తమకు గౌరవం ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా భద్రాచలం అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్న ఆయన.. ఒకవేళ ఉపఎన్నికలు వచ్చినా మళ్లీ గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి తనకు ముఖ్యమని అన్నారు. వెనకబడ్డ భద్రాచలం విషయంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు.

విజయ్ దేవరకొండ కేసు విచారణ

తీర్పును వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై31 (జనంసాక్షి) : సినీ హీరో విజయ్ దేవరకొండ దాఖలు చేసిన ఫిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్ పై తీర్పు వాయిదా వేసింది. గతంలో విజయ్ దేవరకొండ ఓ మూవీ ఈవెంట్‌లో గిరిజనులను కించపరిచేలా, వారి ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ గిరిజన సంఘాల నాయకులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని విజయ్ దేవరకొండ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విజయ్ తరఫు న్యాయవాది కోర్టులో ఇవాళ తన వాదనలు వినిపించారు. విజయ్ వ్యాఖ్యలు చేసిన రెండు నెలలు తరువాత గిరిజన నాయకులు ఫిర్యాదు చేశారని, ఇందులో దురుద్దేశం ఉందని ఆయన కోర్టుకు తెలిపారు. విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమాల్లో క్షమాపణ కూడా చెప్పారని హైకోర్టుకు వివరించారు. అయితే సోషల్ మీడియాలో చెప్పిన క్షమాపణలు పరిగణలోకి తీసుకోకూడదని ప్రతివాదుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరువురి వాదనలు ముగియడంతో హైకోర్ట్ తీర్పును వాయిదా వేసింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370